వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక పత్రిక

మే 2007 | 70 | రు. 10

- ఫోకస్ : ఇరవైఐదు సంవత్సరాల తెలుగుదేశం - ఒక ప్రాంతీయ పార్టీ జయాపజయాలు
- పచ్చని పల్లెల్లో సెజ్ చిచ్చు
- తెలంగాణ - అంబేద్కర్
- రాష్ట్రాలకు కేంద్రం కుచ్చుటోపీ
- అమిత వస్త్రోత్పత్తితో ప్రమాదం
- ప్రపంచీకరణ - గ్రామీణ స్త్రీల సమస్యలు

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక పత్రిక
సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

వార్షిక చందా: రు.120 విడి ప్రతి : రు. 10


70 మే 2007

సంపాదకీయం

సంయమనం అవసరమని చూపుతున్న బాబ్లీ

మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బాబ్లీ ఆనకట్ట మీద ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే పద్ధతిలో అటు మహారాష్ట్ర రాజకీయ నాయకులు, ఇటు ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకులు పెద్దఎత్తున వివాదాన్ని సృష్టిస్తున్నారు. సమాఖ్య స్వభావంగల రాష్ట్రాల యూనియన్ అయిన భారతదేశంలో అంతర్రాష్ట్ర జల వివాదాలను ఈ స్థాయిలో రెచ్చగొట్టనవసరం లేదు. దాదాపు దేశంలోని అన్ని ప్రధాన నదులు ఎన్నో రాష్ట్రాలగుండా ప్రవహిస్తున్నాయి. ఆయా రాష్ట్రాలకు, పరీవాహక ప్రాంతాలకు ఆయా నదీ జలాలలో ఎంతెంత శాతం నీరు వాడుకునే హక్కు ఉన్నదో అంతర్రాష్ట్ర జల వివాదాల ట్రిబ్యునళ్లు, రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక, బహుళపక్ష ఒప్పందాలు జరిగి ఉన్నాయి. ఒకవేళ ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా ఆ ఒప్పందాలను ఉల్లంఘిస్తున్నట్టయితే ఆ ఉల్లంఘనలను అడ్డుకోవడానికి పద్ధతులు కూడ ఉన్నాయి. అసలు అంగీకరించిన వాటా ప్రకారం నీటి వినియోగానికి ఆనకట్టలు కట్టుకోవడానికి కూడ పొందవలసిన అనుమతులు ఎన్నో ఉన్నాయి. కాని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ ఈ పద్ధతులలో ఏ ఒక్కదాన్నీ ఎప్పుడూ తు.చ. తప్పకుండా పాటించిన పాపానపోలేదు. నదీజల వినియోగానికి ఆనకట్టలు కట్టడం ప్రజల సాగునీటి, తాగునీటి అవసరాలు తీర్చడం కోసం కాకుండా కేవలం ప్రచారార్భాటంగా, రాజకీయ ఎత్తుగడగా, కాంట్రాక్టర్లకు సొమ్ము సమకూర్చి పెట్టే కామధేనువుగా, ఆ నిధులలోంచి తమ ముడుపులు, మామూళ్లు, లంచాలు సంపాదించుకునే కల్పవృక్షాలుగా నీటిపారుదల ప్రాజెక్టులను చూడడం మన రాజకీయ నాయకులకు అలవాటయింది. అందువల్ల కేంద్ర జలసంఘం, పర్యావరణ శాఖ, అటవీ శాఖ, ఆర్థిక శాఖ, ప్రణాళికా సంఘం, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు, ముంపు ప్రాంతాలలోని గ్రామ సభలు వంటి ఎన్నో జాతీయ, రాష్ట్ర, ప్రాంతీయ సంస్థలు అనుమతించిన తర్వాతనే ప్రారంభించవలసిన పథకాలను ఏ అనుమతులూ లేకుండా ప్రారంభించడం, కొంతకాలం తర్వాత, అప్పటికే వెచ్చించిన నిధులు వృథా అయిపోతాయనే సాకుతో మిగిలిన నిర్మాణాలు కొనసాగించడం అన్ని ప్రభుత్వాలకూ అలవాటయింది. ఈ నేపథ్యంలో బాబ్లీ ఆనకట్ట ఉదంతంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాల ఉల్లంఘనలకు పాల్పడిందంటే అది ఒక్కటే బాధ్యురాలు కాదు. ఇవాళ మహారాష్ట్ర ప్రభుత్వాన్ని నిందిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆ ప్రభుత్వాన్ని ప్రస్తుతం నడుపుతున్న కాంగ్రెస్, గతంలో నడిపిన తెలుగుదేశం అన్నిటికీ ఈ పాపంలో భాగం ఉంది. అందువల్ల ఆ రెండు పార్టీలకూ బాబ్లీ నిర్మాణాన్ని ప్రశ్నించే నైతిక అధికారం లేదు. కాగా, తెలంగాణ నీటిపారుదలకు, వ్యవసాయానికి బాబ్లీతో సమానంగా నష్టం చేకూర్చగల పోలవరం, పులిచింతల, పోతిరెడ్డిపాడు వంటి పథకాల విషయంలో పల్లెత్తుమాట మాట్లాడని రాజకీయ పక్షాలకు బాబ్లీ గురించి మాట్లాడే అర్హత లేదు. గోదావరి పొడవునా మహారాష్ట్ర, చత్తీస్‌ఘర్, ఒరిస్సాల నుంచి ప్రవహించే ఉపనదులు, అంతర్రాష్ట్ర నదులు ఎన్నో ఉన్నాయి గనుక ఆయా రాష్ట్రాలతో సంఘర్షణ పెట్టుకునే పద్ధతిలో కాక, సమన్వయం ద్వారా, ఇచ్చిపుచ్చుకునే వైఖరి ద్వారా బాబ్లీ ఘర్షణను నివారించడం అవసరం. ఒప్పందాలకు అనుగుణంగా మహారాష్ట్ర ప్రభుత్వం తన అవసరాల మేరకు, తెలంగాణ పొట్టకొట్టకుండా ఏ నిర్మాణం తలపెట్టినా, సంయుక్త పర్యవేక్షణలో జరగాలని మధ్యే మార్గాన్ని సూచించి వివాదాన్ని పరిష్కరించడం అవసరం. ◆

లోపలి పేజీల్లో...



25 సంవత్సరాల తెలుగు దేశం - ఒక ప్రాంతీయ పార్టీ జయాపజయాలు

తెలుగుదేశం చరిత్రను నిశితంగా పరిశీలిస్తే మొదటిసగంలో ఏదో ఒక మేరకు ప్రజాకర్షక నినాదాలు ఇవ్వడం మాత్రమే కాక వాటి అమలు కొరకు కూడా ప్రయత్నించి కొన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం, పాత సామాజిక ఆర్థిక రాజకీయ వ్యవస్థలను బద్దలుకొట్టడానికి ప్రయత్నించడం భాష, సంస్కృతి, విలువల విషయంలో ఆదర్శాలు ప్రకటించడం కనబడతాయి. కాని రెండోసగంలో ప్రజాకర్షక నినాదాలు కేవలం కాగితాలకు, ఉపన్యాసాలకు పరిమితమైపోయి, ప్రపంచబ్యాంకు, బహుళజాతి సంస్థలు, దేశదేశాల సంపన్నులు, పైరవీకారులకొరకే ప్రభుత్వం ఉన్నదనే స్థితిని తెలుగుదేశం తీసుకొనివచ్చింది.

25 సంవత్సరాల తెలుగు దేశం - ఒక ప్రాంతీయ పార్టీ జయాపజయాలు

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక పత్రిక

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040 - 66843495
ప్రింటర్స్ : చరితా ఇంప్రెషన్స్, అజామాబాద్, హైదరాబాద్.

సహాయ సంపాదకులు : డి.వి.రామకృష్ణారావు
సర్క్యులేషన్ మేనేజర్ : వై. రామచంద్రం
9949391028
కంపోజింగ్ & లే ఔట్ : సి. రాజశేఖర్

మార్చ్ సంచికలో ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం – మూడు వ్యాసాలు ఆణిముత్యాలు. ఉజ్వల దీపాలను చూపించిన సమగ్ర రచనలు – సయ్యద్ నసీర్ అహ్మద్, వకుళాభరణం రామకృష్ణ వివరించిన సమాచారం బహుళ ప్రచారం పొందవలసిన అవసరం ఉంది. బేగం హజరత్ మహల్, బేగం అజాజున్ వంటి వారి సాహసం, త్యాగం గురించి చదివితే ఒళ్లు పులకరిస్తుంది. ఆ స్ఫూర్తి మన ఈ తరాల్లోకి ప్రసరిస్తే, మహిళాజనం ఎంత తేజోవంతం ఔతారో. లక్నో వంటి నగరాల్లోని చరిత్రను కాపాడుకోలేని దురదృష్ట జాతి మనది అని వేదన కలుగుతుంది.

– తురగా జానకీరాణి

హైదరాబాద్

ఏప్రిల్ సంచికలో 'పత్రికారంగం – పతనమవుతున్న విలువలు' అన్న శీర్షికతో వి. హనుమంతరావు రాసిన ఆర్టికల్ చూశాను. ఆలస్యంగానైనా మార్గదర్శి పైనా ఇతర అంశాలపైనా రాసినందుకు సంతోషం. కాని అదే పనిలో పనిగా 'పాత్రికేయుల యూనియన్ల' నాయకులపై ఆయన విసిరిన విసుర్లు ఆయనలోని ద్వేషాన్ని తప్ప, వాస్తవాన్ని ప్రతిబింబించవు. హనుమంతరావు గారికి నిజాయితీ ఉంటే ఈ విసుర్లకు వివరాలు రాస్తే సమంజసంగా ఉండేది. తమ స్వార్థానికీ, ద్వేషానికీ ఇతరులను గుడ్డిగా విమర్శించడం హనుమంతరావు గారికి తగనిపని. స్వార్థాలకు జర్నలిజం వృత్తి ఎలా బలైపోతుందో, గుడ్డి ద్వేషాలకు కూడా బలౌతుందని చెప్పడానికి ఈ విషయంలో ఆయన రాత ఒక నిదర్శనం. ఇప్పటికైనా నిజాయితీ ఉంటే వాస్తవాలతో ముందుకు రావాలని కోరుతున్నాను.

– కె. శ్రీనివాస్ రెడ్డి

సెక్రటరీ జనరల్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్

హైదరాబాద్

పాఠకుల వీక్షణం

ఈ మధ్య వీక్షణం మరీ ఎకడమిక్‌గా తయారైంది. దాదాపుగా అన్ని వ్యాసాలు పాఠాలుగా ఉంటున్నాయి. మామూలు జనం చదవడం చాలా కష్టంగా తయారైంది. మొదట వచ్చిన వాటికీ, జనవరి 2007 తరువాత వాటికీ స్పష్టంగా తేడా కనబడుతుంది. చాలా మంది ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి అందరినీ చదివించే విధంగా వ్యాసాలు రావాలని ఆకాంక్షిస్తున్నాం.

– ఎస్. నారాయణమ్మ

నెల్లూరు

పశ్చిమ బెంగాల్ నందిగ్రామ్‌లో జరిగిన పోలీస్ కాల్పుల సంఘటనకు సంబంధించి వామపక్ష ప్రభుత్వం జరిపిన దురంతాలు, ప్రభుత్వ ప్రోత్సాహంతో జరిగిన భయానక సంఘటనలకు సంబంధించిన మేధా పాట్కర్ బృందం రిపోర్ట్ చదువుతుంటే ఒళ్లు గగుర్పొడిచింది.

ఇదేదో ఆషామాషీగా బిజెపి మోపిన ఆరోపణ అసలేకాదు. సాక్షాత్తు నర్మదా బాచావో ఆందోళన్ నేషనల్ అలియన్స్ ఆఫ్ పీపుల్ మూవ్‌మెంట్ నాయకురాలు 'మేధా పాట్కర్' సహ సభ్యులుగా గల మహామహుల బృందం నిజనిర్ధారణ చేసిన నివేదికలోని 20 అంశాలు చదువుతుంటే నాడు నాజీ నియంతల దురంతాలను మించిపోయిందనిపిస్తుంది. అన్నింటినీ మించి వామపక్ష భావజాలానికి తూట్లుపొడిచే దుశ్చర్యలు.

అమెరికా సామ్రాజ్యవాదం గురించి, అమెరికా ఇండియాపై చలాయిస్తున్న ఆధిపత్యం గురించి, పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడి గురించి, సద్దాం హుస్సేన్ ఉరితీత గురించి అమెరికా దేశపు పరోక్ష ప్రత్యక్ష హస్తం గురించి పదే పదే ఊదరగొట్టే వామపక్ష ప్రభుత్వమేనా పశ్చిమ బెంగాల్‌ను పాలిస్తున్నది?

గుజరాత్‌లో నరేంద్రమోడి ప్రభుత్వం పరోక్షంగా జరిపించిన కిరాతక దాడిని మించిపోయిందీ బుద్ధదేవ్ భట్టాచార్య ప్రభుత్వం. నందిగ్రామ్‌లో జరిపించిన అత్యాచారాలు, ముంబాయిలో శివసైనికుల వీరంగం గురించి చిందులేసే వాళ్లే స్త్రీలపై అత్యాచారాలు, మానభంగాలు యదేచ్ఛగా జరిపించడం, ఇరువురు వామపక్ష కార్యకర్తలు అయితే ఒక ఆందోళనకారుడి రెండు కాళ్లను చెరోవైపు చీల్చడం వంటి దారుణాలు ఏ సిద్ధాంతాలను బలపరుస్తున్నాయో వివరించవలసిన అవసరం ప్రభుత్వం పై ఉంది.


– జూల ముత్తెన్న

మెదక్


ఆదివాసీ, దళిత, ముస్లిం, బహుజన స్త్రీల కవిత్వాన్ని తెలుగు సాహిత్యంలోకి సంకలనంగా తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాం. అందులో భాగంగా ఆదివాసీ, దళిత, ముస్లిం, బహుజన స్త్రీల కవిత్వాన్ని ఆహ్వానిస్తున్నాం. తమ కవితల్ని ముద్రితాలు, అముద్రితాలు ఏమున్నా ఈ కింది అడ్రస్‌లకు పంపించగలరు.


షాజహానా,	**జూపాక సుభద్ర,**
10-1639,	13-6-462/ఎ/27,
చింతల్ బస్తీ, ఖైరతాబాద్,	భగవాన్‌దాస్‌బాగ్, తాళ్లగడ్డ,
హైదరాబాద్ – 500 004.	హైదరాబాద్ – 267.
ఫోన్ : 9440322361	ఫోన్ : 9441091035


కొత్తపుస్తకాలు















- **శాంతి కోసం** – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం – నక్సలైట్ పార్టీల మధ్య శాంతి చర్చలు – పౌరస్పందన వేదిక ప్రచురణ, 304 పేజీలు, 1/8 డెమీ, ప్రతులకు – ఎన్.ఆర్. శంకరన్, కన్వీనర్, పౌరస్పందన వేదిక, 114, సఫైర్, అమృతాహిల్స్, పంజాగుట్ట, హైదరాబాద్ – 500 082.
- **సహజాతం** – గుడిపాటి – చుక్కా రామయ్య విద్యాపీఠం ప్రచురణ, 98 పేజీలు, 1/8 డెమీ, రు. 40, ప్రతులకు – జూలూరు గౌరిశంకర్, జర్నలిస్టు, 1-8-702/33/20ఎ, పద్మాకాలనీ, నల్లకుంట, హైదరాబాద్, అన్ని పుస్తకాల షాపుల్లో లభించును
- **కాలికస్పృహ** – మరికొన్ని సాహిత్య వ్యాసాలు – కల్లూరి భాస్కరం – స్పృహ సాహితీ సంస్థ ప్రచురణ, 115 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు – జూలూరు గౌరిశంకర్, జర్నలిస్టు, సంపాదకుడు, 1-8-702/33/20ఎ, పద్మాకాలనీ, నల్లకుంట, హైదరాబాద్, అన్ని పుస్తకాల షాపుల్లో
- **జిజ్ఞాస తరంగాలు** – వి. కామేశ్వరరావు – రైల్ శక్తి ప్రచురణ, 72 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు : వి. కామేశ్వరరావు, ఇ.నెం. 73, రైల్ విహార్, లింగంపల్లి, హైదరాబాద్ – 500 019. ఫోన్ 9849008986, మైత్రీ బుక్ హౌస్, విజయవాడ.
- **విద్యా వ్యాపార పరిశ్రమ** – ఎన్‌వైఎస్ – పిడిఎస్ఒ సంయుక్త ప్రచురణ, 26 పేజీలు, 1/8 డెమీ, రు. 5, ప్రతులకు: మైత్రీ బుక్‌హౌస్, మసీదు వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ – 520 002.
- **లెగసీ అండ్ కంటిన్యుటీ : సోషల్ రిఫార్మ్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్. 1850–2000** – వకుళాభరణం రామకృష్ణ–కె.ఎచ్.ఎస్.ఎస్. సుందర్, రిసెర్చ్ అండ్ రిసోర్స్ సెంటర్ ప్రచురణ, ఇంగ్లిష్‌లో, 223 పేజీలు, 1/8 డెమీ, ప్రతులకు : రిసెర్చ్ అండ్ రిసోర్స్ సెంటర్, సంస్కార్, వర్ని – 503 201.
- **పాత్రికేయ పాళి** – నాగసూరి వేణుగోపాల్ – ఆకాష్ పబ్లికేషన్స్, 53 పేజీలు – 1/8 డెమీ, ప్రతులకు : ఆకాష్ పబ్లికేషన్స్, జి–14, ఇండస్ట్రియల్ ఎస్టేట్, సామర్లకోట – 533440, నాగసూరి హంసవర్ధిని, డి–1, ఎ.ఐ.ఆర్. క్వార్టర్స్, సిరిపురం, వైజాగ్ – 530003
- **పత్తిసాగు పై ఆదివాసీల దృక్పథం** – ఒక అధ్యయనం – లయ ప్రచురణ, 28 పేజీలు – 1/8 డెమీ, లయ, 501, కురుపాం కాసిల్, ఈస్ట్ పాయింట్ కాలనీ, విశాఖపట్నం – 530 017. ఫోన్ – 0891 – 2530071
- **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నిర్మాత బూర్గుల రామకృష్ణరావు** – టి. ఉడయవర్లు – స్పృహ సాహితీ సంస్థ ప్రచురణ, 28 పేజీలు, 1/8 డెమీ, రు. 10, ప్రతులకు – జూలూరు గౌరిశంకర్, జర్నలిస్టు, సంపాదకుడు, 1-8-702/33/20ఎ, పద్మాకాలనీ, నల్లకుంట, హైదరాబాద్ – 500 044, అన్ని పుస్తకాల షాపుల్లో లభించును.
- **బుద్ధిస్ట్ ఫిలాసఫీ** – కత్తి పద్మారావు – అనువాదం : డి. ఆంజనేయులు – లోకాయుక్త ప్రచురణ, 126 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి, లుంబినివనం, అంబేద్కర్ కాలనీ, పొన్నూరు – 522 124. విశాలాంధ్ర బుక్ హౌస్, నవోదయ బుక్ హౌస్.











నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని నాలుగైదు మండలాల్లో ప్రభుత్వం చేపట్టిన సెజ్‌లు పేదల జీవితాలను నామరూపాలు లేకుండా ఎలా నాశనం చేస్తున్నాయో వివరిస్తున్నారు ఘంటా చక్రపాణి

పచ్చని పల్లెల్లో సెజ్ చిచ్చు

ప్రపంచీకరణ ఫలితాలు ఊహించిన దానికంటే వేగంగా ఒక్కొక్కటీ బయటపడుతున్నాయి. ఇంతకాలం చాపకింది నీళ్లలా పరోక్షంగానే నష్టం కలిగించిన ఆర్థిక సంస్కరణలు, ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్‌ల)తో నేరుగా గ్రామీణ జనజీవితాల్ని ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వ్యవస్థను ముట్టడిస్తున్నాయి. మన రాజకీయ, పరిపాలన, న్యాయ వ్యవస్థలు చేష్టలుడిగి చూస్తోంటే ఈ విధానాలను ఆసరా చేసుకొని పల్లెల్లో ప్రవేశించిన బహుళజాతి కంపెనీలు, బడా వ్యాపార సంస్థలు ఈస్టిండియా కంపెనీని తలపిస్తున్నాయి. ఇప్పుడు దేశంలోని పల్లెపల్లెనా నయా సామ్రాజ్యవాద పోకడలు 'సెజ్'ల రాకతో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నందిగ్రాంతో 'సెజ్'లపై రాజకీయ, పౌర సమాజంతో మొదలైన చర్చ కొత్తగా ఆర్థిక విధానాల విశ్లేషణకూ కొత్త తరహా ప్రతిఘటనా పోరాటాలకు ఊపిరి పోసినట్టు తోస్తోన్నా, పరిస్థితి చేజారిపోయిందన్నది వాస్తవం. నిజానికి నందిగ్రాం కన్నా తీవ్రస్థాయిలో నష్టం కలిగించే అనేక కంపెనీలు ఇప్పటికే దేశవ్యాప్తంగా రంగంలోకి దిగాయి. పల్లెల్లో వ్యవసాయ క్షేత్రాలు, అడవులు, చెరువులు ఇతర గ్రామీణ ఉమ్మడి వనరులన్నింటినీ చదును చేసి గ్రామాల మధ్య, జిల్లాల మధ్య, రాష్ట్రాల మధ్య సరిహద్దుల్ని చెరిపేస్తున్నాయి. ఆ పనిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి కావడం ఆందోళన కలిగించే విషయం. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని నాలుగైదు మండలాల్లో తమిళనాడును కలుపుతూ ప్రభుత్వం చేపట్టిన 'సెజ్'లు అక్కడి వెనుకబడిన, నిరుపేద ప్రజల జీవితాలను నామరూపాలు లేకుండా నాశనం చేస్తున్నాయి.

నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో తమిళనాడు రాష్ట్రానికి ఆనుకుని ఉన్న తడ, సూళ్లూరుపేట, వరదయ్యపాలెం, సత్యవేడు మండలాల్లో దాదాపు ఇరవై వేల ఎకరాల్లో ప్రత్యేక మండలాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం పూనుకుంది. చెన్నై నగరాన్ని కలిపే ఐదో నెంబర్ జాతీయ రహదారిని, రైలుమార్గాన్నీ ఆనుకొని ఉన్న ఈ భూముల సేకరణ, వేలం పనులు శరవేగంతో సాగిపోతున్నాయి. ఇప్పటికే తడ మండలాలో అపాచీ అనే చైనా కంపెనీ 'సెజ్'ను ఏర్పాటు చేసి చెప్పుల తయారీ మొదలుపెట్టింది. ఈ భూములన్నీ చెన్నై ఓడరేవుకు చేరువలో ఉండడం వల్ల, సముద్రతీరానికి, రైలు మార్గానికి, హైవేకి ఆనుకొని ఉండడం వల్ల ప్రభుత్వం ఈ ప్రాంతమంతా ప్రత్యేక ఆర్థిక మండలాలుగా రూపొందించి, విదేశీ కంపెనీలను, పెట్టుబడిదార్లను, బడా పారిశ్రామికవేత్తలను ఆకర్షించాలని చూస్తోంది. అందుకు అనుగుణంగా ఇప్పటికే భూసేకరణ, భూముల అభివృద్ధి పనులు ప్రారంభమైనాయి. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఈ పనులను నిర్వహిస్తోంది. దేశంలోని అన్ని ప్రత్యేక ఆర్థిక మండలాల్లో ప్రాంతీయ అగ్రగామి కాబోతోంది. సేకరించిన భూములకు ఇప్పటికే మంచి డిమాండ్ వస్తోంది. చెన్నై సిటీకి చేరువగా ఉండడం, రవాణా మార్గాలు మెండుగా ఉండడం దీనికి ప్రధాన కారణం అని ఈ ప్రాంతంలో భూ సేకరణ పనులు చూస్తోన్న ప్రభుత్వ అధికారి ఒకరు చెప్పారు.

తడ మండలంలోని కొండూరు, కడతారు, అక్కంపేట, పెదమాంబట్టు, చినమాంబట్టు, ఎన్.ఎం. కండ్రిగ గ్రామాల్లో వెయ్యి ఎకరాలతో రాష్ట్రంలో మొట్టమొదటి ప్రత్యేక ఆర్థిక మండలిని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం 2006 ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో 708 ఎకరాలను అపాచీ కంపెనీ అదే నెల 24న తీసుకుని పనులు ప్రారంభించింది. ఆరు నెలల్లో ఆ కంపెనీ, పరిశ్రమ ప్రారంభించడమే కాకుండా గత ఐదు నెలలుగా ఉత్పత్తి కూడా మొదలుపెట్టింది. చైనాకు చెందిన ఈ కంపెనీ అమెరికన్ బహుళజాతి కంపెనీల కోసం చెప్పులు తయారు చేస్తుంది. ప్రస్తుతం 'ఆడిడాస్' కంపెనీ ఆర్డర్ల మేరకు షూ తయారుచేసి ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. అపాచీ కంపెనీకి ఇవ్వగా మిగిలిన భూమిని కూడా ఏదైనా విదేశీ కంపెనీకి ఇవ్వాలని ప్రభుత్వం చూస్తోంది. గతంలో వోక్స్‌వాగన్ కార్ల ఫ్యాక్టరీ కోసం కూడా ఈ స్థలాన్ని చూపించామని, అలాగే పలు ఐటి రంగ సంస్థలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయని స్థానిక రెవెన్యూ అధికారి ఒకరు చెప్పారు. ఇప్పుడు ఈ ప్రాంతంలోని మండల రెవెన్యూ కార్యాలయాలన్నీ రియల్ ఎస్టేట్ ఆఫీసులుగా మారిపోయాయి. భూసేకరణ, క్రయవిక్రయాలు, గ్రామాల్లో సదస్సులు నిర్వహించి రైతులను భూములు అమ్ముకునేలా ఒప్పించే పనిలో అధికారులు బిజీ బిజీగా ఉన్నారు. మరో వైపు చెన్నై, హైదరాబాద్ నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలకు ఆయా స్థలాలు చూపించడం, బేరసారాలు నడపడం అధికారులకు ప్రధానమైన పని అయిపోయింది. ఐదో నెంబర్ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న తడ మండల రెవెన్యూ అధికారి కార్యాలయం ముందు బారులు తీరి ఉండే విలాసవంతమైన కార్లను చూసిన వారికెవరికైనా ఈ ప్రాంతంలో ఏదో గొప్ప అభివృద్ధే జరుగుతున్నదన్న భ్రమ కలుగక తప్పదు. ఈ మండలంలో ఇప్పటివరకు సేకరించిన వెయ్యి ఎకరాలు ఎపిఐఐసి స్వాధీన పరుచుకున్నదని, మరో 314 ఎకరాలు కూడా దీనిలో కలుపబోతున్నామని, ఆ భూముల సేకరణ జరుగుతున్నదని తడ మండల రెవెన్యూ ఆధికారి ఆనందం చెప్పారు.

తడ మండలాన్ని ఆనుకుని చిత్తూరు జిల్లా వరదయ్య పాలెం మండలం ఉంటుంది. ఇప్పుడు సెజ్ వల్ల ఈ రెండు జిల్లాల సరిహద్దులు నిజంగానే చెరిగి పోయాయి. తడ సెజ్‌ను ఆనుకుని ఉన్న తొండూరు – మోపురు పల్లె, సిద్ధన్న అగ్రహారం గ్రామాల్లో 2046 ఎకరాలను కూడా ప్రభుత్వం తాజాగా సేకరించింది. ఇందులో దాదాపు సగం భూమి రైతులు వ్యవసాయం చేసుకుంటున్న పట్టా భూమి. వారందరికీ ఏప్రిల్ మొదటి వారంలో నష్టపరిహారం పంపిణీ చేసి భూముల్ని ప్రభుత్వం (ఎపిఐఐసి) స్వాధీనం చేసుకుంది. అలాగే ఇదే మండలంలో చెదులుపాకం, చిలుమత్తూరు గ్రామాల భూములు స్వాధీనానికి కూడా చర్యలు మొదలైనాయి. ఈ రెండు గ్రామాల్లో 2543 ఎకరాల భూమి సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఆశ్చర్యమేమిటంటే ఇందులో దాదాపు 2100 ఎకరాలు రైతుల సాగుభూమి ఉంది. కాగా కేవలం 446 ఎకరాలు మాత్రమే ప్రభుత్వ భూమి.

రైతుల నుంచి భూములు సేకరించకూడదని కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఆదేశించినట్టు చెపుతున్నా మన రాష్ట్రంలో భారీగా రైతుల భూములనే సేకరిస్తున్నారు. రైతు ప్రభుత్వంగా పదేపదే ప్రకటించుకుంటున్న ముఖ్యమంత్రికి తెలియకుండానే గ్రామాలకు గ్రామాలు అమ్ముడు పోతున్నాయా అన్నది అర్థం కా(లే)ని ప్రశ్న. చిలమత్తూరునే ఉదాహరణగా తీసుకుందాం. ఈ గ్రామం వరదయ్య పాలెం మండలంలో భాగం. ఈ గ్రామంలో సెజ్‌కు సేకరిస్తోన్న భూమిలో 1024.56 ఎకరాలు పట్టాభూమి. రైతులు చెరుకు, వరి తదితర పంటలు పండించుకుంటోన్న వ్యవసాయ భూమి. ఈ గ్రామానికి ఐదారు కిలోమీటర్లలోపే కె.సి.పి. మయూర చక్కెర ఫ్యాక్టరీ కూడా ఉంది. ఈ ఫ్యాక్టరీ 2500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నడుస్తోంది. అంటే ఇక్కడ చెరుకుకు కొదువ లేదు. పంటలకు ఎంతో అనువైన ఈ భూములను రైతుల నుంచి లాగేసుకొంటున్నారు. కాగా రైతులు స్వచ్ఛందంగా, ఏకాభిప్రాయంతో భూములు ఇచ్చేస్తున్నారని, వారికి ఎంతో లాభదాయకమైన నష్ట పరిహారాన్ని వారి అంగీకారం మేరకే నిర్ణయించామని వరదయ్య పాలెం ఎమ్మార్వో జయరాం చెపుతున్నారు. ఈ 'సెజ్'లో భూములు కోల్పోయిన వారికి మెట్ట అయితే ఎకరానికి రెండున్నర లక్షలు, మాగాణి అయితే మూడు లక్షల చొప్పున పరిహారం ఇస్తున్నారు. ఇది మార్కెట్ ధరకంటే చాలా ఎక్కువ అని అధికారులు చెపుతున్నారు.

వరదయ్య పాలెంను ఆనుకుని సత్యవేడు మండలం ఉంటుంది. సత్యవేడులో ఇప్పటికే ఎనిమిది గ్రామాలను గుర్తించారు. ఈ ఎనిమిది గ్రామాల్లో దాదాపు పదిహేను వేల ఎకరాల దాకా భూమిని సేకరించబోతున్నారు. దానికి సంబంధించిన పనులు కూడా మొదలైనాయి. సత్యవేడులో తమిళ సరిహద్దు గ్రామం చెంగంబాకం వరకు భూములన్నీ ఈ సెజ్ పరిధిలోకి రాబోతున్నాయి. అక్కడినుంచి మద్రాసు నగరం ఇరవై కిలోమీటర్ల లోపే ఉంటుంది. ఈ భౌగోళిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఇరవై వేల ఎకరాల భూములను లక్ష్యం చేసుకుని సెజ్‌లను ఏర్పాటు చేస్తోంది.

పేదలే సమిధలు

సెజ్‌లవల్ల పేద ప్రజానీకం ముఖ్యంగా వృత్తి పనుల్లో ఉండే వెనుకబడిన కులాలు, దళితులు, భూమిలేని పేదలు, వ్యవసాయ కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారు. మరోవైపు దేవాలయాల భూముల్లో, బంజరు భూముల్లో గ్రామ ఉమ్మడి అవసరాల కోసం ఉండే ప్రభుత్వ భూముల్లో సేద్యం చేసుకునే దళితులు, పశువుల కాపర్లు, యాదవులు ఉపాధి కోల్పోతున్నారు. ఇందుకు అపాచీ సెజ్‌ను ఆనుకుని ఉన్న మాంబొట్టు ఒక ఉదాహరణ.

మాంబట్టు గ్రామ జనాభా 2500. నిజానికి ఈ గ్రామంలో ఎస్.సి. (మాల) ఎస్.టి. (యానాది) బిసి (యాదవ, బైరి, దేవాంగ) కులాల వాళ్లే 90 శాతం ఉన్నారు. గ్రామంలో దాదాపు 60 రెడ్డి కుటుంబాలు మినహా అగ్రవర్ణాలు ఎవరూ లేరు. పది పదిహేను బిసి, ఐదారు ఎస్సి కుటుంబాలకు వ్యవసాయ భూములున్నా ప్రధానంగా మెజారిటీ భూముల యజమానులు రెడ్డి కులస్తులే. గ్రామంలో ఉన్న 70 మంది యాదవులు గొర్రెలు పెంచుకునే వాళ్లు. గ్రామంలో 79 ఎకరాల దేవాలయ భూములు, 673 ఎకరాల ప్రభుత్వ బంజరాయి గ్రామ అవసరాల కోసం ఉపయోగపడేది. ఈ మొత్తం భూమిని ప్రభుత్వం సెజ్‌గా ప్రకటించడంతో ఇప్పుడా గ్రామంలో ఉమ్మడి అవసరాలకు భూమి లేకుండాపోయింది. 'ఎంత గీపెట్టినా వినలేదు, మా అవసరాలు చూడలేదు, కలెక్టర్ వచ్చి అన్ని వసతులు సమకూరుస్తామని చెప్పారే తప్ప, ఒక్క ఎకరం భూమైనా వదిలిపెట్టలేదు. ఇప్పుడు గ్రామంలో ప్రజలకు దొడ్డికి వెళ్లడానికి కూడా స్థలం లేదు' అని ఆ గ్రామ సర్పంచ్ ప్రకాష్ చెప్పారు. ఏదో పరిశ్రమ వస్తుందని, ఉద్యోగాలు ఇస్తామని అంటే సరే అన్నాం కానీ ఇంత ముప్పు ముంచుకొస్తుందని ఊహించలేదని వాపోయాడు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూముల్లో చెలకతో పాటు రెండు చిన్న చిన్న చెరువులు, నీటి కుంటలు కూడా ఉన్నాయి. ఇప్పుడు గ్రామంలో పశువుల మేతకు చెలకల్లేవు. నీళ్లకు చెరువుల్లేవు. చేసేది లేక యాదవులు గొర్రెలు అమ్మేసుకొని కూలికి వెళ్తున్నారు. తరతరాలుగా స్వతంత్ర జీవనానికి, పశు పోషణ వృత్తికి అలవాటు పడ్డ వాళ్లు ఇవాళ వలస పక్షులై వెళ్లిపోతున్నారు.

ఈ గ్రామానికి అనుబంధంగా ఉన్న ఎన్.ఎం.కండ్రిగలో నివసిస్తున్న ఎనభై గిరిజన కుటుంబాలది మరీ విషాదకరమైన పరిస్థితి. సముద్ర తీరం పక్కన నివసిస్తూ ఉండే ఈ కుటుంబాలు 1984లో వరదలకు సర్వం కోల్పోయారు. వీరికి మాంబట్టు గ్రామ శివార్లలో ఎన్.ఎం. కండ్రిగ పేరుతో పునరావాస గ్రామం ఏర్పరిచారు. ఆ గ్రామం ప్రభుత్వ భూమి కావడంతో అక్కడే వ్యవసాయం చేసుకుంటూ, పశువులు మేపుకుంటూ బతుకుతున్న వాళ్లను సెజ్ పేరుతో ప్రభుత్వం మళ్లీ తరిమేసింది. ఇప్పుడు ఈ పల్లెకు చెందిన 70 యానాది కుటుంబాలు, పది వడ్డెర కుటుంబాలు నిలువ నీడ లేని పరిస్థితిలో ఉన్నాయి. ఈ గ్రామంలో సెజ్ వల్ల ఉపాధి కోల్పోయిన వారికి ఇక్కడి కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, పక్కా ఇల్లు నిర్మించి అన్ని వసతులు కల్పిస్తామని గ్రామ సభల్లో కలెక్టర్ ఇచ్చిన హామీ అమలు కాకుండానే పోయింది. కంపెనీల నియమ నిబంధనలకు ఇక్కడి యువకులు సరితూగడం లేదు.

ఇది ఒక్క మాంబట్టు పరిస్థితే కాదు. మొత్తం ఈ ఇరవై వేల ఎకరాల్లో విస్తరించబోయే సెజ్‌లు ఇదే సామాజిక సంక్షోభాన్ని సృష్టించబోతున్నాయి. ఈ 'సెజ్'ల విస్తరణ చేపట్టిన గ్రామాలన్నీ సూళ్లూరుపేట, సత్యవేడు శాసనసభ నియోజకవర్గాల్లో ఉన్నాయి. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులు కలిసి జనాభాలో 80–85 శాతం ఉన్నా

ఈ రెండు నియోజకవర్గాలు ఎస్.సి. రిజర్వ్‌డ్‌గా ఉన్నాయి. గ్రామాల్లో ప్రధానంగా మాల, యానాది, వడ్డెర, యాదవ, దేవాంగ (చేనేత) బోయ, వాల్మీక, పల్లె రెడ్డి వంటి కులాల జనాభా అధికం. రెవెన్యూ అధికారుల ప్రకారం ఈ ప్రాంతంలో పదుల ఎకరాల్లో భూములున్న రైతులు ఎక్కువగా లేరు. అందరూ చిన్న, సన్నకారు రైతులే. దాదాపు 80 శాతం మంది 4-5 ఎకరాలు లోపు భూములున్న వారే. వీరే ఎక్కువగా నష్టపోయి శాశ్వతంగా ఉపాధి కోల్పోయే పరిస్థితులు 'సెజ్'ల వల్ల తలెత్తాయి.

కొనబోతే కొరివి

'సెజ్'ల కోసం భూసేకరణ మొదలయ్యిందో లేదో పరిసరాల భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. భూసేకరణలో రైతులకు నిర్ధారించిన మార్కెట్ వ్యాల్యూ కంటే ఇప్పుడు భూములు కోల్పోయిన రైతులు కొనుక్కోవాలంటే కనీసం 8 నుంచి 10 రెట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో నష్టపరిహారం పొందిన రైతులెవ్వరూ కనీసం కోల్పోయిన భూమిలో నాలుగోవంతైనా తిరిగి కొనుక్కోలేకపోయారు. ప్రభుత్వం మాంబట్టులో రైతుల నుంచి సేకరించిన భూమికి ఎకరానికి (మాగాణి) 1 లక్షా 70 వేల రూపాయలు మార్కెట్ విలువగా నిర్ణయించి, దానికి 30 శాతం అంటే మరో 51 వేల రూపాయలు సోలేషన్ వ్యాల్యూ నిర్ధారించి దానిపై 12 శాతం (రు. 16,264) అదనపు మార్కెట్ విలువ కలిపి 2 లక్షల 37 వేల రూపాయల పరిహారం చెల్లించాలని నిర్ణయించింది. రైతులు నష్టపోతున్నారు కాబట్టి, శాశ్వతంగా భూములు వదులుకొంటున్నారు కాబట్టి చర్చలు, సంప్రదింపుల అనంతరం ఈ మొత్తం పై పరిహారంగా మరో 50 శాతం కలిపి ఎకరానికి 3 లక్షల 54 వేల రూపాయలు చెల్లించింది. ఐతే రైతులకు పరిహారం అంది, వాళ్లు తిరిగి భూములు కొనుక్కోవాలనుకునే లోపు ఈ ప్రాంతంలో భూముల ధరలు 9 నుంచి 11 లక్షల రూపాయలకు ఎకరంగా పెరిగిపోయాయి. ఈలోగా పెద్ద పెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీలు రంగంలోకి దిగి వేలాది ఎకరాలు ప్రైవేట్‌గా సేకరించుకున్నాయి. ఇప్పుడు రైతులు కొనుక్కోవడానికి సెంటు భూమి కూడా లేకుండా పోయింది. తీరా వచ్చిన సొమ్మును ఇంట్లో పాత అప్పులకు, పిల్లల చదువులకు ఫలహారమై పోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇది తడ మండలం పరిస్థితి.

మరో వైపు చిత్తూరు జిల్లాలో రైతుల పరిహారాన్ని కాన్సెంట్ అవార్డ్ పేరుతో మెట్ట అయితే 2.5 లక్షలని, మాగాణి అయితే 3 లక్షలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతుల అంగీకారంతోనే ఇలా నిర్ధారించినట్టు రెవెన్యూ అధికారులు చెపుతున్నా, తమ అంగీకారం లేదని తమకు న్యాయం జరగడం లేదని రైతులు వాపోతున్నారు. అసలు తమకు భూములు అమ్ముకునే ఆలోచనే లేదని అధికారులే బలవంతంగా లాగేసుకొని చెక్కులు చేతుల్లో పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. 'నా పొలం పక్కన ప్రభుత్వ భూమి ఉంది దాన్ని 'సెజ్'లో చేర్చారు. మరో పక్కనున్న రైతుల భూమి కూడా సెజ్ కింద సేకరించారు. ఇప్పుడు రెండింటి మధ్య ఉన్న నాకు అమ్మకుండా తప్పని పరిస్థితి. రేపు 'సెజ్' అయిపోతే చుట్టూ గోడ కట్టేస్తారు. నా భూమినే ఆక్రమిస్తారని అధికారులు బెదిరిస్తున్నారు' అని వరదయ్యపాలెం మండలానికి చెందిన చెంగయ్య అనే రైతు వాపోయాడు.

ఇది బెదిరింపు కాదు. నిజం కూడా. మాంబట్టు గ్రామంలో ఇలా అమ్మకుండా ప్రయత్నించిన రైతులు దాదాపు ఏడాదిగా తమ భూముల్ని సేద్యం చేసుకోలేక పోతున్నారు. ఈ గ్రామంలో గ్రామానికీ, రైతుల పొలాలకీ మధ్య ఉన్న భూమిని ప్రభుత్వం 'సెజ్' కిందికి చేర్చింది. వెంటనే అపాచీ కంపెనీ ఆ భూమి చుట్టూ గోడ కట్టేసింది. రైతులు పొలాలకు వెళ్లే దారికి అడ్డంగా గోడ రావడంతో ఇప్పుడు రైతులకు పొలాలకు వెళ్లే మార్గం లేకుండాపోయింది. దీంతో దాదాపు వంద ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి నిరుపయోగంగా పడి ఉంది. దాన్నీ ఇప్పుడు కచ్చితంగా అమ్ముకోవాలి. లేదా నష్టపోవాలి. ఇదీ అక్కడ పరిస్థితి. తమ పొలాలకు సెజ్ గుండా దారి కల్పించాలని రైతులు మొరపెట్టుకోకుండా ఆ అధికారం మాకు లేదంటూ రెవెన్యూ అధికారులు చేతులెత్తేసారు. "ప్రభుత్వం చైనా కంపెనీకి భూమి ఇచ్చేసింది. ఇప్పుడు మేం ఏం చెయ్యగలం" అని ఎం.ఆర్.ఒ అన్నారు. అయితే రైతుల అవసరాల దృష్ట్యా మరో వైపు నుంచి మార్గం కల్పించాలని తాను ఎపిఐఐసికి పలు మార్లు కోరానని, ఆయన చెప్పారు. ఇలా బలవంతంగా కూడా రైతులు తలొగ్గే పరిస్థితులను ఈ 'సెజ్'లు కల్పిస్తున్నాయి.

కొరవడిన పోరాట స్ఫూర్తి

నందిగ్రాం ఉదంతం తరువాత 'సెజ్'లను ఎవరు అడ్డుకోవాలో, ఎవరు సమర్థించాలో తెలియని సైద్ధాంతిక సంక్షోభం తలెత్తినట్టు అనిపిస్తోంది. ఇవాళ చిత్తూరు, నెల్లూరు జిల్లాల మధ్య రూపొందుతోన్న బహుళజాతి ఎస్టేట్లకు బలైపోతోన్న ప్రజల పక్షాన ఇప్పటివరకు బలమైన గొంతు వినిపించట్లేదు. పని మొదలైన కొత్తలో చిత్తూరు జిల్లా సిపిఎం, జన విజ్ఞాన వేదికలు కొంత చొరవ చూపాయి. నందిగ్రాం తరువాత ఆ ప్రయత్నాలు ఆగిపోయాయి. నిజానికి నందిగ్రాంలోలాగా బలమైన ప్రతిపక్ష రాజకీయ పార్టీలు లేకపోవడం, బలమైన రైతులు, భూస్వాములు కూడా లేకపోవడం, రెండూ దళిత నాయకత్వంలో ఉన్నా రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు అవడం వల్ల అగ్రకుల రాజకీయ నాయకత్వానికి పెద్దగా భవిష్యత్తు పై కూడా ఆశలు లేకపోవడం, విధానపరంగా అధికార కాంగ్రెస్‌కు, ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశంపార్టీకి పెద్దగా తేడా ఏమీ లేకపోవడం వల్ల అక్కడ జరుగుతున్న విధ్వంసంపై చర్చ జరగడం లేదు.

ఏ రకంగా చూసినా తడ, సత్యవేడు రైతులకు నందిగ్రాం కంటే ఎక్కువగానే నష్టం జరుగుతోంది. పైగా ఇక్కడ నష్టపోతున్న సామాజిక వర్గాలు కూడా నందిగ్రాం కంటే అత్యంత దయనీయమైన స్థితిలో ఉన్నాయి. ఈ గ్రామాలు తమిళనాడు సరిహద్దులో ఉండడం వల్ల ఇక్కడ ఉద్యమాలతో పెద్దగా పరిచయం ఉన్నట్టు కూడా లేదు. మాంబొట్టులో నాలుగు వందల దళిత కుటుంబాలున్నాయి. కానీ వారికి హైదరాబాద్‌లో ఉండే ఏ ఒక్క దళిత నాయకుడి పేరు తెలియదు. ఏ ఒక్క దళిత సంఘం కూడా ఆ ఊరినీ, దళితవాడనూ సందర్శించలేదు. ఇది ఒక్క ఆ ఊరికే పరిమితం కాదు. ఆ ప్రాంతం అంతా అదే స్థాయి చైతన్యం కనిపిస్తోంది. రాజకీయ పక్షాలు, పౌరసమాజం, మౌనంగా ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ వచ్చిన వాళ్లంతా ఇప్పుడు ఒకటైె వారికి స్ఫూర్తినివ్వాల్సిన అవసరం ఉంది. పెద్ద ఎత్తున సాగుతోన్న ఈ సెజ్‌ల వ్యవహారం గ్రామీణ వ్యవస్థను పూర్తిగా ఛిన్నాభిన్నం చేయకముందే వారికి రాజకీయ, న్యాయసహాయం అందించి వారి హక్కులను కాపాడే బాధ్యతను స్వీకరించాల్సిన అవసరం ఉంది. అలా కాకుండా ఇదే నిర్లిప్తత కొనసాగితే మన కాళ్లకింద నేలకి కూడా ఖరీదు కట్టే నయా వలస విధానం అందర్నీ కబళించే ప్రమాదం ఉంది. ◆

కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలు రాష్ట్రాల పట్ల ఏ విధంగా వివక్షతా ధోరణిని అమలు చేస్తున్నాయో, వనరులను ఎలా దోచుకుంటున్నాయో చెబుతున్నారు వి. హనుమంతరావు

రాష్ట్రాలకు కేంద్రం కుచ్చుటోపీ

రాష్ట్రాలకు కేంద్రం కుచ్చు టోపీ పెట్టడం, అధిక ఆదాయన్నిచ్చే వనరులను కేంద్రం చేతుల్లో ఉంచుకొని తక్కువ ఆదాయాన్నిచ్చే వనరులను రాష్ట్రాలకు కేటాయించటం, రానురాను రకరకాల అధికారాలను కేంద్రం తన చేతుల్లో కేంద్రీకరించుకోవటం కేంద్రానికి అలవాటైపోతోంది. కొన్ని విషయాల్లో రాజ్యాంగం ప్రకారం అధికారాలు రాష్ట్రాలవే అయినా, చలాయించేది కేంద్రమే. ఉదాహరణకు వ్యవసాయం రాష్ట్రాల అధికారాల పట్టికలో ఉన్నా, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, ఎరువుల ధర, రాష్ట్రాలు ఎంత బియ్యం, గోధుమలు సేకరించాలి, చౌక ధరల దుకాణాలకు కోటాలు - ఇలా ఎన్నెన్ని అధికారాలో కేంద్రం చేతుల్లో ఉన్నాయి. ఇప్పటికే రక్షణ రంగం గంగిగోవు; రాష్ట్రాలు ఆవైపు కన్నెత్తి చూడడానికి కూడా వీల్లేదు. కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలను ప్రపంచ బ్యాంక్, డబ్ల్యూటిఓ, అగ్రరాజ్యాల ఒత్తిడి మేరకు తగ్గిస్తుంది కేంద్రం. కారణంగా, ఈ పన్నుల్లో రాష్ట్రాలకు రావాల్సిన కోటా ఆదాయం తగ్గిపోతోంది. ఇదేమిటని రాష్ట్రాలు అడగటానికి వీల్లేదు. ఎడమచేత్తో, కుడిచేత్తో కేంద్రం అప్పులు చేస్తుంది. ఆ అప్పులు మీద వడ్డీ ప్రతి సంవత్సరం పెరుగుతోంది. కాగా తెచ్చిన అప్పులో సింహభాగం వడ్డీ చెల్లింపులకే పోతుంది. అభివృద్ధి కోసం ఖర్చు శాతం తరుగుతోంది. తాము కూడా అప్పు చేస్తున్నాం కాబట్టి కేంద్రాన్ని నిలదీసే అధికారాన్ని కోల్పోయి తేలుకుట్టిన దొంగలాగ గప్‌చుప్. కరువు వచ్చినా, తుఫానొచ్చినా, ప్రాజెక్టులు నిర్మించుకోవాల్సినా అన్నిటికీ కేంద్రం వద్ద చెయ్యి చాపాల్సి వస్తోంది. అప్పుడెప్పుడో కేంద్రమే సర్కారియా కమిటీని ఏర్పాటు చేయగా, అది చేసిన సిఫార్సుల్లో ఎన్నిటిని అమలు పరిచిందో, అమలు పరచలేదో అందరూ మరిచిపోయారు.

కేంద్రం తన కుళ్లు బుద్ధిని పోనిచ్చుకోలేదు. రాష్ట్రాల నెత్తిన కుచ్చుటోపీలెలా పెట్టాలి అనే ఆలోచనల్లో భాగంగా ఆ మధ్య కొన్ని పన్నుల మీద సెస్‌లు, సర్‌ఛార్జీలు వేసి, వీటివల్ల వచ్చే అదాయంలో రాష్ట్రాలకు వాటా లేదని ఏకపక్ష నిర్ణయం చేసి, వాటిని పెంచుతూ తన బొక్కసంలో జమకట్టుకోంటోంది. ఉదాహరణకు 2007-08 కేంద్ర బడ్జెట్ విద్య పేరుతో రెండు శాతంగా విధిస్తూ వచ్చిన సెస్‌ను మూడు శాతానికి పెంచుతున్నామని చిదంబరం ప్రకటించారు. ఒక్క శాతం అదనంగా సెస్‌లు విధించటం వల్ల కేంద్రానికి రు. 5000 కోట్లు ఆదాయం చేకూరుతుందని అంచనా. ఇందులో ఒక్క నయాపైసా కూడా రాష్ట్రాలకు రాదు. 1991-92, 1998-99 మధ్య కాలంలో సర్‌ఛార్జీలు, సెస్‌ల నుంచి వచ్చిన ఆదాయం మొత్తం పన్నుల ఆదాయంలో మూడు నుంచి ఆరు శాతంగా ఉండగా, గత ఆరేళ్లలో ఈ ఆదాయం 9 నుంచి 12 శాతానికి పెరిగింది. ఈ ఆదాయం ప్రస్తుత సంవత్సరంలో (2006-07) అంతకుముందు ఏడాదిలో కన్నా 21 శాతం పెరిగి రు. 57,840 కోట్లకు పెరిగి వచ్చే సంవత్సరంలో రు. 64,530 కోట్లకు చేరుకొంటుందని బడ్జెట్ అంచనా. అంటే ఇందులో రాజ్యాంగం ప్రకారం సుమారు మూడో వంతు ఆదాయం రాష్ట్రాలకు రావాల్సింది రాకుండాపోతోంది. ఇది దారిదోపిడీ కాక మరేమిటి? ఇలా సంపాదించిన ఆదాయాన్ని న్యాయంగా రాష్ట్రాలకు, వివిధ అవసరాలకు అందచేస్తుందా అంటే అదీ లేదు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం రంగు రుచిని బట్టి కొన్ని రాష్ట్రాల పట్ల వివక్షతా ధోరణితో సహాయం అందిస్తోంది. (మన రాష్ట్రానికి ఏ పేరుతోనైతేనేమి ముఖ్యమంత్రి అదనపు నిధులను రాబట్టగలిగారు) ఎన్.టి.ఆర్. పాలనలో కాంగ్రెసేతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఏర్పాటుచేసి కేంద్రం మీద విమర్శనాస్త్రాలు సంధించినట్లు, వామపక్ష, యుపిఏ యేతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. నిజానికి ఈ సమావేశాన్ని యుపిఏ యేతర రాష్ట్రాలకే పరిమితం చేయాల్సిన పనిలేదు. వాళ్లనూ పిలవచ్చు, వస్తే వస్తారు, లేకపోతే లేదు. రాష్ట్రాల ఒత్తిడికి స్పందించి కేంద్రం మార్పులు, చేర్పులు చేస్తే మనకూ వస్తాయి, మనం ఎందుకు వెళ్లటం అని అనుకుంటే వాళ్లు పచ్చి అవకాశవాదులుగా ప్రజలు గ్రహిస్తారు.

ధరలు ఎందుకు పెరుగుతాయి?

ధరలు పెరుగుతున్నాయని ప్రత్యేకంగా వేరే చెప్పనక్కర్లేదు. కాని ఎందుకు పెరుగుతున్నాయని తెలుసుకోవటం అవసరం.

రాయలసీమలో టమాట ధర పలకక వీథుల్లో రైతులు పారబోస్తుంటే, హైదరాబాద్‌లో కిలో రు. 15 నుంచి 20కు అమ్మిన రోజులున్నాయి. అలాగే ఉల్లిపాయల ధర పెరుగుదల అప్పటి ప్రభుత్వాన్నే ఒక కుదుపు కుదిపింది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో పిల్లల తల్లితండ్రులు పాల డబ్బాలు దొరక్క, నల్లబజారులో కొనుక్కోవాల్సి వచ్చింది. మధ్య దళారీలు, చీకటి బజారు వ్యాపారులే ధరల పెరుగుదలకు కారణమని పై ఉదాహరణలు తెలియజేస్తున్నాయి. దేశానికి స్వతంత్ర్యం

వచ్చిన కొత్త రోజుల్లో నల్లబజారు వ్యాపారస్తులనూ ఎలక్ట్రిక్ స్తంభాలకు కట్టి ఉరితీయాలని నెహ్రూ ఆగ్రహాన్ని వ్యక్తం చేసారు. ఈ 60 సంవత్సరాల్లో ఉరితీయకపోవటం మాట అటుంచి, కనీసం జైళ్లలో పెట్టిన దాఖలాలేవు.

అపరిమిత స్థాయిలో డాలర్ల రాబడి మూలంగా దేశీయ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న ద్రవ్యోల్బణాన్ని నివారించేందుకు శ్రద్ధ చూపనంతవరకూ ధరల సమస్య కొనసాగుతూనే ఉంటుందని ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు భరత్ ఝున్‌ఝున్‌వాలా అంటున్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో కూడా ద్రవ్యోల్బణ సమస్య ఆందోళన కలిగిస్తూనే ఉండవచ్చునని స్వయాన ఆర్థిక మంత్రి చిదంబరమే అంటున్నారు. ఆర్థిక మంత్రే ఒప్పుకొంటుంటే, వ్యాపారులు ధరలు పెంచి లాభాలు చేసుకునే అవకాశాన్ని పోగొట్టుకోరు కదా.

ప్రభుత్వానికి నిధులు కావాలి. కాని కొరత వెన్నాడుతూనే ఉంది. పేరుకు రిజర్వు బ్యాంకు స్వతంత్ర సంస్థే అయినా, ఈ కొరత తీర్చడానికి అదనంగా నోట్లు అచ్చువేయమని ప్రభుత్వం ఆదేశిస్తుంది. ఈ డబ్బు చలామణీలోకి వస్తుంది, వస్తువుల ఉత్పత్తి మాత్రం అదే మోతాదులో ఉంటుంది. ఈ మోతాదు, చలామణీలో ఉన్న ధనం ఒకే స్థాయిలో ఉంటే ధరలు స్థిరంగా ఉంటాయి. కానీ అదే ఉత్పత్తిని ఎక్కువ డబ్బు వెంటాడితే ధరలు పెరక్క తగ్గుతాయా? అలాగే డబ్బు చలామణి మామూలు మోతాదులో ఉంటుంది కానీ ఉత్పత్తి తగ్గుతుంది. ప్రస్తుతం దేశం ఈ స్థితిలోనే ఉంది. తిండి గింజల ఉత్పత్తి తగ్గి, విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ఇదీ ధరలు పెరగడానికి దోహదం చేస్తోంది. రెండో వైపు నుంచి చూస్తే ఉత్పత్తి జరక్క రైతు కష్టాల్లో పడి ఆదాయం లేక ఇబ్బంది పడుతున్న సమయంలో, హెచ్చు ధర పెట్టి తిండి గింజలు కొనుక్కోవాల్సి రావటంతో ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు పేదరికపు రేఖ కిందకు జారిపోతారు.

టోకు ధరల సూచీ, వినిమయదారుల ధరల సూచీ అని రెండు సూచీలను ప్రభుత్వం తయారు చేస్తుంది. టోకు ధరకూ, వినిమయదారుని ధరకూ మధ్య పెద్ద తేడా ఉంది. ప్రపంచంలో అనేక దేశాల్లో వినిమయదారుడు చెల్లించే ధరల ఆధారంగా సూచీ తయారు చేస్తుంటే, మన ప్రభుత్వం టోకు ధరల సూచీ ఆధారంగా తయారు చేయటం వల్ల ద్రవ్యోల్బణం నిజ స్వరూపం మరుగున పడుతోంది. ఇప్పటికే ద్రవ్యోల్బణం రేటు పెరుగుదల ఏడో శాతం దరిదాపుల్లో ఉంది. ఇదే వినిమయదారుల ధరల సూచీ ప్రకారం ఇంకా ఎక్కువ ఉంటుంది. అదే ధరల పెరుగుదల నిజస్వరూపాన్ని ప్రజల మీద పడుతున్న భారాన్ని తెలియజేస్తుంది. మరో విషయం ఏమంటే మార్కెట్‌లో వచ్చే అన్ని ఉత్పత్తుల ధరల ఆధారంగా టోకు ధరల సూచీ తయారు చేస్తుంటే, వినిమయదారులు కొనే వస్తువులు – అంటే బియ్యం, పప్పులు, ఉప్పులు వగైరా – ధరల ఆధారంగా తయారువుతోంది. వినిమయదారుడు చెల్లించే ధర కూడా హైదరాబాద్‌లో ఒక రకంగా ఉంటే, శ్రీకాకుళం జిల్లాలో మరో రకంగా, ఆ జిల్లాలో గ్రామస్థాయికి వెళితే ఇంకోరకంగా ఉంటోంది. చెప్పొచ్చేదేమంటే వాస్తవంలో ద్రవ్యోల్బణం పెరుగుదల రేటు ఏడు శాతం కన్నా ఎక్కువగానే ఉంటుంది.

దేశానికి పట్టిన ఈ చీడను వదల్చడానికి విజ్ఞులైన మేధావులంతా ఈ విధానాలను ప్రశ్నించాల్సిందే. ◆

పరిశోధనా ఫలాలు సమాజానికి అందజేయండి !

సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలలో మీరు ఎంతో పరిశోధన చేసి ఉంటారు. అధ్యాపకులుగా మీ విద్యార్థులకు ఎన్నో పరిశోధనలలో ప్రత్యక్ష పరోక్ష సహకారాలు అందిస్తూ ఉంటారు. అయితే సమాజానికి ఎంతో ఉపయోగపడాల్సిన పరిశోధనా పత్రాలు ఏ సెమినార్‌లోనో ప్రస్తావించి వదిలేస్తే సరిపోదు. మీ పరిశోధనా ఫలాలు తెలుగు సమాజంలో నలుగురికీ చేరాలి. కొత్త ఆలోచనలకు ప్రేరణ కావాలి, కొత్త మార్గాలను ఆవిష్కరించాలి. అందుకు మీకు వేదికగా నిలిచేందుకు వీక్షణం ముందుకు వస్తోంది.

తెలుగులో పాప్‌కార్న్ పత్రికలే కానీ సీరియస్ పత్రికలు లేవన్న అభిప్రాయాన్ని పటాపంచలు చేస్తూ విజయవంతంగా రెండున్నరేళ్ల ప్రస్థానం సాగించి, 50 సంచికలు పూర్తి చేసుకుంది వీక్షణం.

ఎటువంటి డబ్బు మూటల దన్ను లేకుండా గుప్పెడు పాత్రికేయులు, సామాజిక శాస్త్రవేత్తలు కలిసి నడుపుతున్న ఈ పత్రికకు ఎందరో మేధావులు, అధ్యాపకులు, ఆలోచనాపరులు చందాదారులుగా ఉన్నారు. తెలుగు సమాజం గర్వించదగ్గ పాత్రికేయులు, సామాజిక శాస్త్రవేత్తలు, ఉద్యమకారులు, నిపుణులు అనేకుల రచనలు వీక్షణం ప్రచురిస్తోంది.

రండి, ఈ బృహత్కార్యంలో మీరూ పాలుపంచుకోండి. మీరు చేసిన పరిశోధనా ఫలితాలను వీక్షణంలో ప్రకటించండి. అది ఏ సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశం అయినా ఫర్వాలేదు. తెలుగు ప్రజలకు ఆ అంశం ఆసక్తిగొల్పేదీ, ఉపయోగకరమైనదీ అని మీరు భావిస్తే చాలు. మీరే కాదు పి.హెచ్.డి చేసిన, చేస్తున్న మీ విద్యార్థులు కూడా తమ పరిశోధనా పత్రాలను (ఒక వ్యాసరూపంలో) పంపవచ్చు. రచనతో పాటు దానికి సంబంధించిన చిత్రాలు, గణాంకాలు కూడా జతపరిస్తే మరీ మంచిది.

ఎంతో శ్రమించి మీరు చేస్తున్న పరిశోధనలు నలుగురికీ ఉపయోగపడేలా చేయండి.

వీక్షణం మీ రచనల కోసం ఎదురుచూస్తుంది !

మీదే ఆలస్యం !!

రచనలు పంపాల్సిన చిరునామా :

ఎడిటర్, వీక్షణం, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్

3-6-394, మైత్రీ రెసిడెన్సీ, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ – 500 029. ఫోన్ : 040 – 66843495

కొమ్మినేని వాసుదేవరావు



ప్రముఖ పాత్రికేయులు, సాహితీమిత్రులు కొమ్మినేని వాసుదేవరావు (66) ఏప్రిల్ 11న మరణించారు. ప్రకాశం జిల్లా కంభంపాడుకు చెందిన వాసుదేవరావు ఆంధ్రజ్యోతి, ఈనాడు, ఉదయం, ఆంధ్రభూమి, సుప్రభాతం (వారపత్రిక), మాభూమి (వారపత్రిక), ఆంధ్రపత్రిక (వారపత్రిక)లలో పని చేసారు. ఎన్నో సాహితీవ్యాసాలు, పుస్తక సమీక్షలు రాసారు. వాసుదేవరావు పాత్రికేయ విలువలకు ప్రాధాన్యమిచ్చారు. ఆదర్శంగానూ, నిబద్ధతతోనూ జీవించారు. కొత్తతరంలోని సృజనాత్మకతనూ, ప్రతిభనూ పనిగట్టుకుని ప్రోత్సహించేవారు. ఆయనకు వామపక్ష రాజకీయాలు, హేతువాదం, అభిమాన విషయాలు, కుల, మత, ప్రాంతీయ భేదాలను వ్యతిరేకించేవారు. మానవసంబంధాలను ఉన్నతీకరించడంలో ఆయన నిశ్శబ్ద ఆచరణ ఉంది. ఆయన స్మృతికి 'వీక్షణం' వినమ్రంగా నివాళులు అర్పిస్తోంది. ◆

వాసిరెడ్డి సీతాదేవి



ప్రఖ్యాత నవలా రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి (76) ఏప్రిల్ 13న మరణించారు. ఆమె గుంటూరు జిల్లా చేబ్రోలులో జన్మించారు. మట్టిమనిషి, సమత, మరీచిక నవలల ద్వారా ఆమె సాహిత్య లోకంలో చిరకాలం నిలిచిపోతారు. నాగపూర్ విశ్వవిద్యాలయంలో ఎం.ఎ పూర్తి చేసారు. 30 ఏళ్ల క్రితం హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డారు. సాహిత్యంపై ఉన్న మక్కువ, రచనలపై ఉన్న అభిమానంతో ఆమె వివాహానికి దూరంగా ఉండిపోయారు. ఆమెవి 40 నవలలు, 10 కథా సంపుటాలు, 8 అనువాద పుస్తకాలు, 5 పిల్లల పుస్తకాలు వెలువడ్డాయి. సీతాదేవి రాసిన 'మట్టి మనిషి' 14 భాషల్లోకి అనువదించబడింది. రచనా వ్యాసంగంలో భాగంగా వివిధ దేశాలకు కూడా వెళ్లారు.

అనేక ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ కూడా చాలా సాహసోపేతంగా తన అభిప్రాయాలను ప్రకటించారు. ఆమె రాసిన 'మరీచిక' నవలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిషేధించింది. ఆ నిషేధాన్ని ధైర్యంగా సవాలు చేసి గెలిచారు. సీతాదేవి వ్యక్తిగత జీవితంలో, మానవసంబంధాల్లో నిర్మొహమాటంగా తన వ్యక్తిత్వాన్ని నిలుపుకున్నారు. వాసిరెడ్డి సీతాదేవిగారి మరణానికి 'వీక్షణం' తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తోంది. ◆

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడ అంతే. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

- సంపాదకులు

చందాదారులకు విజ్ఞప్తి!

ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. అంటే ఏ నెల సంచిక ఆ నెల మొదటి వారానికల్లా పాఠకులకు చేరుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారం లోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.

మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.

– సర్క్యులేషన్ మేనేజర్
9949391028

చంద్రబాబు ప్రభుత్వం వ్యవసాయాన్ని 'పనికిమాలిన' కార్యక్రమంగా ప్రకటించి అశ్రద్ధ చేసిన ఫలితమే నేటి ఈ ఆత్మహత్యలని ప్రకటిస్తున్న ప్రస్తుత పభుత్వం కూడా, ఆత్మహత్యల నిరోధానికి చేసిందేమీ లేదంటున్నారు ఇప్ప వీరారెడ్డి

ఈ ప్రభుత్వానికి రైతు ప్రాణమా, అప్పుల వసూలా, ఏది ముఖ్యం?

ఎంత నిశ్శబ్దం... ఎంత పట్టించుకోనితనం...! సామాజిక గ్రోత్ ఇంజన్లుగా చెప్పబడుతున్న వాటిల్లో అతి ప్రధానమైన ఒక రంగానికి చెందిన శ్రామికులు రోజూ ఇద్దరూ – ముగ్గురూ, ఒక్కోరోజు ఆరేడుగురి దాకా ఆత్మహత్యలు చేసుకుంటున్న వాస్తవ పరిస్థితి కళ్లముందు కనబడుతున్నా మాట్లాడని అమానుష స్థితి. కాదు.. కాదు అనాగరికస్థితి. పత్రికలు మొదటి పేజీల్లోనే ఎన్నోసార్లు 'రాలుతున్న వరికంకులు' 'రైతన్న చావుకేక' ల్లాంటి పతాక శీర్షికలతో ఆంధ్రప్రదేశాన్ని 'అన్నపూర్ణ'గా నిలబెట్టిన రైతుల ఆత్మహత్యల సంఘటనలను గత పదేళ్లుగా కంటతడి పెట్టించే వాస్తవ కథనాలతో ప్రచురిస్తున్నా స్పందించని సామాజిక స్థితి కొనసాగటం ఆలోచించేవాళ్లకు ఆందోళన కలిగిస్తుంది. ఒక్కరిద్దరు కాదు... వందోరెండొందలో కాదు..., ఆత్మహత్యలు ప్రారంభమైన నాటి నుండి నేటి దాకా దాదాపు ఈ సంఖ్య ఎనిమిది వేలు దాటే ఉంటుంది. ఇందులో సగానికి పైగా చంద్రబాబు ప్రభుత్వంలో జరిగితే మిగిలినవి ప్రస్తుత కాంగ్రెస్ ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి పాలనలో జరిగినై. ఇంకా జరుగుతూనే ఉన్నాయి.

పదేండ్లు తెలుగుదేశం పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన వ్యవసాయ రంగానికి 2004 మే 14న అధికారానికొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల మంచిరోజులొస్తాయని రాష్ట్ర రైతాంగం ఎంతో ఆశపడ్డది. ప్రమాణ స్వీకారం రోజునే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా బిల్లుపై సంతకం చేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ రైతులోకం మురిసిపోయింది. ఇక తమ ప్రభుత్వంలో రైతుల ఆత్మహత్యలకు అవకాశమే లేదన్న ప్రభుత్వ ప్రకటన రైతు లోకాన్ని ఆనందంలో ముంచెత్తింది. కానీ అవన్నీ ఆర్భాటపు ప్రకటనలేనన్న నిజం ఈ మూడేళ్ల పాలనలో తేలిపోయింది. ఆత్మహత్యలు పూర్తిగా ఆగినయన్న సర్కార్ ప్రకటన పచ్చి అబద్ధం. కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిన ఈ మూడేళ్లుగా ఆత్మహత్య(లు) ఆగిన రోజంటూ లేదు. సగటున మూడు చొప్పున దాదాపు మూడు వేలమందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారనటానికి పత్రికలే ప్రధాన సాక్ష్యం. ఇందులో సగానికి పైగా తెలంగాణ పల్లెల్లోనే జరిగాయన్నది పచ్చి నిజం.

చంద్రబాబు ప్రభుత్వం వ్యవసాయాన్ని 'పనికిమాలిన' కార్యక్రమంగా ప్రకటించి అశ్రద్ధ చేసిన ఫలితమే నేటి ఈ ఆత్మహత్యలని ప్రకటిస్తున్న రాజశేఖరుని ప్రభుత్వం కూడా, ఆత్మహత్యల నిరోధానికి చేసిందేమి లేదు. ప్రజలు 'వొద్దు మొర్రో' అని మొత్తుకుంటున్నా వినకుండా పోలీసు పహరాల మధ్య 'జలయజ్ఞం' పేరుతో పారిశ్రామికవేత్తల, కాంట్రాక్టర్ల, రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం నిర్మిస్తున్న ప్రాజెక్టుల కార్యక్రమం ఒక వైపు, మరొకవైపు పారిశ్రామికవేత్తలకు వేలకోట్ల రూపాయల విలువైన వ్యవసాయ భూములను కారుచౌకగా అప్పచెప్పే కార్యక్రమాలలో 'బిజీ'గా ఉన్న ఈ ప్రభుత్వానికి రైతుకు మేలు చేసే విధానాల రూపకల్పనలో తీరికే లేకుండా పోయింది. ఫలితంగా రైతు ఆత్మహత్యలు నిరాటంకంగా కొనసాగుతూనే ఉన్నాయి.

నిజానికి వ్యవసాయాన్ని నిర్లక్ష్యపరిచి విజయవంతంగా నష్టాల బాట పట్టించడంలో 'తెలుగుదేశం' 'కాంగ్రెస్' ప్రభుత్వాలు ఒకదాన్ని మించి ఒకటి పోటీపడుతున్నాయి. రైతు కొంపముంచుతున్న నకిలీ విత్తనాలు అప్పుడమ్మింన్రు, ఇప్పుడూ అమ్ముతున్రు. గత ఖరీఫ్ పత్తి విషయంలో హైబ్రిడ్ రకాల్లోనే కాకుండా 'బిటి' రకంలో కూడా వేల కొద్ది నకిలీ విత్తన పాకెట్ల అమ్మకం నిరాటంకంగా కొనసాగింది. రైతులు పట్టుకుంటే తప్ప, వ్యవసాయాధికార్ల దృష్టికే ఆ విషయం పోదు. ఏ సీజన్‌లోనూ, ఏ ఒక్కపంటకూ గిట్టుబాటు ధర దొరకదు. అసలు మద్దతు ధరే దొరకదు. మద్దతు ధర గ్యారంటీ కోసం వెయ్యికోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానానికి అడ్రస్సే లేదు. పైగా మద్దతు ధర గ్యారంటీ లేని పసుపు, పత్తి, మిర్చి లాంటి వాణిజ్య పైర్ల సాగును మానుకోవాలని ముఖ్యమంత్రి ఉచిత సలహా ఒకటి. మద్దతు ధరలు గ్యారంటీగా దొరికే పంటల వివరాలు, సీజన్ల వివరాలు ప్రకటించిన తర్వాత చేయవలసిన సూచన అది. దాని కోసం ఏ ప్రభుత్వానికీ దీర్ఘ దృష్టితో కూడిన ప్రణాళికే ఉండదు. రెండేళ్లుగా పుష్కలంగా వర్షాలు కురిసి రిజర్వాయర్లు పొర్లినా కరెంట్ కటకట తప్పలేదు. కరెంట్ కోతకు తోడు లోవోల్టేజీ. దీనితో వేలకొద్ది ఎకరాల్లో పంటలెండిపోయినయి. ఆ నష్టాన్ని భర్తీ చేసే ఆలోచన పాత ప్రభుత్వానికి మల్లే ఈ ప్రభుత్వానికీ లేదు. పైగా దివాళాకోరు సరఫరా విధానం ప్రస్తుత రబీసీజన్‌లో మూడు వందల మందికి పైగా రైతులను బలి తీసుకుంది. ఆ దారుణ సంఘటనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. వైద్యం వికటించి రోగి మరణిస్తే ఆ బాధ్యత వైద్యునిదే అవ్వటం ఎంత

సరైందో, దివాళాకోరు వ్యవస్థ, వేళాపాళా లేని (రాత్రివేళల్లో) సరఫరా వల్ల నిష్కారణంగా రైతు మరణిస్తే, ఆ బాధ్యత విద్యుత్‌బోర్డుదో, ప్రభుత్వానిదో ఎందుకు కాకూడదూ? వ్యవసాయమంత్రి, ముఖ్యమంత్రి ఇద్దరూ స్వయానా రైతు కుంటుంబాల నుంచే వచ్చామని చెప్పుకుంటూ (ఆమాట కొస్తే మంత్రులందరూ), వ్యవసాయానికి కరెంట్ సరఫరాను రాత్రివేళల్లో కొనసాగించటాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? రైతు ప్రభుత్వంగా తనకు తానుగా కితాబిచ్చుకుంటున్న ప్రభుత్వం విద్యుత్ షాక్ మరణాలపై ఈరోజు వరకూ ఏ రకమైన విధాన ప్రకటనే చేయలేదు. కనీసం ప్రతిపక్షాలూ మాట్లాడకపోవటం మరీ దారుణం. 'ఏడ బుట్టినవ్ బిడ్డా అంటె అంగట్ల పుట్టిన' అన్నట్లుంది రైతు దుస్థితి.

రైతులు తిని, తాగి అప్పుల పాలైతలేరు. సాగుచేస్తే పది రూపాయలైన మిగలాలె. కాకున్నా పెట్టుబడైనా ముడిపడాలె. ఏదీ లేనప్పుడు అప్పులెందుకు కావు? ప్రతి సంవత్సరం కొత్త పెట్టుబడి, కొత్త రుణం, కొత్త నష్టం. దీనికి తోడు రోజువారి అవసరాలకూ అప్పే. ఒక్క సీజన్‌లోనో, ఒక పంటలోనో నష్టం జరిగితే అది ఇంకో సీజన్‌లోనో, మరో పంటలోనో పూడే పరిస్థితి లేదు. ఏ పంటైనా, సీజనేదైనా నష్టం గ్యారంటీ. 'చిట్టెడు చిట్టెడు పుట్టెడైనట్టు' ఏటేటా వస్తున్న నష్టాల వల్ల పెట్టుబడి కోసం తెస్తున్న అప్పులు కుప్పలైతున్నాయి. మునుముందు కూడా మరిన్ని నష్టాలు పాతప్పులకు జమవ్వటమే తప్ప, బ్యాంక్ బాకీ రూపాయి కట్టే పరిస్థితి కనబడటంలేని ఆందోళన రైతుది. విరామం లేకుండా జరుగుతున్న రైతుల ఆత్మహత్యలకు అసలు కారణం ఇదైతే, ప్రభుత్వం విద్యుత్ బకాయిల మాఫీ, ఉచిత కరెంట్, విత్తనాలకు సబ్సిడీ, పావలా వడ్డీపై రుణాలు, వడ్డీ మాఫీ లాంటి కంటి తుడుపు పథకాలతో ఊదరగొడుతుంది. రైతు ఆత్మహత్యలు కరెంట్ బకాయిలు కట్టలేని సమస్యో, కరెంట్ కొనుక్కోని సమస్యో, రాయితీ ఇస్తే తప్ప విత్తనం కొనలేని సమస్యో, అప్పులకు వడ్డీ కట్టలేని సమస్యో అయితే, వడ్డీ మాఫీ మినహా మిగతావి అన్నీ అమలైతున్నప్పుడు ఆత్మహత్యలు ఇంకెందుకు జరుగుతున్నట్లు? ఆత్మహత్యలకు సిద్ధపడే రైతులెవ్వరూ వీటిని పరిష్కార మార్గాలుగా భావించి సంతృప్తి పడటం లేదనే కదా దీనర్థం?

అసలు ఒక ఏడాదిలో ఒక మధ్యతరగతి రైతు వాడే విత్తనం ఎంత? దానికి దొరికిన సబ్సిడీ ఎంత? మాఫీ దొరికిన కరెంట్ బకాయి ఎంత? ఒక్కేడు ఉచితంగా వాడుకుంటున్న కరెంట్ విలువెంత? ఇవన్నీ కలిపినా, ఒక్కేడాది నకిలీ విత్తనం కారణంగా ఓ మూడెకరాల పత్తిపంటలో దిగుబడి తగ్గిన నష్టానికి సమానం కావు. కనీసం విద్యుత్ కోత – లోవోల్టేజీ కారణంగా ఒక మూడెకరాల వరి పంటలో జరిగిన పంటెండిన, పంపుసెట్టు కాలిన నష్టానికి కూడా సమానం కావు. ఒక పది క్వింటాళ్ల ఏదో ఒక ఉత్పత్తికి మద్దతు ధర దొరకని కారణంగా సంభవించిన నష్టాన్నైనా పూడ్చలేవు. ఇంకా మార్కెట్ దోపిడీలు, కల్తీ పురుగుమందులు, ప్రకృతి వైపరిత్యాల వల్ల జరిగే నష్టాలను ప్రస్థావించనే లేదు. ప్రతీ సంవత్సరం ఇన్ని రకాల నష్టాలన్నీ జరుగుతున్నట్లు ప్రభుత్వానికీ తెలుసు. వీటన్నింటిని లెక్క గడితే ఆ మొత్తానికి సర్కారు ప్రకటించిన ఉచితాలు, మాఫీలు, సబ్సిడీల మొత్తం ఒక్కేడాది నష్టంలో 30 శాతం నష్టాన్నీ కూడా భర్తీ చేయలేవని తేలుతుంది. వడ్డీ మాఫీ కోసం మూడు వేల కోట్లు కేటాయించామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది. అదింకా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య 'దోబూచు'లాడుతూనే ఉంది. అయినా, రాష్ట్ర రైతులందరి అప్పుల మీద పెరిగిన వడ్డీ అంతేనా? 'భూ తనఖా' బ్యాంక్‌గా ఉన్నప్పుడే రైతు తీసుకున్న అప్పు మిత్తికి మిత్తీ, సర్వీస్ చార్జీలతో కలిసి రీషెడ్యూళ్లు, బుక్ అడ్జెస్ట్‌మెంట్ల ద్వారా పేరు మార్చుకున్నా ఇప్పటి ఈ 'సహకార బ్యాంక్' ఖాతాలోకి వచ్చి చేరింది వాస్తవం కాదా? రైతు 'ఖాతా'లో కనిపించే మొత్తంలో బుక్ అడ్జెస్ట్‌మెంట్‌లు, రీషెడ్యూళ్ల ద్వారా కలిసిపోయిన వడ్డీని వేరు చేసి చూపే నిజాయితీ ప్రభుత్వానికి ఉంటే రైతుకు అప్పుల బరువు అరవై శాతానికి తగ్గిపోతుంది.

'రోగమొక్కటైతే మందొక్కటైనట్టు' అసలివన్నీ రైతులేనాడు అడగలేదు. రైతు చావుకు కారణమౌతున్న కల్తీ విత్తనాలు, కరెంట్ సమస్యలు, గిట్టుబడని ధరలు, సాగునీటి కష్టాలు, ఈ రకమైన మౌలిక సమస్యల పరిష్కారానికి కనీసంగా కూడా ప్రయత్నించని ప్రభుత్వాలు అడగందే 'సబ్సిడీ'లు 'మాఫీ'లు 'ఉచితా'లు ఇస్తున్నాయంటే, సాగు గిట్టుబాటుగా మార్చటం పై తన అయిష్టత ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతోనే. విత్తనాలు – కరెంట్ – ధరలు – సాగునీటి అవసరాల్లో రైతును నానా అవస్తలు పెడుతూ, సాగును సర్వనాశనం చేసి భూమిని కంపెనీల పరం చేసేందుకు మానసికంగా సిద్ధం చేసే కుట్రను రైతులు తెలుసుకోకుండా ఉండేందుకే ఈ తతంగం అంతా అని ఎందుకను కోకూడదు? ఇవన్నీ ఆత్మహత్యలు ఆపలేవని తెలుస్తూనే ఉంది. సాగు గిట్టుబాటైతేనే ఆత్మహత్యలాగుతాయి. సాగు గిట్టుబడాల్నంటే నష్టం తెచ్చే నకిలీ విత్తనాలు, కరెంట్ కోతలు, సాగునీటి సమస్యలు, మార్కెట్ దోపిడీలు, మద్దతు ధరరాని నష్టాలు, కరువు నష్టాలు వెంటవెంటనే భర్తీ కావాలే. 'అన్నీ చేస్తున్నాం, సాగు లాభాన పడుతుంద'ని ప్రభుత్వం దబాయిస్తుంది కానీ, ఆ ప్రయత్నం చేస్తున్న దాఖలాలే లేవు. ఉన్నా, దానికి ఎన్నేండ్లు పడుతుందో తెలియదు. పదిహేనేండ్ల నుండి జరిగిన నష్టాల కారణంగా పెరిగిన అప్పులు తీరాల్నంటే, రూపాయి నష్టం రాకుండా, పది రూపాయలు మిగిలేటట్టు వ్యవసాయం మరో పదిహేనేండ్లు సాఫీగా సాగాలి. అది జరుగుతుందనీ, అప్పులు తీరుతాయనే నమ్మకమూ – ధైర్యమూ రైతుకు కలగటం లేదు. బాకీ నెత్తిన ఉన్నంత కాలం దినదినమూ గండమే. బ్యాంకోళ్లు ఎప్పుడొస్తరోనని, ఆస్తి వేలం పాడుతారేమోనని, తలుపులు–తపేలా–చెంబులు గుంజుతారేమోనని, కోర్టుకీడుస్తారేమోనని, జైలుకు తోలుతారేమోనని, ఈ భయమే ఆత్మహత్యల రూపంలో రైతును మింగుతోంది. ఆత్మహత్యలు తక్షణం ఆగాలంటే అప్పులు మొత్తం రద్దు కావలిసిందే. అదే పరిష్కారం.

అయినా పాత అప్పులు ఎన్నటికీ తిరిగి రావన్నది సర్కార్‌కు కూడా తెలుసు. చేతలు ఎంత దరిద్రంగా ఉన్నాయో ప్రభుత్వ పథకాలు చెప్పకనే చెబుతున్నాయి. వ్యవసాయాదాయంతో కరెంట్‌ను రైతు కొనలేడనే 'ఉచితం' చేసింది. పూర్తి డబ్బుతో విత్తనం కొనలేడనే 'సబ్సిడీ' ఇస్తుంది. వడ్డీ కట్టలేడనే 'మాఫీ' ప్రకటించబోతుంది. వడ్డీ కట్టలేని రైతు, సబ్సిడీ ఇస్తే తప్ప విత్తనం వెయ్యని రైతు, ఉచితం అయితే తప్ప మోటారు పెట్టని రైతు, బ్యాంకు అప్పులు 'అస'లెట్లా కట్టగలడు? ఎన్నటికి చెల్లించగలడు? నిజంగా ఈ ప్రభుత్వం రైతు పక్షపాతే అయితే, ఈ ప్రశ్నలకు చెప్పే జవాబు, సహకార – వాణిజ్య బ్యాంకుల్లోని అప్పుల సంపూర్ణ మాఫీగానే ఉంటుంది.

నష్ట పరిమాణం వివరాలు

పంట	పెట్టుబడి (ఎకరానికి)	రావలసిన దిగుబడి (ఎకరానికి)	నష్టపరచిన అంశం	నష్టం జరిగిన తీరు	భూ విస్తీర్ణం	ఉత్పత్తి పరిమాణం	మద్దతు ధర	మోడల్ (మార్కెట్) ధర	ధరల తేడా	నష్టం విలువ
పత్తి	12 వేలు	12 క్వింటాళ్లు	నకిలీ విత్తనం	దిగుబడి తగ్గిపోవటం		8 క్వింటాళ్లు		1700		8 x 1700 = 12600
			మార్కెట్	మద్దతు ధర పడిపోవటం			2010	1700	310	*4 x 310 = 1240
వరి	10 వేలు	28 క్వింటాళ్లు	విద్యుత్ కోత	పంట ఎండిపోవటం	5 గుంటలు	3.50 క్వింటాళ్లు	570			3.5 x 570 = 1995
			లోవోల్టేజీ	పంపు సెట్లు కాలిపోవటం						2.500
మొక్క జొన్న	10 వేలు	30 క్వింటాళ్లు	నకిలీ విత్తనం	దిగుబడి తగ్గిపోవటం		18 క్వింటాళ్లు				18 x 480 = 8640
			మార్కెట్	మద్దతు ధర పడిపోవటం			540	480	60	*12 x 60 = 720
			లోవోల్టేజీ	పంపుసెట్లు కాలిపోవటం						2500
			కరెంట్ కోత	పంట ఎండిపోవటం	5 గుంటలు	3.5 క్వింటాళ్లు		480		3.5 x 480 = 1680

* విత్తనం నకిలీ కారణంగా దిగుబడి తగ్గి, నికరంగా వచ్చిన దిగుబడి

పట్టికలో చూపినట్టు, ఒక చిన్నకారు రైతు పత్తి, వరి, మొక్కజొన్నలను ఒక్క ఎకరంలో వేసాడనుకుంటే, ఆయా పంటల్లో నకిలీ విత్తనం, విద్యుత్‌కోత, లోవోల్టేజీ, మార్కెట్‌ల కారణంగా జరిగిన మొత్తం నష్టం విలువ రు. 31,875లు. ఇందులో ప్రకృతి వైపరీత్యాల ద్వారా సంభవించే నష్టాలను చేర్చనే లేదు. ఏటేటా తప్పనిసరిగా సంభవించే ఆ నష్టాల్ని కూడా ఈ మొత్తానికి చేర్చాలి. ఒక రైతుకు ఈ నష్టాలన్నీ ఒకేసారి సంభవించవచ్చు, సంభవించకపోవచ్చు. సంభవించే అవకాశాలే ఎక్కువ. అయితే, విద్యుత్‌కోత – లోవోల్టేజీ కారణంగా జరిగే నష్టం స్పష్టంగా కనిపించేదిగా ఉంటే, విత్తనలోపం, మార్కెట్‌ల ద్వారా జరిగే నష్టం రైతుకు అర్థం కాకపోవటం ఇటు ప్రభుత్వానికి, అటు వ్యాపార వర్గాలకు మేలు చేసే విషయంగా ఉంది. లేకుంటే అటు మార్కెట్లల్లో, ఇటు వ్యాపార కూడళ్ల (దుకాణాల ముందు)లో రైతుల ఆగ్రహావేశాలు ప్రతీరోజూ పెల్లుబుకేవి.

నిజానికి ఒక పంటలో విత్తనలోపం వల్ల జరిగే నష్టం నూటికి 90 ఎకరాల్లో చర్చనీయాంశమే కాదు, వివాదాస్పదం అయిన విస్తీర్ణం విషయంలో కూడా నష్టాలకు వాతావరణ పరిస్థితినో, సాగుమెలకువలు పాటించక పోవటం లాంటి వాటినో కారణాలుగా తేల్చడంతో రైతు నష్ట పరిహారాన్ని డిమాండ్ చెయ్యలేకపోతున్నాడు. 'తమ విత్తనాన్ని ఒక మోస్తరు వాతావరణ పరిస్థితిలో, సాధారణమైన సాగు పద్ధతుల్లో సాగు చేస్తే ఫలానా కొంత యావరేజీ పరిమాణంలో దిగుబడి గ్యారంటీ' అని ప్రకటించే తప్పనిసరి షరతేదీ లేకపోవటంతో విత్తన ఉత్పత్తి సంస్థలు విత్తనలోపం పట్ల నిర్భయంగా వ్యవహరిస్తూ, రైతుకు జరిగిన నష్టాన్ని బేఖాతరు చేస్తున్నాయి.

ఉత్పత్తులకు మార్కెట్లో దొరికే ధరలు కూడా రైతును నిలువునా ముంచుతున్నాయి. పంటలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలెవ్వీ 90 శాతం మంది రైతులకు తెలియనే తెలియదు. ఉత్పత్తి ఖర్చులను గ్యారంటీ చేసేవే మద్దతు ధర అయినప్పుడు, ఉత్పత్తులకు మార్కెట్లో దొరికే ధరలు అంతకన్నా వందల రూపాయల తేడాతో తక్కువగా ఉంటున్నాయి. ప్రతి పంటకు మద్దతు ధర అనేది ఫలానా కొంతగా నిర్ణయించబడి ఉందని రైతుకు తెలియనప్పుడు, ఉత్పత్తులకు మార్కెట్లో లభిస్తున్న అధ్వాన్నపు ధరపై రైతులనుండి రావలసినంత ప్రతిఘటన రావటం లేదు. ఏమైన వ్యవసాయంలో నష్టాలకు దారితీసి రైతును ఆత్మహత్యల వైపు నెట్టే ప్రధాన అంశాలైన, నకిలీ విత్తనం, విద్యుత్ కోత – లోవోల్టేజీ, మార్కెట్ ధరల ద్వారా సంభవించే నష్టాలను, రైతులు అంతంత మాత్రంగా చేస్తున్న ఆందోళనలు రాబట్టలేకపోతున్నాయి. ◆

వచ్చే సంచికలో...

- ❖ **ఫోకస్ - రాజకీయ రంగంలో అవినీతి**
- ❖ **ఇక అనువాద దినపత్రికలు - నాగసూరి వేణుగోపాల్**
- ❖ **శాసనమండలి - వికలాంగులు - పెదమళ్ల శ్రీనివాసరావు**
- ❖ **కనుమరుగవుతున్న కళారూపాలు - వి. ప్రతిమ**

- ❖ **జులై 2007 సంచిక ఫోకస్ - నీటి పారుదల పథకాలు - వివాదాలు**

'సమ్మిళిత అభివృద్ధి' అంటూ గ్రామాల మీద మొసలి కన్నీరు కారుస్తున్నారే కాని పాలకులకు గ్రామీణాభివృద్ధి పైన ఎలాంటి విశ్వాసం లేదంటున్నారు వి. చలపతిరావు

కేంద్ర బడ్జెట్ సామాన్యునికి ఏమి ఇవ్వగలదు?

భారతదేశంలో ఎలాంటి వారు సామాన్యజనులు, వీరు మొత్తం జనాభాలో ఎంత శాతం, వారి సమస్యలేమిటి, వారి తలసరి ఆదాయమెంత, వారికి చిదంబరం కలల బడ్జెట్ ఏమి ఇవ్వగలదు అన్న విషయాన్ని పరిశీలించటం ఈ వ్యాసం ఉద్దేశం.

ఈ దేశంలో గ్రామీణ బీదలు (కార్మికులు, చిన్న రైతులు, గ్రామీణ వృత్తులవారు), పట్టణాలలో నివసించే బీదలు (వీరు ఎక్కువగా మురికివాడలలో, లేబర్ కాలనీలలో నివసించేవారు) వీరు కాక అడవి ప్రాంతంలో తండాలలో నివసించే గిరిజనులు వగైరా, సామాన్య జనులుగా పరిగణించబడతారు. వీరి సంఖ్య మొత్తం దేశ జనాభాలో టూకీగా అరవై శాతం ఉంటుంది. వీరిని ఉద్ధరించడమే కాంగ్రెస్ ముఖ్య కార్యక్రమమని సోనియా గాంధీ చెపుతుంది. కనుక ఈ బడ్జెట్, ఆ దిశలో ఎంత వరకు ఉందో చూద్దాం.

నేడు డెబ్భై శాతం సామాన్య ప్రజల (అరవై శాతం బీదలు + 10 శాతం కింది స్థాయి మధ్యతరగతివారు) బునియాదీ సమస్యలలో మొదటిది మండుతున్న ధరలతో వేగలేక పోవటమే, బతుకులను భారంతో ఈడ్చుకుంటూ పోవటమే. ఈ స్థితి సుమారు ఒక సంవత్సరం నుండి నిలకడగా ఉంది. క్రమంగా కూరగాయలు, బియ్యం, గోధుమలు, పప్పులు, ఉల్లిగడ్డలు, నూనె, కిరోసిన్ వగైరా నిత్యావసర వస్తువుల ధరలు 20 నుండి 120 శాతం వరకు పెరిగాయి. విపరీతంగా పెరిగిన ధరల భారం వలన పంజాబ్ లాంటి అభివృద్ధి చెందిన రాష్ట్ర ప్రజలు కూడ తల్లడిల్లిపోయి మొన్నటి ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వంకు గుణపాఠం నేర్పారు. వాస్తవానికి ఆర్థికవేత్త, సంస్కరణవాది ప్రధానమంత్రి మన్మోహన్ గానీ, లోగడ కొన్ని కలల బడ్జెట్లు అందించిన చిదంబరం గానీ పెరుగుతున్న ధరల గురించి ఎన్నడూ పట్టించుకోలేదు. ధరల గురించి ఎవరయినా వారి దృష్టికి తెస్తే వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో ధరలు పెరగడం సామాన్యమని దాటవేసేవారు. సోనియా కూడ అప్పుడప్పుడూ పెరుగుతున్న ధరల గురించి వీరికి రాస్తున్నది. కాని వారు చెవిన పెట్టిన పాపాన పోలేదు. ఇప్పుడు ముంబాయి మున్సిపల్ ఎన్నికలలో, పంజాబ్ ఉత్తరాంచల్ ఎన్నికలలో కాంగ్రెస్‌కు చుక్కెదురు కాగానే, యు.పిలో జరుగబోవు ఎన్నికల దృష్ట్యాను సోనియా గాంధీ ఇతర కాంగ్రెస్ నాయకుల నుండి ఆర్థిక మంత్రి పై ఒత్తిడి బాగా పెరిగింది. ధరలను అదుపులో పెట్టకపోతే యు.పి. ఎన్నికలలో కాంగ్రెస్ గెలవటమనేది కష్టం అనే సంకేతం ప్రధానమంత్రికీ, విత్తమంత్రికీ ఇచ్చారు. ఇలాంటి ఒత్తిడిలోనే ఆర్థిక మంత్రి ఇటు సంక్షేమరంగానికి అటు వ్యవసాయరంగానికి కొన్ని కేటాయింపులు ఎక్కువ చేశాడు. కాని ఆయన చిత్తం, ఆయన ధీమా అంతా ఐ.టి., ఇతర పారిశ్రామికోత్పత్తుల ఆధారంగా వేగంగా పెరుగుతున్న జి.డి.పి. వృద్ధిరేటు పైననే ఉంది. అందుకనే ఆయన అటు దేశ వృద్ధిరేటు దెబ్బతినకుండా, ఇటు ద్రవ్యోల్బణం అదుపులో ఉండే విధంగా బడ్జెట్‌ను రూపొందించాను అని, ఇటు పాము చావకుండా అటు కట్టె ఇరుగని రీతిలో సర్దిచెబుతున్నాడు.

ఈ విధంగా ఒత్తిడి పెరుగగానే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టటానికన్నా పూర్వమే 26 ఫిబ్రవరి రోజున పెట్రోలు ధర లీటర్‌కు రెండు రూపాయలు, డీజిల్ ధర లీటర్‌కు ఒక్క రూపాయి తగ్గించినట్లు ప్రకటించారు. ఇలా ఆయిల్ ధరలు తగ్గించటం వలన ట్రాన్స్‌పోర్టు చార్జీలు తగ్గి వస్తువుల ధరలు తగ్గగలవని ప్రభుత్వం భావించి ఉండవచ్చును. కాని ఈ చర్య వలన అత్యవసర వస్తువుల ధరలు తగ్గలేదు. సామాన్యులకు ఉపశమనం లభించలేదు. ధరలు పెరుగుతూనే ఉన్నాయి.

ఈ సారికి కేంద్ర బడ్జెట్‌లో ఫ్యూచర్ ట్రేడింగ్ విధానాన్ని నిషేధించారు. ఈ విధానాన్ని ఎన్.డి.ఎ. ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టారు. దీని వలన గోధుమల హోల్‌సేల్ ధరలు తగ్గుముఖం పట్టాయన్న వార్తలు వచ్చాయి. కాని వినియోగదార్లకు ఉపశమనం కలిగించే రిటేల్ ధరలు తగ్గినట్లు లేదు. ఇప్పటికీ పెరిగిన ధరలకే గోధుమలు లభిస్తున్నాయి. కనుక ప్రభుత్వ ఈ చర్య వల్ల సామాన్య ప్రజలకు ఎలాంటి లాభం జరుగలేదు. ఈ విధానంలో రైతులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉందన్నారు. ఎందుకంటే వ్యాపారులతో ఫ్యూచర్ ట్రెడింగ్‌లో ఎగ్రిమెంట్ చేసి కొనేటప్పుడు రైతు తనకు అనుకూలమైన రేటులో బేరమాడి అగ్రిమెంట్‌లో ఎంటర్ కావచ్చును. కాని వ్యాపారులు అలా కొన్న వేలాది క్వింటాళ్ల ధాన్యాన్ని, పప్పులను నిలువచేసి ధరలు పెంచి విడుదల చేయటం వలనే రిటేల్ రేట్లు పెరిగి వినియోగదారులు బాధలకు లోనయ్యారు.

సిమెంట్ ధరలు

ఆర్థికమంత్రి బాగా పెరిగిన సిమెంట్ ధరలు తగ్గించాలని, సిమెంట్‌పై ఎక్సైజ్ సుంకం బస్తాకు రు. 190 లోపు విక్రయిస్తే టన్నుకు రు. 350 ఎక్సైజ్ సుంకం, రు. 190 దాటితే రు. 600 సుంకం అని ఈ బడ్జెట్‌లో ప్రకటించాడు. ప్రకటించిన సుంకం రేట్లను ఎరగా తీసికొని వెంటనే సిమెంట్ పరిశ్రమదారులు బస్తాకు ఒక్కటింకి రు. 170 నుండి రు. 210 వరకు పెంచారు. దాని తర్వాత ఆర్థికమంత్రి ఎన్ని తీరుల నయాన భయాన చెప్పిచూసినా సిమెంట్ పరిశ్రమదారులు ఒక మెట్టుకూడ దిగిరాలేదు. చివరకు ఇదే రేటు పై సిమెంట్ ఒక సంవత్సరం వరకు ధర పెంచకుండా అమ్మగలమని, దించేది మాత్రం లేదని సదరు రేటు ఫ్రీజ్‌కు ఒప్పుకున్నారు. అంటే తమ ఉత్పత్తులకు రేటు ఫిక్స్ చేసుకోవడంలో పరిశ్రమదారులదే పై చేయి అవుతున్నదన్నమాట. అదే టమాట రైతులకు ప్రస్తుతం కిలోకు ఒక రూపాయి కూడ దొరకటం లేదు. కాని రిటైల్ మార్కెట్‌లో 10, 12 రూపాయల వరకు ఉంది. దీనిని బట్టి మధ్య దళారీల వాటా ఎంత ఉందో గ్రహించవచ్చు. ఈ మధ్య పెద్ద కంపెనీలు నడిపే మాల్స్, సూపర్‌బజార్ యజమానులు, 'మేం రైతుల వద్ద కూరగాయలు డైరక్టుగా కొని వినియోగదారులకు చౌకగా ఇస్తామ'ని తొలుత ప్రకటించారు. కాని వారు కూడ టమాటలను 10, 12 రూపాయలకే అమ్ముతున్నారు. ఒకవేళ వారు రైతుల వద్ద కొంటే వారికి ఒక రూపాయికి కిలో చొప్పున పడుతుంది. అప్పుడు వారు ఒక కిలోకు రు. 1 ట్రాన్స్‌పోర్టు చార్జి, అదే విధంగా రు. 1 లాభం తీసికొని కిలోకు 4 లేదా 5 రూపాయలకు మాత్రమే అమ్మాలి కదా! కాని వీరి లాభాలకు, మధ్య దళారీలకు తేడా ఏమిలేదు. ఏది ఏమయినప్పటికీ మార్కెట్‌లో వినియోగదార్లకు, ఉత్పత్తిదార్లకు వ్యతిరేకంగా జరిగే తతంగమంత ప్రేక్షకపాత్ర వహించి ప్రభుత్వం చూస్తోంది. ఈ బడ్జెట్‌లో ఎలాంటి ఉపశమనం లేదు.

పైగా ఈ ప్రభుత్వం మేం సమ్మిళిత వృద్ధిని సాధిస్తామని గొప్పగా చెప్పుకుంటోంది. ఇది సరికొత్త పదజాలం. నెహ్రూ హయాంలో వెల్‌ఫేర్ స్టేట్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ మా ధ్యేయం అన్నారు. ఇందిరాగాంధీ హయాంలో సోషలిస్ట్ సొసైటిని సాధించటం మా ధ్యేయం అన్నారు. సోషలిస్ట్ పాటర్న్ ఆఫ్ సొసైటి పదాన్ని రాజ్యాంగంలో కొత్తగా చేర్చారు. 'గరీబీ హఠావో' అనే నినాదం తీసికొని ఆమె హయాంలో పంచవర్ష ప్రణాళికలకు సమాంతరగా 20 సూత్రాల ప్రణాళికనొకదానిని అమలు పరిచింది. పి.వి. నరసింహారావు హయాం నుండి ఆర్థిక సంస్కరణల పేర ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ అనే క్యాపిటలిస్ట్ ప్రక్రియలను ప్రభుత్వం సపోర్ట్‌తో ప్రవేశపెట్టి ఆ దిశలో ఆర్థికవ్యవస్థను నడిపిస్తున్నారు. 15 ఏండ్ల ప్రపంచీకరణ అమలు తరువాత ఈ దేశంలో సంపన్నవర్గాలకు, సామాన్యులకు మధ్య, అదే విధంగా బస్తీవాసులకు - పల్లెవాసులకు మధ్య అంతరాలు బాగా పెరిగిపోయాయి. ఇటీవల ప్రకటించిన సాంపిల్ సర్వే రిపోర్ట్ ప్రకారం సామాన్య ప్రజల రోజువారి తలసరి సంపాదన రు. 12 మాత్రమే. అదే సమయంలో దేశవాసుల సరాసరి తలసరి ఆదాయం ఒక్క డాలరు, అంటే 45 రూపాయలు మాత్రమే. బీద ప్రజలకు వెన్నుదన్నుగా ఉన్న ప్రజాపంపిణీ వ్యవస్థ పూర్తిగా బలహీనపడింది. విద్య, వైద్య సౌకర్యాలు కరువయ్యాయి. బీదరైతులు పండించే కూరగాయలకు, ఇతర పంటలకు గిట్టుబాటు ధరలూ, సంస్థాగత అప్పులూ లభించటం లేదు. బీద మధ్య తరగతి రైతుల ఆత్మహత్యలు జరుగుతూనే ఉన్నాయి.

ఇంకొకవైపు కార్పొరేట్ సెక్టర్ పండించే లాభాల పంటపై ఆధారపడి పెరిగిన వృద్ధి రేటును (8 శాతం) చూపిస్తూ దేశం మొత్తం అభివృద్ధి అవుతున్నదని భ్రమలు కల్పిస్తున్నారు. నిన్నటి దాక రైతుకూలీల పాటలు పాడిన పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వం నడిపిస్తున్న సి.పి.ఎం. పార్టీ వారు కూడా సెజ్‌ల పేర ఇప్పుడు టాటా బిర్లాల పాట పాడుతున్నారు. మార్చ్ 14, 2007న పశ్చిమ బెంగాల్ పోలీసులు నందిగ్రాంలో స్పెషల్ ఎకనామిక్ జోన్‌లకు రైతుల రెండు పంటలు పండే పంట భూములను ఆక్రమించుకొనె విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న అక్కడి రైతులపై కాల్పులు జరిపి పదహారు మందిని పొట్టనపెట్టుకున్నారు. ఇదీ నేటి ప్రభుత్వాలు అమలు పరుస్తున్న సమ్మిళిత వృద్ధి తీరు విధానం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడ పెద్ద ఎత్తున ఇటు ప్రభుత్వ భూములు అటు ప్రైవేట్ భూములు లక్షలాది ఎకరాలను బహుళజాతి సంస్థలకు, లోకల్ పెద్ద కంపెనీలకు సెజ్‌ల పేర అంటగట్టాలని ఆరాటపడుతోంది. బడ్జెట్‌లో వ్యవసాయ, సంక్షేమ రంగాలకు వెచ్చించే కేటాయింపులన్నీ చిత్తశుద్ధి లేని కంటి తుడుపు చర్యలు మాత్రమే.

కేంద్ర ప్రణాళిక పెట్టుబడుల్లో వ్యవసాయం దాని అనుబంధ కార్యకలాపాలకు 2006-07 బడ్జెట్‌లో కేటాయించిన రు.7391 కోట్లపై 15.7 శాతం పెంచి, 2007-08 సంవత్సరానికి రు.8558 కోట్లు కేటాయించారు. ఇందులో వ్యవసాయానికీ, సహకార రంగాలకు రు.5520 కోట్లు (గత సంవత్సరం రు. 4860 కోట్లు) పశుసంవర్ధక శాఖకు రు.910 కోట్లు (2006-07 లో రు.750 కోట్లు) కేటాయించారు.

2007-08లో రు. 2,25,000 కోట్లు పంట రుణాలుగా ఇవ్వాలని (రు. 1,75,000 కోట్లు 2006-07 బడ్జెట్‌లో కేటాయించారు) కొత్తగా యాభై లక్షలమంది రైతులకు బ్యాంకు రుణాలకు అనుసంధానం చేసే లక్ష్యంగా పెట్టుకున్నారు.

భూగర్భజలాల పెంపుకై నాబార్డ్‌కు రు. 1800 కోట్ల రూపాయలు కేటాయించారు. ఎరువులపై సబ్సిడిని ఈసారి నేరుగా రైతులకే అందచేయాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీనికొరకు 2007-08 బడ్జెట్‌లో రు. 24,450 కోట్లు కేటాయించారు. (2006-07 బడ్జెట్‌లో రు. 17,253 కోట్లు). స్వల్పకాలిక పంట రుణాలపై రెండు శాతం రాయితీ ఇచ్చె పథకం 2007-08లో కొనసాగగలదని ప్రకటించారు. దీని కోసం ఈ బడ్జెట్‌లో రు. 1677 కోట్లు కేటాయించారు. స్థూలంగా పై కేటాయింపులన్నీ వ్యవసాయరంగం అభివృద్ధి కొరకు చేసినవి. ఇందులో రు. 2,25,000 కోట్ల కేటాయింపులు లోన్ అకౌంట్ కింద చేసినది. అంటే వివిధ వ్యాపార, సహకార బ్యాంకులు రైతులకు పంట రుణాల కింద లేదా స్వల్పకాలిక పంట రుణాల నిమిత్తం ఇవ్వవలసినవి. కానీ, రిజర్వ్ బ్యాంక్ ఇటీవల ద్రవ్యోల్బణంను అదుపు చేయటానికి రెండు సార్లు సి.ఆర్.ఆర్. (క్యాష్ రిజర్వ్ రేషియో) ను పెంచి బ్యాంకుల వద్ద వ్యాపార నిమిత్తం ఉన్న రు. 33,000 కోట్ల నిధులను తమ వద్ద చేసే డిపాజిట్ కింద లాగేసింది. దాని పై వ్యాపార బ్యాంకులు కొంత

కినుక వహించాయి. వెంటనే తామిచ్చే అప్పులపై వడ్డీ రేట్లు పెంచాయి. ఇప్పుడు వ్యవసాయ రుణాలను తక్కువ వడ్డీకి ఇవ్వాలంటే అవి సరి అయిన విధంగా సహకరించకపోవచ్చును. బడ్జెట్ ప్రకారం రు. 2,25,000 కోట్ల రూపాయల రుణాలను అదనంగా 50 లక్షల రైతులతో సహ ఇప్పించటానికి జిల్లాలలో లీడ్ బ్యాంకు మేనేజర్లు, జిల్లా యంత్రాంగం గట్టి కృషి చేయవలసి ఉంటుంది. కాని అలా గట్టి కృషి చేసే తత్వం యంత్రాంగంలో లోపిస్తోంది. దానికి కారణం ప్రభుత్వ యంత్రాంగంలో ఐ.ఎ.ఎస్. ఆఫీసర్లతో సహా ప్రబలుతున్న అవినీతి ఇక అధికారంలో ఉన్న రాజకీయుల, మంత్రుల సంగతి చెప్పనక్కరలేదు. ఇక మిగతా కేటాయింపులు పైన చూపినవి. మరి కొన్ని చిల్లర కేటాయింపులు అన్నీ కలిసి రు. 39,000 కోట్లకు మించవు. అంటే ఈ బడ్జెట్‌లో ప్రణాళిక, ప్రణాళికేతర పద్దుల కింద చేసిన మొత్తం కేటాయింపులు రు. 6,80,000 కోట్లలో సుమారు ఆరు శాతం అన్నమాట. ఈ ఆరు శాతం నిధులతో డెబ్బై శాతం ప్రజలు ఆధారపడి నివసించే వ్యవసాయరంగాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేయదలుచు కున్నదన్నమాట. ఈ ఆరు శాతం కేటాయింపు నిధులతో వ్యవసాయ రంగం ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఆశించినట్లు జి.డి.పి. లో నాలుగు శాతం అభివృద్ధి సాధించగలదా?

ఇక సంక్షేమ రంగానికి కేటాయించిన నిధుల గురించి పరిశీలిద్దాం. గ్రామీణాభివృద్ధికి (గ్రామీణ గృహ నిర్మాణ కార్యక్రమంతో సహా) రు. 20,342 కోట్లు (2006-07లో రు. 18,268 కోట్లు) కేటాయించారు. ఇందిరమ్మ గ్రామీణ గృహ నిర్మాణ పథకం ఆంధ్రప్రదేశ్‌లో చాలా నత్తనడక నడుస్తోంది. అందులో ఇప్పుడే సిమెంట్ ధరలు, ఈ బడ్జెట్ ప్రవేశపెట్టగానే మరో ఇరవై శాతం పెరిగాయి. ఈ పెరిగిన ధరలను ప్రభుత్వం తగ్గించలేకపోయింది. కావునా గ్రామీణ, గృహనిర్మాణ కార్యక్రమం మరింత నత్తనడక నడవవచ్చును. ఆర్థికమంత్రి ఈ బడ్జెట్ ప్రవేశపెట్టకముందు గత సంవత్సరం బడ్జెట్ కేటాయింపులలో ఎంతవరకు నిధులు ఆయా స్కీముల అమలుకు విడుదల అయ్యాయో, అలా విడుదల అయిన నిధులలో ఎన్ని ఖర్చు అయ్యాయో, భౌతికలక్ష్యాలు ఎంతవరకు సాధించబడ్డాయి వగైరా విషయాలపై పార్లమెంట్‌కు ఒక రిపోర్ట్ సమర్పిస్తే బాగుండేది. కాని ప్రజల సమాచారం కొరకు అలా చేయలేదు. పార్లమెంట్‌కు అలాంటి సమాచారం అందజేయాలని పోయిన సంవత్సరం చట్టం కూడా చేశారు.

ఇక జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ పథకాన్ని ఈ బడ్జెట్‌లో మరో రెండు వందల జిల్లాలకు విస్తరించడమైనది. ఇప్పుడు ఈ పథకం మొత్తం 330 జిల్లాలకు అమలు చేయబడుతోంది. ప్రతి జిల్లాలో ఈ పథకం అమలుకు రు. 100 కోట్లు కేటాయిస్తున్నారు. ఈ పథకం ఈ ఏడాది ఒక్క రాజస్థాన్ జిల్లాలోనే సక్రమంగా అమలు అయినట్లు, మిగతా రాష్ట్రాలలో సరిగా అమలు కాక, చాలా జిల్లాలలో 30 శాతం నిధులు మాత్రమే ఖర్చు అయినట్లు రిపోర్టులు ఉన్నాయి. కనుక ఆర్థికమంత్రి ఈ పథకాన్ని మరో 130 జిల్లాలకు విస్తరించటానికి మొదట ఒప్పుకోలేదు. చివరకు ప్రధానమంత్రి ప్రోద్బలంతో ఈ స్కీంను మరో 130 జిల్లాలకు విస్తరించడమైంది. గ్రామీణాభివృద్ధికి సంబంధించిన ఏ ప్రతిపాదన పంపినా ప్రణాళికా సంఘం, ఆర్థికశాఖ విముఖతను చూపుతూ ప్రతిపాదనలను తిప్పికొడుతుంటే గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు రఘువంశప్రసాద్, ఆర్థిక శాఖ, ప్రణాళిక సంఘం, గ్రామాలకు బీదవాళ్లకు వ్యతిరేక లాబీలుగా తయారైనవని అన్నారు. 'సమ్మిళిత అభివృద్ధి' అనే పదం వాడుకుంటూ గ్రామాల మీద మొసలి కన్నీరు కారుస్తున్నారే కాని వీరికి గ్రామీణాభివృద్ధి పైన ఎలాంటి విశ్వాసం లేకుండా పోతోంది. గ్రామీణ ఓటు బ్యాంకులకొరకే ఈ పాట్లు. నేటి పాలకుల దృష్టి అంతా నగరాల అభివృద్ధి, విదేశీ పెట్టుబడులతో అభివృద్ధి అయ్యే భారి పరిశ్రమలపైననే ఉంది. ◆

పార్టీల మార్పిడి విషయంలోనూ, అసెంబ్లీలోనూ, పొత్తుల విషయంలోనూ, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ
తెలుగుదేశం కాంగ్రెస్‌కు భిన్నమైన సంస్కృతిని చూపలేదంటున్నారు **నరిశెట్టి ఇన్నయ్య**

తెలుగుదేశం పాతికేళ్ల మనుగడ ఒక పరిశీలన

నేపథ్యం

కాంగ్రెస్ అరాచకత్వ పరిస్థితుల నుండి తెలుగుదేశం పుట్టింది. పరిపాలనపై విసుగుపుట్టడం కూడా కాంగ్రెస్ కలుషిత రాజకీయ సృష్టే. ఇది 1978లో కేంద్రంలో మొదలుకాగా, ఆంధ్రప్రదేశ్‌లో 1982లో మొదలయ్యింది. ఆనాటి వాతావరణం సమీక్షిస్తే, కాంగ్రెస్ పాలకులు ఢిల్లీ ప్రదక్షిణలు చేయడం, ప్రతి చిన్న నిర్ణయానికీ కేంద్రంవైపు చూడడం ఆనవాయితీ అయింది. దీనికి తోడు నాలుగేళ్లలో నలుగురు ముఖ్యమంత్రుల్ని మార్చేసిన వినూత్న పరిస్థితి ఉంది. ముఖ్యమంత్రుల్ని పురుగుల వలె చూస్తూ, అంజయ్య వంటి ముఖ్యమంత్రిని నాటి ప్రధాని కుమారుడు రాజీవ్‌గాంధీ అవమానపరచడం, రాష్ట్రాన్ని కేంద్ర రాజధానికి తాకట్టు పెట్టారనే అభిప్రాయం ప్రబలించడం కద్దు.

ఆ నేపథ్యంలో ఎన్నడూ రాజకీయాల జోలికి పోని తెలుగు నటుడు ఎన్.టి.రామారావు రంగప్రవేశం చేశారు. వివరాలు ఎలా ఉన్నా, ఆయనకు సానుకూల వాతావరణం అనుకోకుండా ఏర్పడింది. రాష్ట్రమంతటా జనం నీరాజనం పట్టి, స్వాగతించారు. పరిస్థితిని గమనించి ఈనాడు వంటి పత్రికలు మద్దత్తుగా కాపు వేసుకున్నాయి. తెలుగుదేశం పార్టీ అలా ఆవిర్భవించి 1982 ఎన్నికలలో తిరుగులేని బలంతో అసెంబ్లీకి వచ్చింది.

ఆరంభదశ

సుడిగాలి ప్రభంజనంలో పుట్టిన తెలుగు దేశం, తొమ్మిది నెలల్లో అధికారం చేపట్టి, అతి చిన్న మంత్రివర్గంతో పాలన ఆరంభించింది. అంజయ్య ఎయిర్‌బస్ మంత్రివర్గాలను వెక్కిరించిన జనం 10 మంది కేబినెట్ మంత్రుల, అయిదుగురు స్టేట్ మినిష్టర్ల కేబినెట్‌ను హర్షించారు.

నాదెండ్ల భాస్కరరావు, నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పి. మహేంద్రనాథ్, ఎస్. సత్యనారాయణ, ఈలి ఆంజనేయులు, కె.రామచంద్రరావు, పూసపాటి ఆనందగజపతి రాజు, కె. జానారెడ్డి, ఎస్. రామమునిరెడ్డి, (కేబినెట్ హోదాలోనూ), కె. ప్రతిభా భారతి, ఎం. రామచంద్రరావు, వై. రామకృష్ణుడు, టి. జీవన్‌రెడ్డి, మహమ్మద్‌షకీర్ స్టేట్ మంత్రులుగానూ ఉన్నారు. ఈలి ఆంజనేయులు చనిపోగా ఆ స్థానంలో హరిరామజోగయ్యకు స్థానం లభించింది.

ఎన్.టి.రామారావు ఆకర్షణ, బలం, కారణంగా ఆనాడు నిరసనలు వినిపించలేదు. ఎదురులేని పాలన సాగింది. ఎన్నికల వాగ్దానాలు ఆచరించడానికి మళ్లీ అధికార వర్గంపై ఆధారపడక తప్పలేదు.

ముఖ్యమంత్రి మద్రాస్‌ను అనుకరిస్తూ రెండు రూపాయలకు కిలో బియ్యం సరఫరా చేయించారు.

సామాజిక రంగంలో ఎన్.టి.రామారావు తీసుకున్న నిర్ణయాలు గొప్పవి. చిరకాలంగా వస్తున్న వంశపారంపర్యతను అటు గ్రామాధికార వ్యవస్థలోనూ, ఇటు దేవాలయ పురోహిత వర్గాలలోనూ రద్దు గావించారు. పీడ వదిలిందని జనం వ్యాఖ్యానించారు. కానీ పురోహిత వర్గం కక్షకట్టింది. శాపనార్థాలకు పూనుకుంది.

బౌద్ధ సంస్కృతి పూర్తిగా కాకున్నా కృష్ణా జిల్లాలో ఉన్న ప్రభావం వలన, కొంత మేరకు రామారావు ప్రవేశపెట్టారు. ఇందుకు చిహ్నంగా పెద్ద బౌద్ధ విగ్రహాన్ని హైదరాబాద్‌లో చెరువు మధ్య నిలబెట్ట దలచారు. హైందవ సనాతనులు దీనిని నిరసించారు.

రామారావు అధికారంలో ఉన్నంత కాలం బాబాలు, మాతలు దరికి చేరలేదు. వారి మాటలు సాగకుండా చూశారు. అదొక విశేషం. కాని మతపరంగా రామారావు తిరోగమన వాదిగానే ప్రవర్తించి, సెక్యులరిజాన్ని పాటించలేదు.

అసెంబ్లీలో ఎదురులేని ఎన్.టి.రామారావు, కౌన్సిల్‌లో తీవ్ర విమర్శల్ని తట్టుకోలేకపోయారు. చివరకు ఆ ధోరణే కౌన్సిల్ రద్దుకు దారితీసింది.

తెలుగుదేశం పై పోటీ చేసి ఓడిపోయిన చంద్రబాబునాయుడిని పార్టీలో చేర్చుకుని, మామ బలహీనత చూపారు. పార్టీ కేడర్ నిర్మాణానికి చంద్రబాబు తోడ్పడ్డారు.

దళితుల కాపు కాస్తున్నదనే భ్రమ కాంగ్రెస్ కల్పించగా, వెనుకబడిన కులాలలో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. తెలుగుదేశం ఎన్.టి.రామారావు హయాంలో వెనుకబడిన కులాలకు పూర్తి మద్దత్తు

ఇచ్చింది. అప్పటి నుండే వెనుకబడిన కులాలు తెలుగుదేశం తమ పార్టీగా భావించారు. అది చంద్రబాబునాయుడు హయాంలోనూ కొనసాగింది.

ప్రజాస్వామికంగా వచ్చిన తెలుగుదేశం, తొలి విద్రోహ చర్యలో సంవత్సరానికే అధికారం కోల్పోయింది. నాదెండ్ల భాస్కరరావు కీలక పాత్రవహించిన ఈ చర్యలో కాంగ్రెస్, మజ్లీస్ అండగా నిలిచాయి. అభాసుపాలయ్యాయి. ఇదంతా మళ్లీ ఎన్నికలకు దారితీయడం, తెలుగుదేశం మరోసారి అధికారంలోకి రావడం ప్రజాస్వామ్యంలో కీలకాంశాలుగా మారాయి. వామపక్షాలు ఆనాడు తెలుగుదేశానికి అండగా నిలిచాయి. ఇది ద్వితీయ కాండం. అప్పటి నుండే చంద్రబాబునాయుడు పార్టీ నిర్మాణంలో, ప్రముఖ పదవులలో నిలదొక్కుకున్నారు. రామారావు బలహీనతలు బయటపడ్డాయి. దేశంలో ప్రతిపక్షాలను, ప్రజాస్వామిక శక్తులను కూడగట్టడానికి తెలుగుదేశం యథాశక్తి కృషి చేసింది. తెలుగు వారి వాణి దేశ రాజధానిలో ధ్వనింపచేసింది. మద్రాస్ వారనే పేరు తుడిచిపెట్టగలిగింది.

ఎన్.టి.రామారావు తన బలహీనతలతో కాషాయవస్త్ర ధారణ, వివేకానందను అనుకరించడం చేయకపోలేదు. అవి తాత్కాలికంగానే సాగాయి. అయితే తెలుగు సంస్కృతి చిహ్నాలు, కళలు, సాహిత్య ప్రతీకల్ని ప్రచారంలోకి తెచ్చి, టూరిస్టు ఆకర్షణలుగానూ మార్చారు.

ఎన్.టి.రామారావు రెండోసారి కేబినెట్ ఏర్పరచడంలో 19మంది కేబినెట్‌లోనూ, 8 మంది స్టేట్ స్థాయిలోనూ ఉన్నారు. (1984 సెప్టెంబర్ నుండి డిసెంబర్ వరకు)

మూడో కేబినెట్ 1985 జనవరిలో 16 మంది కేబినెట్ హోదాతో, 8 మంది స్టేట్ హోదాతో ఉన్నారు. 1986 మేలో దీనిని విస్తరించి మరో అయిదుగురిని స్వీకరించారు. తొలిదశలో అల్లుళ్లను దూరంగా ఉంచడం విశేషమే అయినా ముఖ్యంగా చంద్రబాబునాయుడు తెరవెనుక ప్రముఖ పాత్రవహిస్తూ వచ్చాడు. కర్షక పరిషత్ అధ్యక్షుడుగా ఉన్నా నిర్ణయాల వెనుక పాత్ర ఉండేది.

ఎన్.టి. రామారావు స్త్రీలకు పంచాయితీ సంస్థలలో రిజర్వేషన్ పెట్టి కొత్త ఒరవడి సృష్టించారు. అది పేర్కొనదగిన అంశం.

1982లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం మంచిచెడుల సమ్మేళనంతో 1989 నాటికి, ప్రజాదరణ కోల్పోయింది. మళ్ళీ సైకిల్ చుట్టిరాగా తెలుగుదేశం ప్రధాన ప్రతిపక్ష స్థాయిలోకి పోయింది. కాంగ్రెస్ గద్దెనెక్కి మర్రి చెన్నారెడ్డి, ఎన్. జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రులుగా తమ సంస్కృతిని తిరగదోడారు. ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోని కాంగ్రెస్ పట్ల మరోసారి ప్రజలు విసుగుచెందారు. ప్రతిపక్షం స్థానంలో తెలుగుదేశం గొప్ప పాత్ర నిర్వహించలేదు. కానీ మార్గాంతరంగా ప్రజలు ఆపార్టీకి మరోసారి పట్టంగట్టారు.

1994 డిసెంబర్‌లో ఎన్.టి.రామారావు 23మంది కేబినెట్ మంత్రులతో, 9 మంది స్టేట్ మంత్రులతో మంత్రివర్గాన్ని ఏర్పరచారు. అప్పటికి చంద్రబాబునాయుడు కథ నడిపించాడు. అలా తొమ్మిది నెలలు గడిచేసరికి, కథ మారింది.

ఈలోగా ఎన్.టి.రామారావు వ్యక్తిగత జీవితంలో మార్పులు వచ్చాయి. పట్టించుకోపోగా, మరో వివాహం చేసుకున్నాడు. దీనిపై జనంలో మిశ్రమ స్పందన వచ్చింది. ప్రతిపక్షంలో ఉంటూనే రామారావు సినిమాలలో నటించాడు. రామారావు పాలనలో అవినీతి అతి పరిమితంగా ఉన్నదనే మంచి పేరు వచ్చింది. ఎన్.టి. రామారావు అధికారంలో ఉండగా కాపు-కమ్మ కలహాలు విజయవాడలో మొదలై రాష్ట్రమంతా వ్యాపించడం ఒక మచ్చగా మిగిలింది.

అయితే హైదరాబాద్ పాతబస్తీలో కాంగ్రెస్‌హయాంలో జరిగినట్లు, హిందూ-ముస్లిం కొట్లాటలు జరగకపోవడం ఆ పార్టీకి పేరు తెచ్చింది.

రామారావు సెక్యులరిజాన్నీ, సైంటిఫిక్ ధోరణినీ పాటించలేదు. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా వ్యక్తిగత మత విశ్వాసాలను సెక్రటేరియట్ స్థాయి వరకూ రానిచ్చారు. మతపరమైన బౌద్ధాన్నే ప్రోత్సహించి మానవవాద బౌద్ధాన్ని పక్కన బెట్టారు.

చంద్రబాబు చాణక్యం

నాదేండ్ల భాస్కరరావు కుట్రలో పార్టీ మద్దత్తు తక్కువ, బయట పార్టీల బలం ఎక్కువ. అందుకు భిన్నంగా చంద్రబాబునాయుడు పార్టీలోనే బలం సాధించి, ఎన్.టి.రామారావు స్థానంలోకి అడుగుపెట్టగలిగాడు. అది ముఖ్యమంత్రి గ్రహించేలోపే, వైస్రాయి హోటల్లో మకాం పెట్టి చంద్రబాబు తన బలం నిరూపించి, ముఖ్యమంత్రి కాగలిగాడు.

కేవలం 9 మంది మంత్రులతో, ఇరువురు స్టేట్ మంత్రులతో ఆరంభించి, ఒక నెలలోనే కేబినెట్‌ను విస్తరించాడు. అంతే మళ్ళీ వెనక్కు చూడకుండా బండినడిపాడు.

1999లో చంద్రబాబునాయుడు మరోసారి ముఖ్యమంత్రి అయ్యాడు. 2001లో మంత్రివర్గాన్ని విస్తరించాడు. ఇంచుమించు అంజయ్య ఎయిర్‌బస్ మంత్రివర్గం వలె పెంచేశాడు.

తెలుగుదేశం చంద్రబాబునాయుడు నాయకత్వాన కేంద్ర రాజకీయాలలో కీలపాత్ర పోషించింది. పార్టీసభ్యుడు బాలయోగిని స్పీకర్‌గా చేయగలిగింది. అయితే మంత్రివర్గంలో చేరకుండా నిర్ణయాలలో ప్రముఖపాత్ర వహించడం విశేషం. కాంగ్రెసేతర పార్టీలతో చేతులు కలిపి చంద్రబాబునాయుడు రాజకీయం నడిపించారు.

రాష్ట్రంలో హైటెక్ విధానాలను అవలంబించిన ఖ్యాతి తెలుగుదేశానిదే. సమాచార ప్రసారాలకు కంప్యూటర్ టెక్నాలజీ విస్తృతంగా వాడారు. జిల్లా, నగర స్థాయిలో అధికారులతో ఈ కంప్యూటర్ సాంకేతికతను వాడేటట్లు చేశారు.

రైతుబజారు పద్ధతి ప్రవేశపెట్టి, దళారీలను తొలగించి పంటలకు గిట్టుబాటు ధర ఇప్పించే ప్రయత్నం చేశారు. నీటి సరఫరా, పొదుపు వంటి పథకాలు చేబట్టారు. నగరాలలో ఫ్లైఓవర్లు, రోడ్లు అభివృద్ధి చేశారు.

వివిధ పథకాలకు ప్రపంచబ్యాంకు రుణాలను విస్తారంగా స్వీకరించడం తెలుగుదేశంలో ఒక కొత్త అంశం. తిరిగి చెల్లించే విధానం ఆలోచించకుండా ఇలా చేయడాన్ని విమర్శించిన ఆర్థిక నిపుణులకు సమాధానం చెప్పలేకపోయాడు. సాంకేతిక రంగంలో ఉన్నత స్థాయికి చేరే దిశగా, హైదరాబాద్ కేంద్రంగా ఇంజనీర్లకు, నిపుణులకు ప్రోత్సాహం ఇచ్చారు. బిజినెస్ యాజమాన్యులకు బాగా చేయూత నిచ్చారు.

అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్‌ను హైదరాబాదుకు రప్పించడం చంద్రబాబు నాయుడు పదవిలో ఒక పెద్ద మలుపే. ఇందులో వెలుగు నీడలు లేకపోలేదు.

బిల్‌గేట్స్ వంటి ప్రపంచ కంప్యూటర్ పారిశ్రామికవేత్త దృష్టి కూడా తెలుగుదేశం ఆకట్టుకోగలిగింది. ఇంజనీరింగ్ యువతకు ఇవన్నీ ఉపాధికి ఉపకరించే అవకాశాలే.

తెలుగుదేశం అధికారంలో ఉండగా, వరుసగా ఐదేళ్లపాటు కరువుకాటకాలు, వర్షం లేకపోవడం, నగరాలకు ప్రవాసం, గ్రామాలు విపరీతంగా బాధపడడం జరిగింది. రుణభారంతో రైతులు, చేనేత వృత్తులవారు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ రంగాన్ని తెలుగుదేశం అశ్రద్ధ చేసిందనే విమర్శ బాగా వచ్చింది. పంటలు దెబ్బతిన్నాయి, రైతులలో తెలుగుదేశంపట్ల బాగా నిరసన ఏర్పడింది. ఆ విషయాన్ని చంద్రబాబునాయుడు పట్టించుకోలేదు. హైటెక్ మోజులో నేలవిడిచి సాము చేశాడు. గ్రామస్థాయిలో హైటెక్ విధానాలు ఎలా స్వీకరిస్తున్నారు, వాటి ఉపయోగాలు సామాన్యులకు చేరుతున్నాయా అనేది చూడలేకపోయారు. అధికారంలో ఉన్న వారికీ, గ్రామాల జనానికీ కమ్యూనికేషన్ వ్యత్యాసం ఎక్కువైంది. అది తెలుగుదేశం వైఫల్యం.

ఒక వైపు సైన్స్, సాంకేతిక రంగాలను వెనకేసుకొచ్చిన చంద్రబాబు, తెలుగుదేశం, మరోవైపు బాబాల్నీ, మాతల్నీ పరిపాలనలోకి సైతం తెచ్చారు. ఇది ఆసరాగా క్రైస్తవులు, ముస్లింలు బాగా వాడుకున్నారు. బ్రహ్మకుమారీలు, రవిశంకర్, సత్యసాయిబాబా ప్రభుత్వాన్ని వినియోగించుకోగా, చంద్రబాబు మూఢనమ్మకాలను భుజాన వేసుకున్నారు. యోగా పేరిట రవిశంకర్‌ను ప్రభుత్వంలోకి తెచ్చి అధికారులకు శిక్షణ ఇప్పించారు. బ్రహ్మకుమారీలకు, నాగఫణిశర్మ ఇంకా కొందరికీ ప్రభుత్వ స్థలాలు కట్టబెట్టారు. ఎన్.టి. రామారావుకు భిన్నంగా సాయిబాబా కాళ్లకు, మరికొందరు బాబాల పాదాలకు దాసోహమన్నారు. సాంఘికంగా చంద్రబాబునాయుడు వాస్తును, జ్యోతిష్యాన్ని, పంచాంగ శ్రవణాలను ప్రోత్సహించి తిరోగమనం వైపుకు దారి చూపారు.

తెలుగుదేశం తొలుత ప్రవేశపెట్టిన 2 రూపాయల కిలోబియ్యం పథకం, చంద్రబాబు పాలనలో అదృశ్యమైంది. అలాగే మద్యనిషేధం కూడా బాగా పలచబడేటట్టు చేశాడు. ప్రకటనలకీ, ఆచరణకీ తేడా కనిపించింది.

నక్సలైట్లూ దేశభక్తులే అంటూ ఎన్.టి.రామారావు ఆవేశపూరిత ఉపన్యాసాలతో ఆరంభించగా మళ్లీ మారణకాండ సాగింది. చివరకు తిరుమలకు వెడుతున్న చంద్రబాబుపై అలిపిరి వద్ద నక్సలైట్లు జరిపిన దాడి విఫలమయ్యింది. అది సానుభూతి సెంటిమెంటుగా మార్చుకోవాలని చంద్రబాబు ఎన్నికలు జరిపిస్తే, ఓటమి చవి చూసారు. ప్రజానాడి తెలుసుకోలేని కమ్యూనికేషన్ హైటెక్ మంత్రి కాస్తా మాజీ ముఖ్యమంత్రి అయ్యారు. పంచాంగం చెప్పించుకున్న చంద్రబాబు అధికారంలోకి రావడం ఖాయం అన్నా, ఆయనలో అంధ విశ్వాసాలు సడలలేదు.

2004లో తెలుగుదేశం రెండోసారి ప్రతిపక్షంలోకి వెళ్ళింది. అయితే మొదటిసారి వలెగాక, ప్రతిపక్షంగా చంద్రబాబు తీవ్రస్థాయిలో స్పందిస్తున్నారు.

ఎన్.టి.రామారావు ఉన్నంత కాలం ఒకే నాయకుడు ఆధిపత్యం వహిస్తున్న పార్టీగానే ఉంది. ఆ స్థితిలో చిన్న మార్పులు ఉన్నా, యించుమించు అలాంటి పరిస్థితిలోనే తెలుగుదేశం సాగుతోంది. ఒక పార్టీమీద, దాని తప్పుల ఆధారంగా మరోపార్టీ పెత్తనంలోకి వచ్చే స్థితిపైనే తెలుగుదేశం ఆశలు పెట్టుకుంది.

బి.జె.పి. నుండీ కమ్యూనిస్టు పార్టీల వరకూ ఎప్పుడు అవసరమైతే అప్పుడు తెలుగుదేశం కలిసి మెలసి చట్టాపట్టాలేసుకుంది. పార్టీల మార్పిడి విషయంలోనూ కాంగ్రెస్‌కూ, తెలుగుదేశానికీ మౌలిక భేదం లేదు. అసెంబ్లీలోనూ, ప్రభుత్వ కార్యాలయాలలోనూ తెలుగుదేశం భిన్న సంస్కృతిని చూపలేదు. ప్రాథమిక విద్య, ప్రజారోగ్యం విషయంలో మామూలుగానే తప్ప, తనదైన ముద్ర ఏదీ వేయలేదు. కాకుంటే 25 సంవత్సరాలుగా ఒక రాజకీయ పార్టీగా ప్రజలలో గట్టిగా నిలవడమే తెలుగుదేశం విశిష్ఠత. ◆

రాజకీయాలతో సమానంగా సామాజిక న్యాయానికి, ప్రజాస్వామ్యానికి పెద్ద పీట వెయ్యకపోతే రాబోయే ఎన్నికల్లో టిడిపి చేయాల్సింది అంకెల పోరాటమే అంటున్నారు రఘువీర్

టిడిపి పాతికేళ్ల ప్రస్థానం

ప్రజా ఉద్యమాల ద్వారానే రాజకీయ, సామాజిక నాయకత్వం ఉద్భవిస్తుంది. మనదేశంలో, రాష్ట్రంలో రాజకీయ ఉద్యమాల కంటే ముందు సాంఘిక ఉద్యమాలు తలెత్తాయి. జాతీయ స్థాయిలో రాజారామ్మోహన్‌రాయ్ వంటి సాంఘిక సంస్కర్తలు సతీసహగమనం వంటి దురాచారాలపై ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేశారు. గాంధీ కూడా అంటరానితనం వంటి ఎన్నో సామాజిక దురాచారాలపై పోరాటాలు చేశారు. తెలుగుగడ్డపై వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు వంటివారు సాంఘిక దురాచారాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చారు. సామాజిక నాయకత్వం మంచి ఫలితాలు అందించాయి. స్వాతంత్ర సమరంలో ప్రజలను రాజకీయంగా సంఘటితం చేసేందుకు కూడా ఈ సామాజిక ఉద్యమాలే నేపథ్యంగా ఉన్నాయి. ఇవే క్రమంగా ప్రజలకు రాజకీయ నాయకత్వం అందించేందుకు సోపానాలుగా ఉపయోగపడ్డాయి. తమ రచనల ద్వారా ప్రజలలో చైతన్యం అందించే కవులు, కళాకారులు కూడా ముందుకు వచ్చారు. రాష్ట్రంలో గ్రంథాలయోద్యమం తర్వాత ఆంధ్రోద్యమంగా మారింది. చీరాల పంచాయతీని మున్సిపాలిటీగా నాటి బ్రిటిష్ ప్రభుత్వం మారిస్తే దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పెద్ద ఎత్తున ఉద్యమించారు. బ్రిటిష్ దోపిడీ నుంచి ఏజెన్సీ విముక్తి కోసం అల్లూరి సీతారామరాజు పోరాటం చేస్తే, తెలంగాణలో నిజాంకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటాలు, సాయుధ పోరాటాలు జరిగాయి. సారా వంటి మత్తు పదార్థాలకు ప్రజలు బానిసలు కావడంతో వాటికి వ్యతిరేకంగా ఉత్తర కోస్తా జిల్లాల్లో సర్దార్ గౌతు లచ్చన్న బ్రహ్మాండమైన ప్రజా ఉద్యమాన్ని నడిపారు. రైతు సమస్యలపై శ్రీకాకుళం నుంచి మద్రాస్ వరకు 130 రోజులపాటు 1512 మైళ్ల దూరాన్ని నడిచి అక్కడ స్పీకర్ బులుసు సాంబమూర్తికి మెమొరాండం సమర్పించారు. ఇలాంటి పోరాటాలేవీ సమైక్యాంధ్ర కోసం చేసినవి కావు. స్థానిక సమస్యల ఆధారంగానే ఉద్యమాలు విస్తృతమయ్యాయి. మద్రాస్ నుంచి విడిపోయి తెలంగాణతో కలిసేందుకు పొట్టి శ్రీరాములు చేసిన ఆత్మత్యాగాన్ని అడ్డుపెట్టుకుని 1956లో నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఉమ్మడి రాష్ట్రాన్ని ఖరారు చేశారు. అది ఏకపక్ష విలీనం కావడంతో తెలంగాణలో ప్రత్యేకవాదం మటుమాయం కాలేకపోయింది. ఏమైతేనేం రాష్ట్ర అవతరణ జరిగిన తర్వాత రాష్ట్రాన్ని 27 ఏళ్లపాటు కాంగ్రెస్ పాలించగా, కాంగ్రెస్ పాలనలో రాజకీయ అస్థిరత, చిత్తశుద్ధి లోపం, ఢిల్లీ కంట్రోల్ పరిపాలన తదితర కారణాల వల్ల రాష్ట్రం అన్ని రంగాలలో వెనుకబడిపోయింది. ప్రజలకు ఉన్నత నాయకత్వం కరువైంది. కొన్ని వర్గాలకే రాజకీయాధికారం పరిమితమైంది. కీలక మంత్రి పదవులు ఇతర ఉన్నత గౌరవాలు బడుగు, బలహీనవర్గాలకు దక్కలేదు. పదవుల కోసం కాంగ్రెస్ నేతల మధ్య కీచులాటలు తారాస్థాయికీ చేరుకున్నాయి. శాంతి భద్రతలు క్షీణించి, కాంగ్రెస్‌కు కాంగ్రెస్సే శత్రువైంది. ఇలాంటి సంఘటనలే నూతన రాజకీయ వ్యవస్థ ఏర్పడటానికి, ప్రత్యామ్నాయ నాయకత్వం రాష్ట్రానికి లభించేందుకు కారణమైంది.

ఈనేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో ఒక చారిత్రాత్మకమైన మలుపునకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. ఆయన కవి కాకపోయినా, సినీ కళాకారుడు, వెండితెర వేల్పుగా ఆంధ్రుల హృదయాల్లో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్న ఎన్టీఆర్ సర్దార్ పాపారాయుడు చిత్రం షూటింగ్ సమయంలోనే రాజకీయ రంగప్రవేశ ఆలోచన కలిగింది. 30 ఏళ్లపాటు తెలుగు ప్రజల అభిమానాన్ని ప్రేమను చూరగొన్న ఎన్టీఆర్ తన 60వ సంవత్సరం తరువాత నుంచి సగం రోజులు సంఘసేవకే అంకితం అవుతానని ప్రకటించారు. మొత్తంగా తన సినిమాలను ప్రజలు ఆదరించినందుకు వారికేదో మేలు చేయాలనే తపనే, ఆయన్ను అటువైపు లాగింది. అయితే "రాజకీయాలు బురద గుంట లాంటివి, తెలిసి తెలిసి అందులో దిగడమెందుకు? ఇక్కడ మీకెదురు లేదు. లక్షలు సంపాదన వదులుకొని శుద్ధ దండుగ" అంటూ వచ్చిన సలహాలను ఆయన పట్టించుకోలేదు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కాంగ్రెస్ ముఖ్యమంత్రుల ఢిల్లీ కాంగ్రెస్ నేతల వద్ద తాకట్టు పెట్టడాన్ని ఆయన ఎంత మాత్రం సహించలేదు. అదే సమయంలో ఢిల్లీ నుంచి వచ్చిన రాజీవ్ గాంధీ తనకు స్వాగతం చెప్పడానికి ముఖ్యమంత్రిగా ఉన్న అంజయ్య బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు రాగా చడామడా తిట్టగా, తెలుగువారి ఆత్మగౌరవాన్ని కించపరచారనే విమర్శ వచ్చింది.

ఈ పరిస్థితుల్లోనే మార్చ్ 21, 1982కు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆ రోజు ఆదివారం. హైదరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తాలోని రామకృష్ణా సినీ స్టూడియోలో సాయంత్రం ఎన్టీరామారావు ఏర్పాట్లు చేసిన పత్రికా గోష్ఠికి అన్ని ప్రధాన పత్రికల కార్యాలయాలకు ఆహ్వానాలు అందాయి. అప్పటికి కొన్ని రోజుల ముందు నుంచే ఎన్టీరామారావు రాజకీయ రంగప్రవేశంపై ఊహాగానాలు సాగుతున్నాయి. ఎన్టీరామారావంటే కేవలం సినిమా హీరో మాత్రమే కాదు, మరేంటో తెలుసుకునేందుకు ఈ పిలుపు. పాత్రికేయుల్లో మహా ఉత్కంఠత. నిర్ణీత సమయానికి

ఎన్టీరామారావు అందరికీ నమస్కారం చెబుతూ, స్టూడియో మినీ ప్రివ్యూ థియేటర్‌లోకి అడుగుపెట్టారు. నిలువెత్తు తెల్లని దుస్తులు ధరించిన ఎన్టీఆర్ గంభీర స్వరంతో ఓ గంటసేపు తనదైన శైలిలో ప్రసంగించారు. తన సుదీర్ఘ నటజీవితం, ప్రజల ఆదరాభిమానాలు, వారి రుణం ఏ రూపంగానైనా తీర్చుకుంటానన్న అంశాన్ని చెబుతూ ప్రజాసేవకే ఇక తన జీవితకాలాన్ని అంకితం చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. తన ఆస్తులను కుటుంబ సభ్యులకు పంచి ఇచ్చి ఇకపై ఏ బాదరబందీ లేకుండా ఉంటానని, ఏ బంధాలు, అనుబంధాలు ప్రతిబంధకం కాబోవన్నారు. నిర్మాణంలో ఉన్న సినిమాలు పూర్తయ్యాక, మరే కొత్త చిత్రాలనూ అంగీకరించబోనని ఆయన స్పష్టం చేశారు. ఇలా మాట్లాడిన అనంతరం మళ్లీ కలుద్దామంటూ ఆయన పత్రికా గోష్ఠిని ముగించారు. ఇంకేముందీ ఆ సాయంత్రమే 6.15కి ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుంచి తెలుగులో, ప్రాంతీయ వార్తల్లో సినీ నటుడు ఎన్టీఆర్ రాజకీయరంగ ప్రవేశం చేయనున్నట్లు ప్రసారమైన వార్త రాష్ట్రంలో నలుమూలలా సంచలనం సృష్టించింది. ఊటీలో షూటింగ్ ముగించుకొని మార్చ్ 29న నగరానికి తిరిగి రాగానే వివరాలు ప్రకటిస్తానని రామారావు చెప్పారు అనేది వార్త. ఇది లక్షలాది శ్రోతల్లో వెంటనే పట్టలేని ఆశ్చర్యం, ఆనందం కలిగించింది.

మార్చ్ 29 రానే వచ్చింది. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ శక్తి అవతరించే చరిత్రాత్మకమైన ఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రజలు, ఎన్టీఆర్ అభిమానులు రాష్ట్రం నలుమూలల నుంచి కార్లలో, లారీల్లో, బస్సుల్లో, రైళ్లలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. రామారావు విమానం దిగగానే పూలమాలలతో ముంచెత్తారు. టాపులేని కారులో విమానాశ్రయం నుంచి ఆయన జూబ్లీహిల్స్‌లోని నాదెండ్ల భాస్కరరావు ఇంటికి చేరుకున్నారు. అక్కడ కొత్త పార్టీ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. తర్వాత సిద్ధాంతులు నిర్ణయించిన ముహూర్తానికి (మధ్యాహ్నం 2.30 గంటలకు) న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ప్రాంతీయ పార్టీ సదస్సు నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ 'నేను తెలుగువాడిని, మనది తెలుగుదేశం పార్టీ' అని అప్పటికప్పుడు ప్రకటించగానే వేలాదిమంది అభిమానులు హర్షధ్వానాలతో స్పందించారు. "సమాజమే ఒక దేవాలయం, పేద ప్రజలే నా దేవుళ్లు" అంటూ తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాల్ని చాలా స్పష్టంగా చెప్పారు. ఈ నినాదమే కమ్యూనిస్టులను సైతం ఆశ్చర్యపరిచింది. ఈ నినాదం జనం గుండెల్లోకి సూటిగా వెళ్లింది. ఎన్టీఆర్ సామాజిక శాస్త్రవేత్త అనే పొగడ్తకు ఈ నినాదమే ఆధారమైంది.

అప్పటి మన రాష్ట్ర ముఖ్యమంత్రుల ఆత్మగౌరవ న్యూనతపై చురక వేస్తూ సి.ఎం. అంటే అచ్చ తెలుగులో చెప్పులు మోసేవాడని అర్థం చెప్పుకోవాల్సిన దౌర్భాగ్యం పట్టిందన్నారు. ఇందిరాగాంధీ కొన్ని సందర్భాలలో మనల్ని నిచ్చెన వలె, చీపురుకట్ట వలె, కాళ్ల తుడుపు వలె ఉపయోగించుకుంటున్నారని దీనిని తొలగించాల్సిన అవసరం ఉందని అప్పట్లో నార్ల వెంకటేశ్వరరావు అభిప్రాయపడేవారు. దీంతో తెలుగువారి ఔన్నత్యాన్ని చాటటం కోసం నాడు ఎన్టీఆర్ కేవలం రెండు జతల ఖాకీ దుస్తులతో, వాటినే రోడ్లమీద ఉతుక్కుంటూ ఎక్కడ పడితే అక్కడ స్నానం, భోజనాలు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేశారు. మహాప్రభంజనంలా ప్రజల ముందుకు దూసుకెడుతూ సింహగర్జనలు చేశారు. తెలుగుదేశం 'పిలుస్తోంది రా... కదిలిరా...' అంటూ సొంతంగా రూపొందించుకున్న చైతన్యరథం (వ్యాన్)పై నిలబడి 35వేల కి.మీ. దూరాన్ని పర్యటించారు. నాడు అలా ఎన్టీఆర్ చేసిన శ్రమే నేటికీ పార్టీకి ఊపిరిగా నిలిచింది.

ఇంతటి ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ఈ ఏడాది మార్చ్ 29 నాటికి 25 ఏళ్లు పూర్తి చేసుకుంది. పార్టీ ఆవిర్భవించిన 25 ఏళ్లలో సుమారు 17 సంవత్సరాలపాటు అధికారంలో కొనసాగింది. ఎన్టీఆర్ ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ఎజెండాలోకి తీసుకుంటే, ఆయన తర్వాత పార్టీ పగ్గాలు చేపట్టిన చంద్రబాబునాయుడు ఆంధ్రుల ఆత్మవిశ్వాసాన్ని ప్రతీకగా తీసుకున్నారు. ఎన్టీఆర్ ఒక్క పిలుపుకే కార్యకర్తలు, ప్రజలు వేల సంఖ్యల్లో కదిలి వస్తే చంద్రబాబు అనేక పిలుపులకు గానీ ఆ స్పందన రావడం లేదు. కాంగ్రెస్ మాజీ మంత్రిగా చంద్రబాబు నాయుడు విస్తృత రాజకీయ అనుభవం సాధించి దేశంలోకి దూకడం ప్రధాన మైలురాయి. ఆయన బూత్‌స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు లక్ష కమిటీలతో, లక్షలాది మంది కార్యకర్తలతో తెలుగుదేశం పార్టీని నిండుగా తీర్చి దిద్దినా, ఎన్టీఆర్ తరహాలో ప్రజానాడిని పట్టుకోలేకపోయారు. టిడిపి పగ్గాలను ఆయన అక్రమంగానే తీసుకొని తొమ్మిదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పదవిని అనుభవించినా కార్యకర్తల్లోనూ, ప్రజల్లోనూ ఎన్టీఆర్ చెరిగిపోలేదు. ఇప్పటికీ చంద్రబాబు ఎన్టీఆర్ అల్లుడే. నాటి ఎన్టీఆర్ రాజకీయంలో ప్రజాస్వామ్యం మెండుగా ఉండేది. చుట్టూ సామాజిక స్పృహ కలిగిన మేధావులు ఉండేవారు. అల్లుళ్ల రాజ్యం నడిచినా తర్జనభర్జన జరిగినా బడుగు, బలహీనవర్గాలకు అధిక ప్రాధాన్యత లభించేది. నాడు ఎన్టీఆర్ 1982 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 125 మంది గ్రాడ్యుయేట్‌లను, 38 స్థానాల్లో పోస్టు గ్రాడ్యుయేట్‌లను, 20 స్థానాల్లో డాక్టర్‌లను, 8 స్థానాల్లో ఇంజనీర్‌లను, 47 స్థానాల్లో లాయర్‌లను నిలబెట్టారు. నాడు అభ్యర్థుల సగటు వయస్సు 41 సంవత్సరాలు మాత్రమే. 203 స్థానాల్లో విజయకేతనం ఎగురవేశారు. రాజభవన్‌లో కాకుండా ప్రజావేదిక మీద ప్రమాణస్వీకారం చేసిన మొట్టమొదటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావే. పార్టీ స్థాపించిన 9 నెలల్లోనే అధికారంలోకి రావడం ఒక రికార్డ్. అటువంటి రికార్డ్ చంద్రబాబునాయుడు నెలకొల్పలేకపోయినా అదే తొమ్మిది సంఖ్యను తన అధికారానికి ఉపయోగించుకున్నారు. తొమ్మిదేళ్లు ఏకధాటిగా సి.ఎం.గా కొనసాగి రాష్ట్రంలోని అందరు సి.ఎం.ల కంటే నేనే గ్రేట్ అంటూ ప్రకటించుకున్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కన్న సిఈఓ గా పేరు తెచ్చుకోవడమే ఆయనకు నచ్చింది. ల్యాప్‌టాప్‌లతో రాజ్యమేలి రైతులను నిర్లక్ష్యం చేసిన చంద్రబాబునాయుడు, ఇప్పుడు ఐటి పేరుతో వందల ఎకరాల భూములు ఇస్తారా అని సెజ్‌లకు వ్యతిరేక రాగం పలుకుతున్నారు.

అయితే కాంగ్రెస్ పాలనపై చంద్రబాబు ఎన్ని ఆరోపణలు చేసినా, కాంగ్రెస్‌ను వెంటనే గద్దె దించాలన్న కసి ప్రజల్లో పెరగలేదు. చంద్రబాబునాయుడు ప్రత్యామ్నాయ శక్తిగా కనిపించకపోవడమే కారణం. ఇంకా ఆయన ప్రతిపక్ష నేతగా ఎదగలేదు. అధికార పక్షాన్ని ప్రశ్నిస్తే గతంలో ఆయన చేసిన తప్పిదాలే మరీ ముందుకు వస్తున్నాయి. సంస్కరణల పేరిట చంద్రబాబు కిటికీలు తెరిస్తే కాంగ్రెస్ ఏకంగా తలుపులే తెరుస్తుంది. దీంతో ఇంట్లో ఉన్న వస్తువులన్ని గాలికి

కొట్టుకుపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. చంద్రబాబు తొమ్మిదేళ్ల పాలనలో ఆయనపై వచ్చిన వ్యతిరేకత ఇంకా తగ్గడం లేదు. పార్టీలో గుత్తాధిపత్యాన్ని వహించి ఎన్టీఆర్ కాలం నాటి ప్రజాస్వామ్యాన్ని కూడా కొనసాగించ లేకపోయారు. నలుగురు కూర్చుని చర్చించి నిర్ణయించే వాతావరణం చంద్రబాబు వద్ద లేదు. ఒకే పోల్ తరహాలో అన్నీ ఏకపక్ష నిర్ణయాలే. అధికారంలో ఉన్నంత కాలం ఆర్థిక సంస్కరణలు చేపట్టి, అధికారం పోగానే సంస్కరణల ఫలితాలు పేదలకు చేరాలనే కొత్త వాదాన్ని తీసుకొస్తున్నారు. దానికోసం కమ్యూనిస్టులను కూడా ఆకర్షించే యత్నాలు చేస్తున్నారు. సంస్కరణలు వ్యతిరేకించే కమ్యూనిస్టులు సంస్కరణ ఫలితాలు పేదలకు చేరడం అనే ప్రశ్నను సంధించాల్సి ఉంది. ఆర్థిక సంస్కరణలతో పేదరిక నిర్మూలన చేయాలనే నినాదాన్ని ఎంచుకొని చంద్రబాబు వద్దకు ఇప్పటివరకు ఏ సామాజికవేత్త రాలేదు. ఎందుకంటే చంద్రబాబు సామాజిక శాస్త్రం, ఎన్టీఆర్ సామాజిక శాస్త్రం వేరు వేరు.

నాడు ఎన్టీఆర్ మొదటి మహానాడు తిరుపతిలో జరుపుకున్నట్టుగానే నేడు 25 ఏళ్ల తర్వాత చంద్రబాబునాయుడు కూడా తిరుపతిలో మహానాడు జరుపుకోవాలనుకుంటున్నా, ప్రజాహిత తీర్మానాలు చేస్తారా? నాడు ఎన్టీఆర్ పేదరికం రేఖకు దిగువున ఉన్న లక్షలాది మంది కుటుంబాలకు, కిలో 2 రు. లకే బియ్యం. కుటుంబానికి 20 కేజీల చొప్పున అందజేయాలని, చీరెలు, పంచెలు చౌక ధరలకు లభించేలా తీర్మానాలు తిరుపతి మహానాడులోనే చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ పథకాలేమీ అమలులోలేవు. తొమ్మిదేళ్ల పాలనలో ప్రపంచబ్యాంక్ ప్రభావంతో కమ్యూనిస్టులను, సంక్షేమరంగాన్ని పక్కనపెట్టి, వైట్‌హౌజ్ సాన్నిహిత్యం కోసం చంద్రబాబు తపించారు. మహిళలు కోరుకునే మద్యనిషేధం అమలులో లేదు. మళ్లీ అధికారంలోకి తిరిగి ఎలా రావాలన్నా తపన తప్ప, పార్టీని మరింత సామాజికపరం చేసి, ఎన్టీఆర్ ఆశయాలను నెరవేర్చాలన్న తపన ఆయనలో కొరవడింది. విపక్షంగా ఉన్న చంద్రబాబు మారిన మనిషి అని అనిపించుకోవాలనే యత్నం చేస్తున్నా, ఆ సంకేతాలు జనంలోకి వెళ్లడం లేదు. సంక్షేమ రంగంపై తీవ్రమైన పోరాటాన్ని నెత్తిన ఎత్తుకున్నారు. ఉచిత విద్యుత్ కంటే మెరుగైన పథకాన్ని రైతులకు ఇస్తానని చెబుతున్నా, నాడు రైతుల ఆత్మహత్యలకు నష్టపరిహారం ఇవ్వలేని ఆయనను విశ్వసించేది ఎలా?

ఏడాది క్రితం రాజమండ్రిలో జరిగిన మహానాడులో సీనియర్ నేత టి.దేవేందర్‌గౌడ్ మాట్లాడుతూ అధ్వాన్నమైన కాంగ్రెస్‌ను కూడా ప్రజలు గెలిపించారంటే, టిడిపి పై ఎంత కోపం పెరిగిందో తెలుసుకుని దానిని తగ్గించేందుకు సమీక్షలు చేసుకోవాలని చెబుతే అధినేత దానిని కొట్టిపారేశారు. ఇంకా ఆయన కాంగ్రెస్ తప్పిదాలపై ఆధారపడి రాజకీయాలు చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ లెక్కలతోనే ముందుకు వెళ్లారు. ఎమ్మెల్యేల కోటాలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసే పొరపాట్లతో బయటపడ్డారు. శ్రీకాకుళంలో స్థానిక సంస్థల కోటాలో అధికారికంగా పార్టీ అభ్యర్థి ఉన్నప్పటికీ కాంగ్రెస్ రెబెల్స్‌కు మద్దతు ఇవ్వాలని ఆదేశిస్తే, జిల్లా పార్టీ అధ్యక్షుడు తమ్మినేని సీతారాం మనస్థాపం చెంది రాజీనామా చేయాల్సి వచ్చింది. సొంతంగా పార్టీపై ప్రజలు అభిమానం పెంచుకొనే పరిస్థితులు ఏర్పాటు చేయకుండా కాంగ్రెస్‌పై కోపాన్ని పెంచుతేనే ఓట్లు లభిస్తాయన్న ఆలోచన నుంచి ఆయన దూరం కాలేదు. ఎన్టీఆర్ నక్సలైట్లు దేశభక్తులని చెప్పి ప్రజల్లో నెలకొన్న అభిప్రాయాలను ప్రస్ఫుటం చేస్తే చంద్రబాబు నక్సలైట్లే నరహంతుకులన్న విధంగా వ్యవహరించి ప్రజలకు మరింత దూరమైయ్యారు. కఠిన నిర్ణయాల సమయంలో కూడా ఏకవ్యక్తి స్వామ్యాన్ని ప్రదర్శించిన చంద్రబాబు నక్సలైట్ల దాడిని (అలిపిరి ఘటనను) కూడా ఓట్లు దండుకోవడం కోసం వినియోగించుకొని చతికిలపడ్డారు. ప్రపంచ బ్యాంక్, అమెరికా అధ్యక్ష అదేశాలను పాటించే యత్నమే తప్ప ప్రజల మనోభావాలను పట్టించుకోని చంద్రబాబు, ప్రజల ఛీత్కారానికి గురయ్యారు. ప్రభుత్వ పరిపాలన తీరుతో సమస్యలను ఎదుర్కొన్న ప్రజలకు నక్సలైట్ల వద్ద మొరపెట్టుకునే వెసులుబాటును కూడా లేకుండా చేశారు. అదే ఆయన కొంప ముంచింది. నక్సలైట్ల పిలుపుకు ఓట్లకు దూరంగా ఉండాలనే వారు కూడా చంద్రబాబు వ్యతిరేక ఓట్లు వేసి, తెలుగుదేశం ఉనికికే ప్రమాదం తెచ్చారు.

కాంగ్రెస్ 1989-94లో అధికారంలోకి రావడంతో ఓడిన ఎన్టీఆర్ కూడా 74 స్థానాలు సాధించారు. అదే చంద్రబాబు ప్రతిపక్షంలోకి వచ్చి 47 స్థానాలతో సరిపెట్టుకోవలసి వచ్చింది. అందులో కూడా మూడు స్థానాలు నిలబెట్టుకోలేకపోయారు. నాగేందర్ రాజీనామా చేసి కాంగ్రెస్‌లోకి వెడితే, భంజదేవ్ ఎన్నిక చెల్లనేలేదు. వీరశివారెడ్డి కాంగ్రెస్ శిబిరంలో ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రస్తుతం ఉన్న 44 స్థానాల్లో కూడా ఒక్క ఓటు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకోసం క్రాస్ అయ్యింది. అలా క్రాస్ ఓటు చేసిన కృష్ణబాబు కూడా తన తప్పేం లేదని, తనను తప్పుపట్టడం తప్పని, ఆ తప్పును ఖండిస్తేగానీ అలక వీడనని ఆసుపత్రిలో చేరారు. ఎమ్మెల్యేలపై పట్టు తప్పిన చంద్రబాబు దానిని సవరించుకోకుండా, సమీక్షించుకోకుండా ఇతరులకు రాజకీయ బోధనలను చేయడం దేనికో? పార్టీలో ప్రజాభీష్టాలకు అనుకూలంగా చర్చకు తావు లేకుండా చేసి తెలంగాణ వాదం చేసేవారిపై కత్తి కట్టారు. తెలంగాణ ఉచ్చరించేందుకు ఇష్టపడని చంద్రబాబు తెలంగాణ వాదంపై మొగ్గు చూపుతానన్న విషయం పై టిడిపిలో ఎవ్వరికీ విశ్వాసం లేదు. కాంగ్రెస్ పథకాలకు ప్రత్యామ్నాయంగా కొత్త పథకాలను వెతికి మళ్లీ అధికారంలోకి రావాలన్న కాంక్ష మాత్రమే చంద్రబాబులో ఉంది. అందుకనే తాజాగా దేవేందర్ గౌడ్ నేతృత్వంలో అధ్యయన కమిటీ వేసి, వచ్చే ఎన్నికల్లో ప్రకటించే పథకాలపై ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నారు. పథకాలతో బయటబడే యోచన కన్నా, పాతికేళ్ల ప్రస్థానంలో ఏర్పడ్డ లోటుపాట్లను దిద్దుకుంటూ రాజకీయాలతో సమానంగా, సామాజిక న్యాయాలకు. ప్రజాస్వామ్యానికి పెద్ద పీట వేయకపోతే 2009 ఎన్నికల్లో ఫలితాలతో చేయాల్సింది అంకెల పోరాటమే. అదే జరిగితే 'సమాజమే ఒక దేవాలయం, పేద ప్రజలే నా దేవుళ్లు' అనే ఎన్టీఆర్ సామాజిక బాధ్యత చంద్రబాబులో కొరవడి తెలుగుదేశం సిద్ధాంతమే భూస్థాపితం అవుతుందన్న విమర్శలు వస్తాయి. పార్లమెంటరీ పంథా అనుసరించే వామపక్షాలు చంద్రబాబుతో ఎంత కాలం కలిసి ఉంటాయో చెప్పలేం. ప్రజలు పాల్గొనే ఎన్నికల్లో ప్రజల అవసరాలు అనుగుణంగా ఉండకపోగా డబ్బు సంచుల మధ్య పోటీయే ప్రజాస్వామిక ఎన్నికలుగా చిత్రీకరించే నేటి కాలంలో తెలుగుదేశం ఇరవై అయిదేళ్ల ప్రస్థానం ప్రజలకు ప్రజాస్వామిక వాదులకు నచ్చుతుందో లేదో కానీ, ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయ వ్యవస్థ వచ్చే వరకు ఉన్న పార్టీల్లోనే ఏదో కొంత మార్పును కోరుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిందే. ◆

తెలుగుదేశం పార్టీ ఒక ప్రాంతీయ పార్టీగా ప్రజా ఆకాంక్షలను తీర్చే అవకాశం ఉన్న రాజకీయ శక్తిగా పుట్టుకువచ్చి మొదటిదశలో కొన్ని ప్రజానుకూల కార్యక్రమాలు చేపట్టి రెండోదశలో సంపన్నుల పార్టీగా మారిపోయిందంటున్నారు ఎన్. వేణుగోపాల్

ఇరవై ఐదు సంవత్సరాల తెలుగుదేశం ఉత్థానపతనాలు

అప్పటికి ముప్పై సంవత్సరాలుగా తెలుగు సినిమా రంగంలో తిరుగులేని అభిమాన నాయకుడిగా, దైవపాత్రలు పోషించి దైవసమానుడిగా లక్షలాది అభిమానులను సంపాదించుకున్న నందమూరి తారకరామారావు 1982 మార్చ్ 29న తెలుగుదేశం అనే ప్రాంతీయ రాజకీయ పక్షాన్ని ప్రారంభిస్తున్నానని ప్రకటించినప్పుడు అది ఎక్కువకాలం మనబోయే ప్రతిపాదన కాదని చాలమంది విశ్లేషకులు భావించారు. ఒక సినిమాతార పట్ల ప్రజలలో ఉండే వేలంవెర్రి అభిమానం వేరని, అది రాజకీయ నాయకత్వానికి పనికి రాదని చాలామంది భావించారు. కాని ఆ రాజకీయపక్షం తొమ్మిదినెలల కాలంలోనే, 1983 జనవరి 8న ప్రభుత్వాన్ని స్థాపించగలిగింది. మరొక ఏడాదిన్నర తర్వాత భారీ వెన్నుపోటుకు గురైకూడా ఇతర ప్రతిపక్షాల మద్దతుతో, ప్రజాఉద్యమంతో తన అధికారాన్ని పునరుద్ధరించుకోగలిగింది. ఆ అధికారాన్ని మరొక ఐదు సంవత్సరాల తర్వాత కోల్పోయినప్పటికీ, ఆ మరుసటి ఎన్నికలలో తిరిగి అధికారాన్ని సంపాదించడం మాత్రమే గాక అంతర్గత ఘర్షణలు కూడ తట్టుకుని మరొక రెండు దఫాలు రాజ్యం చేసింది. రెండున్నర దశాబ్దాలు రాష్ట్రాన్ని అప్రతిహతంగా పాలించిన కాంగ్రెస్ పార్టీని శాసనసభలో పదోవంతుస్థానాల స్థితికి నెట్టివేసింది. రాష్ట్రంలోని ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యవస్థలలో పెనుమార్పులను తీసుకువచ్చింది. రాష్ట్రంలోనే గాక దేశ రాజధానిలో కూడ చక్రం తిప్పే స్థాయికి ఎదిగి జాతీయ ఐక్యసంఘటనలలో, కూటములలో ప్రధాన పాత్ర వహించింది.

ఈ క్రమంలో పార్టీ ప్రారంభమైనపుడు ఎన్ టి రామారావుకు సహచరులుగా నిలబడినవారెందరో పార్టీకి దూరమయ్యారు. స్వయంగా స్థాపకుడు రామారావు మీదనే తిరుగుబాటు జరిగి పార్టీ పూర్తిగా మరొకరి చేజిక్కింది. స్థాపకుడి చిత్రపటం పార్టీకి అలంకారప్రాయంగానే మిగిలిపోయింది. ప్రారంభించినప్పుడు ప్రకటించుకున్న ఆదర్శాలకూ పావు శతాబ్దం తర్వాత అధినాయకులు మాట్లాడుతున్న మాటలకూ హస్తిమశకాంతరం ఉంది. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని పునరుద్ధరిస్తామని, ఢిల్లీ అధికారాన్ని కూడ సహించబోమని గర్జిస్తూ ప్రారంభమైన పార్టీ దేశదేశాల సంపన్నులకు, వాషింగ్టన్ అధికారానికి, ప్రపంచబ్యాంక్ ఆదేశాలకు రాష్ట్ర ఆర్థిక, సామాజిక, రాజకీయ వ్యవస్థలను దాసోహం చేసివేసింది. కాంగ్రెస్ పాలనలో కన్న ఎక్కువగా రాష్ట్రాన్ని బానిసత్వంలోకి నెట్టివేసింది. చలనశీలమైన తెలుగుసమాజంలో కొత్త ఆలోచనలు, ప్రశ్నలు తలెత్తడానికి వీలులేనంత నిర్బంధాన్ని ప్రయోగించింది. ప్రపంచీకరణ విధానాలతో, అంతర్జాతీయ బేహారులకు అనుకూలమైన విధానాలతో వేలాదిమంది రైతులు, చేనేత కార్మికులు, విద్యార్థి యువజనుల హత్యలకూ, ఆత్మహత్యలకూ బలి అయిపోయేలా చేసింది.

ఒక కొసన కమ్యూనిస్టు పార్టీలతో మైత్రి నుంచి మరొక కొసన భారతీయ జనతాపార్టీతో పొత్తు దాకా సాగించి రాజకీయ అవకాశవాదానికి చిహ్నంగా నిలిచింది. సామాన్యులే దేవుళ్లు అనే నిర్వచనంతో ప్రారంభమైన పార్టీ అచిరకాలంలోనే ఉన్నవారి పార్టీగా పేరు తేచ్చుకుంది.

ఇప్పుడు ఇరవైఐదు వసంతాల పండుగ జరుపుకుంటున్న తెలుగుదేశం పార్టీ ఆ ఇరవై ఐదు సంవత్సరాలలో పదిహేను సంవత్సరాలు అధికారంలో కొనసాగింది. పది సంవత్సరాలపాటు అధికారానికి బయట ప్రతిపక్షంగా ఉండిపోయింది. ఆ పార్టీ లోపలికి ప్రవేశించిన వాళ్లు ఎంతమందో బయటికి వెళ్లిపోయిన వాళ్లు కూడా అంతమందే ఉన్నారు. ఇతర రాజకీయ పక్షాలమీద, ప్రత్యేకించి దాని బద్ధశత్రువు అయిన కాంగ్రెస్ మీద ఎన్ని ఆరోపణలు, కుంభకోణాలు, విమర్శలు స్వయంగా తానే చేసిందో వాటన్నింటికీ తాను దూరమని, అతీతమని తెలుగుదేశం చూపుకోలేపోయింది. రాజకీయాల్లో చేరి లక్షలు, కోట్లు గడించే అరాచక రాజకీయ శక్తుల అవినీతికి అంతిమగీతం పాడడమే తన ఆదర్శమని చెప్పుకున్న తెలుగుదేశం నాయకుల ఏ ఒక్కరి చరిత్ర చూసినా ఎటువంటి అక్రమార్జన ఎంత పెద్ద ఎత్తున సాగిందో కనబడుతుంది. ఆ ప్రమాణాలతో చూసినప్పుడు కాంగ్రెస్ నాయకులకూ తెలుగుదేశం నాయకులకూ మధ్య స్పష్టమైన విభజన రేఖ ఏమీలేదు.

ఇటువంటి ఒడిదుడుకుల చరిత్ర ఉన్నప్పటికీ తెలుగుదేశం ఒక ప్రధానమైన, ప్రభావశీలమైన రాజకీయ పక్షంగా మనుగడ సాగిస్తూనే

ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ తర్వాత అంతటి స్థాయిలో ఉనికి, ప్రాతినిధ్యం, వనరులు, అంగబలం ఉన్న రాజకీయ పక్షంగా తెలుగుదేశం మొదటి స్థానంలో కాకపోయినా రెండో స్థానంలో ఉంటూనే ఉంది.

ఇరవై ఐదు సంవత్సరాల కాలం ఒక రాజకీయ పక్షపు జీవితంలో తక్కువేమీ కాదు. ఈ సందర్భంగా దాని జీవితంలో గుర్తించదగిన అంశాలేమిటో, వాటిలో ప్రజానుకూలమైనవేమిటో, ప్రజా వ్యతిరేకమైనవేమిటో విశ్లేషించవలసి ఉంది. తెలుగుదేశం పార్టీ కూడ ఒక పాలకవర్గ పార్టీయేనని, దాని ప్రజానుకూల ప్రకటనలేవైనా ఉన్నప్పటికీ అవి ప్రజలను మభ్యపెట్టడానికి చేస్తున్నవేనని విమర్శ ఒక కొసనా, అది కాంగ్రెస్ నిరంకుశత్వం నుంచి తెలుగు ప్రజలను విముక్తి చేయడానికి ఆవిర్భవించిన ఒక ముక్తిదాత అని, దాని పాలకవర్గ, సంపన్నవర్గ అనుకూలతలు ఒక అనివార్యమైన ఒత్తిడి ఫలితమేనని సమర్థనలు మరొక కొసనా ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలనూ ఆచరణనూ మదింపు వేసి ఒక నిర్ధారణకు రావలసి ఉంటుంది. అంత వివరమైన అంచనాకు ఇక్కడ స్థలం సరిపోదుగాని కొన్ని ముఖ్యమైన అంశాలనైనా చర్చించవలసి ఉంది.

మొట్టమొదట తెలుగుదేశం ఉనికిలోకి వచ్చి, తొమ్మిదినెలల కాలంలోనే అధికారానికి రావడానికి దారితీసిన పరిస్థితులేమిటో అర్థం చేసుకుంటే, ప్రజలు దానిమీద ఎందుకు ఆశలు పెట్టుకున్నారో తెలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందునుంచే అటు మద్రాస్ రాష్ట్రంలోని తెలుగు జిల్లాలలోనూ, ఇటు హైదరాబాద్ రాజ్యంలోని తెలుగు జిల్లాలలోనూ ప్రజలలో కాంగ్రెస్ వ్యతిరేకత, కాంగ్రెసేతర రాజకీయ పక్షాల పట్ల ఆదరణ ఎంత బలంగా ఉండిందో గుర్తించడానికి 1952 ఎన్నికల ఫలితాలను చూడవచ్చు. కోస్తాంధ్ర ప్రాంతంలో 1952 ఎన్నికలలో కాంగ్రెస్ 40 స్థానాలు సాధించి రెండవ స్థానంలో ఉండగా కమ్యూనిస్టు పార్టీ 41 స్థానాలతో మొదటిస్థానంలో నిలిచింది. 1955 మధ్యంతర ఎన్నికలనాటికి కాంగ్రెస్ 119 స్థానాలకు ఎగబాకగా, కమ్యూనిస్టు పార్టీ 15 స్థానాలకు దిగజారింది. కాని వచ్చిన వోట్ల శాతం చూసినప్పుడు ఈ తేడా అంతగా కనబడదు. కాంగ్రెస్‌కు 1952లో 29.91 శాతం, 1955లో 38.71 శాతం రాగా, కమ్యూనిస్టు పార్టీకి 1952లో 20.09 శాతం, 1955లో 30.82 శాతం వోట్లు వచ్చాయి. తెలంగాణలో 1952 ఎన్నికలలో కాంగ్రెస్‌కు 44 స్థానాలు, నిషేధం వల్ల ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ పేరుతో పోటీ చేసిన కమ్యూనిస్టులకు 37 స్థానాలు వచ్చాయి. 1957 ఎన్నికల్లో కాంగ్రెస్ బలం 68 కి పెరగగా, కమ్యూనిస్టుల బలం 22 కు తగ్గింది.

ఆ తర్వాత కూడా అన్ని సార్వత్రిక ఎన్నికలలోనూ, కేవలం 1972లో మినహా, మొత్తం పోలయిన ఓట్లలో కాంగ్రెస్ సగం కూడా సాధించుకోలేకపోయింది. కాంగ్రెస్ సంపాదించిన ఓట్లు 1962 ఎన్నికలలో 47.3 శాతం, 1967లో 45.3 శాతం, 1972లో 52 శాతం, 1978లో 39.24 శాతం, 1989లో 48 శాతం, 2004లో మిత్రపక్షాలతో కలిపి 48.64 శాతం, సొంతంగా 38.58 శాతం మాత్రమే. ఈ అంకెల నుంచి గుర్తించవలసిన విషయమేమంటే, 1972లో మినహా మిగిలిన అన్ని ఎన్నికలలోనూ ప్రజల్లో కాంగ్రెసేతర పక్షాలకే ఎక్కువ ఆదరణ దొరికింది. 1973కు ముందు ఈ కాంగ్రెసేతర వోట్లను కైవసం చేసుకునే శక్తి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీకి గాని, విడిపోయిన తర్వాత రెండు కమ్యూనిస్టు పార్టీలకు గాని, భారతీయ జనతా పార్టీకి అప్పటి రూపమైన జనసంఘ్‌కు గాని లేకపోయింది. అందువల్ల ఎన్నికల రాజకీయాలలో 1956 నుంచి 83 వరకూ కూడ ఓట్లలో సాధారణ ఆధిక్యత లేకపోయినప్పటికీ కాంగ్రెస్ అధికారం చేపడుతూ వచ్చింది. అంటే ఒకరకంగా పార్లమెంటరీ రాజకీయ చట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం లేదనిపించేంత ఖాళీ స్థితి ఒకటి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత 27 సంవత్సరాలపాటు కొనసాగింది.

ఎన్ టి రామారావు చేసిన ప్రయత్నమల్లా ఆ ఖాళీని పూరిస్తానని వాగ్దానం చేసి, ఆ కాంగ్రెసేతర వోటు బ్యాంకును రాబట్టుకోగలగడమే. కాంగ్రెస్ వోటు బ్యాంకులో కూడా కొంత భాగాన్ని ఆకర్షించగలగడమే. మిగిలిన కాంగ్రెసేతర రాజకీయ పక్షాలేవీ ఎప్పుడూ సంయుక్తంగా కూడా 200 స్థానాల కన్న ఎక్కువకు పోటీ కూడా చేయని స్థితి ఉండగా తెలుగుదేశం పార్టీ తన తొలి ఎన్నికలలోనే 288 స్థానాలకు పోటీ చేసింది. అందువల్ల కాంగ్రెస్‌కు నిజమైన ప్రత్యామ్నాయం కాగలిగిన సత్తా తనకు ఉన్నదని ఒక విశ్వాసాన్ని అది కలిగించగలిగింది.

సరిగ్గా అదే సమయంలో ఎన్ టి రామారావు ప్రకటించిన ఆత్మగౌరవ నినాదం ప్రజలను, వోటర్లను ఆకర్షించింది. ఢిల్లీ పాలకులు దేశాన్ని సమాఖ్యగా భావించడంలేదని, అన్ని జాతుల ఆకాంక్షలను అణగదొక్కుతున్నారని దేశవ్యాప్తంగానే ఉద్యమాలు పెల్లుబుకుతున్న తరుణంలో, పంజాబ్‌లో ఆనందపూర్ సాహిబ్ తీర్మానం ప్రాతిపదికగా ఒక ప్రాంతీయ ఉద్యమం రూపుదిద్దుకుంటున్న తరుణంలో ఈ తెలుగుజాతి ఆత్మగౌరవ నినాదానికి గౌరవాదరాలు దక్కాయి. ఎమర్జెన్సీ అనంతర కాంగ్రెస్ వ్యతిరేక పవనాలు ఇంకా వీస్తున్న స్థితిలో తెలుగుదేశం ఒక ఆశను కల్పించింది. ఎన్ టి రామారావు వ్యక్తిగత సమ్మోహక శక్తికూడ ఈ కారణాలకు తోడయింది.

కాని అధికారానికి వచ్చిన వెంటనే తెలుగుదేశం ప్రభుత్వం ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో అనుసరించిన విధానాలు నిజంగా ప్రజా సంక్షేమం దిశలో సాగలేదు. తెలుగుదేశం పార్టీ వాస్తవమైన ప్రజా ఆకాంక్షలను నినాదాలుగా వాడుకున్నప్పటికీ, వ్యవసాయరంగంలోనూ, పారిశ్రామికరంగంలోనూ కొత్తగా ఎదిగివస్తున్న ఒక నయాసంపన్న వర్గానికి ప్రతినిధిగానే, వారి ప్రయోజనాలు పరిరక్షించడానికే అధికారంలోకి వచ్చిందని అతిత్వరలోనే అనుమానాలు మొదలయ్యాయి. తెలుగుదేశం అధికారానికి వచ్చిన కొద్ది రోజులలోనే అది అప్పటికే సంపన్నమైన ఒక సామాజిక వర్గానికి సేవచేయనున్నదనే సందేహాలు బహిరంగంగానే వ్యక్తమయ్యాయి.

తెలుగుదేశం పార్టీ ఏ వర్గానికి ప్రయోజనం చేకూరుస్తున్నదనే ఆరోపణలు, అనుమానాలు వచ్చాయో ఆ వర్గంలోని పేదవారికి ఆ పార్టీ చేసిందేమీలేదు. కృష్ణా, గుంటూరు జిల్లాలలో రక్షిత నీటిపారుదల, ఎరువులు, హరిత విప్లవం, క్రిమిసంహారకాలు, మార్కెటింగ్ సౌకర్యాలు

వంటి పరిణామాల ఫలితంగా తలెత్తుతూవచ్చి, ఫైనాన్స్, సినిమా, రియల్ ఎస్టేట్, ట్రాన్స్‌పోర్ట్, విద్యావ్యాపారం వంటి రంగాలలో పెట్టుబడులు పెడుతుండిన ఒక వర్గం రాష్ట్ర అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు ఎన్ టి రామారావును ప్రతినిధిగా ముందుకు తెచ్చింది. ఈ వర్గాన్ని తరచుగా ఒక అగ్రవర్ణంతో సమానం చేయడం కూడా జరుగుతుంది. కాని ఆ అగ్రవర్ణ అభిజాత్యాన్ని పెంచడం మినహా తెలుగుదేశం ప్రభుత్వం మొదటిదశలో వారికి చేసిన ఘనమైన మేలేమీ లేదు. అయితే భౌతిక ప్రయోజనాల కన్న ఈ భావజాల ప్రయోజనాలే పైచేయి సాధించాయి.

ఈ పరిణామం సహజంగానే రాష్ట్రంలో కులతత్వం పెరగడానికి దారితీసింది. రాష్ట్ర రాజకీయాలలో మొదటి నుంచి కుల ప్రభావం ఉంటూనే ఉంది. కాని తెలుగు సమాజ జీవనంలో కులాల మధ్య విద్వేషం, హంతక ఘర్షణలు పెరగడంలో తెలుగుదేశానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాత్ర ఉంది. తెలుగుదేశం పాలనాకాలం మొదటిదశలోనే పదిరికుప్పం, కారంచేడు, నీరుకొండ ఘటనలలో వ్యక్తమయినది అదే. ఈ మూడు ఘటనలలోనూ పదిరికుప్పంలో తెలుగుదేశం నాయకుల మీద, కారంచేడులో ఎన్ టి రామారావు వియ్యంకుడి మీద, నీరుకొండలో తెలుగుదేశం క్యాబినెట్ మంత్రి మీద ఆరోపణలు వచ్చాయి. అప్పటికి మూడు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో అవినీతి, అరాచకత్వం, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం వంటి ప్రజా వ్యతిరేక పద్ధతులతో విసిగిపోయిన ప్రజలు మార్పును ఆశించి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తెస్తే, రెండు మూడు సంవత్సరాలు నిండకుండానే అవే పాలనాపద్ధతులు తెలుగుదేశం అధికారంలో కూడా కనబడ్డాయి.

ఈ లోగా పతనమవుతున్న తెలుగుదేశం ప్రతిష్ఠకు గవర్నర్ రాంలాల్ చేసిన పని తిరిగి ప్రాణం పోసినట్టయింది. నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటుకు, రాంలాల్ అక్రమానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రజాస్వామిక పరిరక్షణ ఉద్యమం సాగింది. నందిహిల్స్ శిబిరంలో శాసనసభ్యులను నిర్బంధించి మద్దతు సంపాదించడం ద్వారా అయినప్పటికీ ఎన్ టి రామారావు విజయం సాధించారు. శాసనసభను రద్దు చేసి మధ్యంతర ఎన్నికలకు వెళ్లి, ఆ ఎన్నికలలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో పాటు, భారతీయ జనతాపార్టీతో కూడ ఎన్నికల పొత్తులు, సర్దుబాట్లు పెట్టుకున్నారు. ఒక రకంగా కాంగ్రెసేతర పక్షాలన్నీ ఏకమై కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించిన సందర్భం అది.

తిరిగి అధికారానికి వచ్చిన తరువాత తెలుగుదేశం ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు మరింతగా పెచ్చరిల్లాయి. దాని ఫలితంగా 1989 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ పరాజయం పాలయింది. తొమ్మిది నెలల్లో అధికారానికి వచ్చి రికార్డ్ సృష్టించినట్టుగానే ఆరు సంవత్సరాల పాలనతోనే ప్రజా ఆగ్రహాన్ని కూడా చవిచూడవలసి వచ్చింది. అయితే ఆ ఎన్నికలలో ప్రజల తీర్పు కాంగ్రెస్ మీది ప్రేమతో కాదని, అది పాజిటివ్ వోట్ కాదని, తెలుగుదేశం మీద అసంతృప్తితో పడిన నెగెటివ్ వోట్ మాత్రమేనని సాగిన విశ్లేషణలు వాస్తవమని ఆ తర్వాతి 1994 ఎన్నికలు నిరూపించాయి. నిజానికి అధికారంలో ఉన్నవారిపట్ల నెగెటివ్ వోట్ అనే సంప్రదాయం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో 1983లోనే ప్రారంభమైంది. అదే 1994 ఎన్నికలలో తెలుగుదేశానికి అనుకూలంగా మారింది.

ఒకవైపు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో పాటు ప్రతిపక్షంగా తెలుగుదేశం మాట్లాడిన మాటలు, చేసిన వాగ్దానాలు కూడ తెలుగుదేశం పట్ల ఆదరణను కలిగించాయి. ముఖ్యంగా రు. 2 కిలో బియ్యం పథకం, సంపూర్ణ మద్యనిషేధం వంటి ప్రజా సంక్షేమ వాగ్దానాలు తెలుగుదేశం పట్ల ప్రజల్లో భ్రమలను పెంచాయి. అధికారంలోకి రాగానే ఎన్ టి రామారావు నాయకత్వంలోని తెలుగుదేశం ఆ వాగ్దానాలను ఏదో ఒక మేరకు అమలులో పెట్టడానికి కూడా ప్రయత్నించింది. కాని అప్పటికే దేశంలో కొనసాగుతున్న నూతన ఆర్థిక విధానాలు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రయోగశాలగా ఎంచుకున్న ప్రపంచబ్యాంక్ విధానాలు ఈ ప్రజాసంక్షేమ విధానాలను వ్యతిరేకించాయి. ప్రజాసంక్షేమ విధానాలను అమలు చేయకుండా తెలుగుదేశం ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడం ప్రారంభించాయి. తెలుగుదేశం పార్టీ ముందర తెలుగుజాతి ఆత్మాభిమానాన్ని నిలబెట్టుకొని తెలుగు సమాజ హితం కొరకు అతిస్వల్ప స్థాయిలోనైనా ఉపయోగపడగల సంక్షేమపథకాలను కొనసాగించడమా, ప్రపంచబ్యాంకుకు దాసోహం అని, బహుళజాతి సంస్థలకు తెలుగు ప్రజల భవిష్యత్తును తాకట్టుపెట్టి, ప్రతిఫలంగా ముడుపులు సంపాదించడమా అనే సవాలు నిలిచింది.

బహుశా తన వయసు వల్ల, అప్పటికే ఉన్న ప్రజా జీవితం వల్ల, సామాజిక పునాది వల్ల, వ్యక్తిగతంగా ఉండిన మొండితనం వల్ల రామారావు ఈ సవాలుకు మొదటి జవాబు చెప్పదలచినట్టున్నారు. ఆ జవాబు ప్రపంచబ్యాంకుకు, ప్రపంచీకరణ శక్తులకు నచ్చలేదు. అందువల్లనే రామారావుకు ప్రత్యామ్నాయంగా ప్రజాజీవితం, సామాజిక పునాది పెద్దగా లేని, చెప్పినట్టుగా వినే ఒక యువరాజకీయ నేతకోసం ప్రపంచీకరణ శక్తులు వెతికాయి. అప్పటికే పది పన్నెండు సంవత్సరాలుగా తమకు అందుబాటులో ఉన్న చంద్రబాబునాయుడు తగిన వ్యక్తిగా ఎంచుకున్నాయి. రామారావు మొండితనాన్ని మూర్ఖత్వంగా చూపి వ్యతిరేకత కూడగట్టడం ద్వారా, లక్ష్మీపార్వతి పాత్రను సాకుగా చూపి తెలుగుదేశం శాసనసభ్యులలో పితృస్వామ్య భావాలను రెచ్చగొట్టడం ద్వారా, విచ్చలవిడి డబ్బుల పంపిణీ ద్వారా తెలుగుదేశం పార్టీ నాయకత్వాన్నే మార్చివేయడం జరిగింది.

ఈ నాయకత్వం మార్పుతో తెలుగుదేశం పార్టీ జెండా మారకుండానే దిక్కు మారిపోయింది. నినాదాలు మారకుండానే విధానాలు మారిపోయాయి. కనబడకుండానే పార్టీని శాసించే ప్రయోజనాలు, శక్తులు మారిపోయాయి. పునాదిగా నిలిచిన సామాజిక వర్గాలలో గతంలో ప్రాబల్యంలో ఉండిన ఒకటి రెండు అగ్రవర్ణాలు, కొన్ని వెనుకబడిన కులాలు యదాతథంగా ఉంటూనే, వారిలో కూడా నయాసంపన్నులదే పైచేయి అయింది. ఆర్థికంగా చూసినప్పుడు తెలుగునేలలో వేళ్లున్న నయా సంపన్నులతో పాటు విదేశాలలో స్థిరపడిన నయా సంపన్నులు, దేశదేశాల బడా సంపన్నులు జమిలిగా పార్టీని నిర్దేశించే స్థితి వచ్చింది. మొత్తంగా పార్టీ అధికారంలో ఉన్న తొమ్మిదిన్నర సంవత్సరాలలో అక్రమంగా వందల కోట్లు కూడబెట్టుకున్న రాజకీయ నాయకుల, కాంట్రాక్టర్ల, వ్యాపారుల, పైరవీకారుల, మధ్యవర్తుల వర్గం ప్రాచుర్యంలోకి వచ్చింది. డబ్బు, సాంకేతిక విధానాల సహాయంతోనే రాజకీయాలు నడపవచ్చుననే, ప్రజలు అవసరంలేదనే ఒక దురభిప్రాయం పార్టీ అగ్రనాయకత్వంలో ప్రబలింది. ఒకవైపు తెలంగాణ ఆకాంక్షలు,

మరొకవైపు నూతన ఆర్థిక విధానాలవల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఆక్రోశాలు మిన్నంటుతుంటే పార్టీకి అవన్నీ వినబడనేలేదు. రాజకీయంగా చూసినపుడు కొత్త రక్తం పార్టీలోకి రావడం ఆగిపోయింది. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యానికి, కొత్త ఆలోచనలకు, అధినేతకు భిన్నమైన ఆలోచనలకు స్థానం లేకుండాపోయింది. ఈ విధంగా ప్రజలకు దూరమైన ఆలోచనలలో, ఆచరణలో ఉన్నందుకు, కొనసాగినందుకు తెలుగుదేశం 2004 ఎన్నికలలో భారీ మూల్యమే చెల్లించవలసి వచ్చింది.

ఎన్ టి రామారావు హయాం నుంచి చంద్రబాబు హయాం మారిన సందర్భంలో తెలుగుదేశం పార్టీకి ఉండిన ప్రాధాన్యతలు, ప్రజాసమీకరణలు, ఇతర పార్టీలతో సంబంధాలు, అట్టడుగు ప్రజా ఆకాంక్షలకు అగ్రనాయకత్వపు ఆలోచనలకు మధ్య సంబంధాలు ఏ విధంగా మారాయో వివరంగా పరిశీలిస్తే మన రాజకీయ పక్షాల మారుతున్న ధోరణులకు సజీవ నిదర్శనం కనబడుతుంది. తెలుగుదేశం పార్టీకి 1995కు ముందు ఏదో గాఢమైన తాత్విక దృక్పథం ఉందని, ఆ తర్వాత అది మారిపోయిందని కాదు. కాని ఒక రాజకీయ పక్షంగా ఏయే ప్రయోజనాలను సమన్వయం చేసుకుంటూ, ప్రజలకు ఏ వాగ్దానాలు ఇస్తూ అందులో కొన్నైనా నెరవేరుస్తూ సాగవలసి ఉంటుందో ఆ క్రమాన్ని పార్టీ 1995 తర్వాత మరిచిపోయింది. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యాక ప్రజలు ఆధారపడే వ్యవసాయ రంగాన్ని, నీటి పారుదల రంగాన్ని, మొత్తంగా గ్రామీణ వ్యవస్థను నిర్లక్ష్యం చేయడం ఒక ఎత్తయితే, పిడికెడు మందికి సంపద చేకూర్చి పెట్టే, అవకాశాలు కలిగించే సేవా రంగాన్ని, బహుళజాతి సంస్థల లాభాలు పెంచే ఐటి, బిటి వంటి రంగాలను ఇతోధికంగా ప్రోత్సహించడం మరొక ఎత్తు. వ్యవసాయాన్ని చిన్నచూపు చూసినప్పటికీ గ్రామీణ జీవనం నుంచి నిరుద్యోగంలోకి నెట్టబడుతున్న లక్షలాది మందికి ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలను ప్రోత్సహించడమైనా జరగవలసింది. కాని 1995 నుంచి 2004 వరకు ఎక్కువ ఉపాధి కల్పించే కొత్త పారిశ్రామికీకరణ జరగలేదు సరికదా అప్పటికీ బాగా పనిచేస్తున్న ఎన్నో పరిశ్రమలు ప్రభుత్వ విధానాల వల్లనే మూతపడిపోయాయి.

అటు రైతాంగాన్ని ఇటు కార్మిక వర్గాన్ని ఈ విధంగా తెలుగుదేశ ప్రభుత్వ విధానాలే అతలాకుతలం చేస్తుండగా, విద్యార్థులు, యువజనులు, మహిళలు, వెనుకబడిన కులాలు, మైనారిటీలు, ఆదివాసులు వంటి ప్రతి ఒక్క ప్రజా సమూహం కూడా తెలుగుదేశం విధానాల వల్ల ఇబ్బందుల పాలుకావడం మొదలయింది. విద్య ప్రైవేటీకరణ అధికారిక విధానమయింది. విద్యా రంగానికి కేటాయింపులు తగ్గిపోయాయి. యువజనులలో నిరుద్యోగం విస్తృతంగా ప్రబలిపోయింది. ప్రతి ఏటా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిలలో నమోదు చేసుకున్న నిరుద్యోగుల సంఖ్య మూడు లక్షలు ఉండగా ఉద్యోగ కల్పన పదివేలకు మించలేదు. ప్రభుత్వ విధానాల వల్ల పెరిగిన వినియోగదారీ సంస్కృతి మహిళల మీద హింసకు, వరకట్నాల చావులకు దారి తీసింది. ఒకప్పుడు కాంగ్రెస్ చూపిన నిరాదరణకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీయే తమ లాభం చేకూరుస్తుందని భావించిన వెనుకబడిన కులాల ఆశలు వమ్మైపోయాయి. ఆదివాసుల భూ పరాయికరణకు వ్యతిరేకంగా ఉండిన చట్టాలను మార్చి ఆదివాసుల పొట్ట కొట్టడానికి తెలుగుదేశం ప్రయత్నించింది. భారతీయ జనతా పార్టీ తో కుమ్మక్కు కావడం ద్వారా ముస్లిం మైనారిటీల పట్ల తనకు లౌకిక దృక్పథం లేదని చాటుకుంది.

ఈ లోపాల గురించి విమర్శలు వస్తున్నప్పటికీ, కింది స్థాయి నాయకులు ఈ సమస్యలను గుర్తించి పార్టీని సరిదిద్దాలని ఆశించినప్పటికీ క్రమక్రమంగా పార్టీ 'ఒకే ఒక్కడి' పార్టీగా మారి అంతర్గత ప్రజాస్వామ్యం కరువైపోయింది.

తెలుగుదేశం చరిత్రను నిశితంగా పరిశీలిస్తే మొదటిసగం ఒకరకంగానూ, రెండోసగం మరొకరకంగానూ కనిపిస్తుంది. మొదటి సగంలో ఏదో ఒక మేరకు ప్రజాకర్షక నినాదాలు ఇవ్వడం మాత్రమే కాక వాటి అమలు కొరకు కూడా ప్రయత్నించి కొన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం, పాత సామాజిక ఆర్థిక రాజకీయ వ్యవస్థలను బద్దలుకొట్టడానికి ప్రయత్నించడం (సామాజిక రంగంలో వెనుకబడిన కులాలకు అధిక ప్రాధాన్యం, ఆర్థిక రంగంలో నయా సంపన్న వర్గాల ప్రాబల్యం, రాజకీయ రంగంలో యువకులకు, విద్యాధికులకు, మొదటితరం రాజకీయ నాయకులకు అవకాశం), భాష, సంస్కృతి, విలువల విషయంలో ఆదర్శాలు ప్రకటించడం కనబడతాయి. కాని రెండోసగంలో ప్రజాకర్షక నినాదాలు కేవలం కాగితాలకు, ఉపన్యాసాలకు పరిమితమైపోయి, ప్రపంచబ్యాంకు, బహుళజాతి సంస్థలు, దేశదేశాల సంపన్నులు, పైరవీకారులకొరకే ప్రభుత్వం ఉన్నదనే స్థితిని తెలుగుదేశం తీసుకొనివచ్చింది. మొదటిదశలోని కాంగ్రెస్ వ్యతిరేకత నీరుకారిపోయి, కాంగ్రెస్ ప్రారంభించిన నూతన ఆర్థిక విధానాలను కాంగ్రెస్ కన్న ఎక్కువ విధేయంగా అమలు చేయడానికి తెలుగుదేశం కంకణం కట్టుకుంది. తొలిదశలో వతన్‌దారీ వ్యవస్థ రద్దు వంటి అవసరమైన విధ్వంసాలు చేసిన తెలుగుదేశం రెండో దశలో ప్రత్యామ్నాయ నిర్మాణాలు చేసే బదులు ప్రపంచబ్యాంక్ నిర్దేశించిన మేరకు గ్రామీణ నయాసంపన్నుల నిర్మాణాలు ప్రారంభించింది. ఆ నిర్మాణాలు ప్రజాస్వామికంగా తయారుకాలేదు సరిగదా, బహుళజాతిసంస్థల సరుకుల కొనుగోలుదార్లుగా, అమ్మకందార్లుగా మారిపోయాయి. మొదటిరోజుల్లో కొత్త తరాన్ని, విద్యాధికులను, ఆదర్శవంతులను ఆకర్షించిన తెలుగుదేశం రెండో దశలో పైరవీకార్లకు, బహుళజాతిసంస్థలతో బేరాలుకుదిర్చి పెట్టగలవాళ్లకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు పెద్దపీట వేసి నిజంగా ప్రజాపునాది ఉన్న అట్టడుగస్థాయి నాయకులను విస్మరించడం ప్రారంభించింది.

ఈ విధంగా పావుశతాబ్దంకింద ఎన్నికల రాజకీయాల పరిమితులలోపలనే అయినా, కాంగ్రెస్ వ్యతిరేక శక్తుల వేదికగా, నిజమైన సమాఖ్య ఆలోచనలను పెంపొందించే రాజకీయపక్షంగా, ప్రజానుకూల, ప్రజా సంక్షేమ విధానాలను అమలుచేసే సత్తా ఉన్న పార్టీగా ఆవిర్భవించిన తెలుగుదేశం, ఇరవై ఐదు సంవత్సరాలలోపల తన చరిత్రకు తానే తూట్లు పొడుచుకుని అనేక అవినీతికర రాజకీయపక్షాలలో ఒకానొకటిగా మిగిలిపోయింది. ఈ స్థితిలో దాని పునరుత్థానం కాంగ్రెస్‌కు మరో ప్రత్యామ్నాయం లేనందువల్ల జరగవలసిందే తప్ప దానిలోని జీవశక్తి వల్లకాదు. ◆

గ్రామీణ ఉపాధి పథకాలు, పనికి ఆహార పథకాలు, మహిళా స్వయం సహాయక బృందాలు, ఇందిరమ్మ ఇళ్లు వంటి గృహ పథకాలు పట్టణాలకు దగ్గరలో ఉన్న గ్రామాలకే అదీ అరకొరగా అందుతున్నాయి తప్ప నిజంగా పేదలకు ఒరుగుతున్నదేమీ లేదంటున్నారు బి. రమాదేవి

ప్రపంచీకరణ - గ్రామీణ స్త్రీల సమస్యలు

భారతదేశం ప్రధానంగా వ్యవసాయ దేశం. దాదాపు 70 శాతం ప్రజలు నేటికీ గ్రామాల్లోనే నివసిస్తున్నారు. ఒక పక్క కంప్యూటర్ యుగంగా, ఆధునిక యుగంగా, శాస్త్రసాంకేతిక రంగాలలో ముందుకు దూసుకెళ్తూ, అభివృద్ధి పథంలో పయనిస్తున్నట్లుగా ప్రకటింపబడ్తున్న దేశమిది. కానీ ప్రభుత్వం కల్పించే రాయితీలు, ఉపాధి పథకాలు, చిన్న చిన్న అవకాశాలు కూడా పల్లెలకు చేరని దుస్థితి. పల్లెల్లోని వ్యవసాయ భూములు, నీరు, విద్యుత్తు లేక, వృత్తులు లేక జీవనోపాధి కోల్పోయి, కుటుంబాలకు కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకుంటున్న దుర్భర పరిస్థితులు మన దేశంలో కోకొల్లలు. గ్రామీణ ఉపాధి పథకాలు, పనికి ఆహార పథకాలు, మహిళా స్వయం సహాయక బృందాలు, ఇందిరమ్మ ఇళ్లు వంటి గృహ పథకాలు పట్టణాలకు దగ్గరలో ఉన్న గ్రామాలకే అరకొరగా అందుతున్నాయి. మారుమూల ప్రాంతాలకు కనీసం వాటి గూర్చి అవగాహన కానీ, అవి తమకే ఏర్పాటు చేసినవి అని తెలుసుకునే అవకాశాలు, అక్షరాస్యతలేని దుస్థితిలో గ్రామీణ ప్రజానీకం ఉంది. అందునా మహిళలు మరింత వెనుకబాటున ఉన్నారంటే మన 60 ఏళ్ల స్వరాజ్యం సాధించిన అభివృద్ధి ఫలాలకు ప్రతిఫలంగా గ్రామీణ భారతం కరువు కాటకాలతో అల్లల్లాడుతోంది. రైతుల ఆత్మహత్యలు, ఆకలిచావులతో, చేనేత కార్మికుల ఆత్మహత్యలతో, వలసలతో, ఆడబిడ్డని తెలియగానే భ్రూణ హత్యలతో, పసిపిల్లల (ఆడపిల్లల) అమ్మకంలోనూ, హత్యలతోనూ కూనరిల్లుతుంది. ప్రపంచం కుగ్రామం అయిందనీ, ఆర్థిక సంస్కరణల ప్రభావం వల్ల గ్లోబల్ నెట్‌వర్క్ మారుమూల పల్లెల వరకు చేరిందని, ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందని, గ్రామీణ మహిళలలో సాధికారత, విద్యాభివృద్ధి, పాలనలో భాగస్వామ్యం పెరిగిందని, ప్రభుత్వాలు ప్రచారాలు చేసుకుంటున్న క్రమంలో ఈ ఆత్మహత్యల పరంపర ఎందుకు జరుగుతున్నాయనేది ఆలోచించాలి.

బ్రిటిష్ వారి రాకతో మనదేశంలో స్వయం సమృద్ధ గ్రామీణ వ్యవస్థ విచ్ఛిన్నమైంది. 1947 స్వాతంత్ర్యానంతరం మన దేశం మొదటి దశలో సోషలిస్టు ఆర్థిక విధానాలపట్ల మొగ్గుచూపినట్లు కనిపించింది. క్రమంగా ప్రపంచబ్యాంక్, అమెరికన్ సామ్రాజ్యవాద అప్పుల్లో చిక్కుకొని, అభివృద్ధి అంటే తారురోడ్లు, రింగ్‌రోడ్లు, ఫ్యాబ్‌సిటీ, హైటెక్ సిటీలు, కంప్యూటరైజేషన్, ఇంగ్లీష్ చదువులు, విదేశీ కంపెనీల పెట్టుబడుల కొరకు తివాచీలు పరచడంగా మారిపోయింది. పేదల నోళ్లు కొట్టి వేలాది ఎకరాల భూములను కారుచౌకగా అందించడంగా మారింది. గ్రామీణ వ్యవస్థ చిన్నాభిన్నం కావటానికి మన ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలే కారణం.

ఇంగ్లీష్ చదువులు, మల్టీనేషనల్ కంపెనీలలో వేలాది రూపాయలలో ఉద్యోగాలు, రెవెన్యూ, ల్యాండ్ సెటిల్‌మెంట్లతో దేశ పునాదులు కదిలించబడుతూ వలసవాదుల అవసరాలకనుగుణంగా మార్చబడుతున్నాయి. నూతన ఆర్థిక విధానాల బిగి కౌగిలిలోకి గ్రామీణ జీవితం మనకు తెలియకుండానే వెళ్లిపోయింది. గ్రామీణ వృత్తులు దెబ్బతిన్నాయి.

రైతుల ఆత్మహత్యలు - స్త్రీలపై వాటి ప్రభావం

వ్యవసాయం ప్రధాన ఆధారంగా ఉన్న రైతులు వ్యవసాయానికి సరిపడే నీరు, విద్యుత్తు లేక, బోర్ల తవ్వకంలో అప్పులపాలవుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, పెట్టుబడులు పెరిగిపోయి కష్టాల పాలవుతున్నారు. వేలాది రూపాయల ఎరువులు గుప్పించినా, బోల్‌గార్డ్ వంటి నకిలి విత్తనాలతో, నకిలీ పురుగు మందులతో పత్తి, మిరప వంటి వ్యాపార పంటలు వేసి అన్ని విధాల దగాపడి, అప్పుల వలలో విలవిలలాడుతున్నారు. దళారీ వ్యాపారుల కబంధ హస్తాలలో కూరుకుపోయారు. దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. 1998 నుండి 2006 మార్చ్ వరకు దాదాపు 4500 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ రైతుల ఆత్మహత్యలవల్ల, ఆయా కుటుంబాలలోని మహిళల పరిస్థితి దయనీయంగా తయారైంది. అప్పుల వాళ్ల ఒత్తిళ్లు, కుటుంబ భారం, పిల్లల ఆలనాపాలనా చూడలేక స్త్రీలు తమ కిడ్నీలను, రక్తాన్ని, కన్నపిల్లలను కూడా అమ్ముకుంటున్నారు.

రైతు కూలి స్త్రీలు బొంబాయి, పూణే, హైదరాబాద్ లాంటి పట్టణాలకు చాటుగా వెళ్లి పడుపు వృత్తి కొనసాగించి, కుటుంబాలను

పోషిస్తున్నారు. పట్టణాలకు, రహదారులకు దగ్గరగా ఉన్న మహిళలు, పేద స్త్రీలు వ్యభిచారిణిలుగా మారిపోతూ, ఎయిడ్స్ లాంటి ప్రాణాంతక వ్యాధులకు గురవుతున్నారు. మరొక వైపు పనుల కోసం కాంట్రాక్టర్ల వలలో వేశ్యా గృహాలకు అమ్మబడుతున్నారు. పసి పిల్లలను, వృద్ధులను వదిలి వేర్వేరు రాష్ట్రాలకు ఉపాధి కొరకు వెళ్లి తల్లిబిడ్డలు కంటి చూపుకు కూడా నోచుకోని స్థితి. వృద్ధులు, పసిపిల్లలు పోషకాహారం లేక శుభ్రమైన మంచినీరు దొరకక, అంటు వ్యాధుల బారినపడి చనిపోయినా కడసారి చూపుకు కూడా నోచుకోని దుర్భర పరిస్థితులు స్త్రీలను ఎంతో నిస్సహాయతలోకి నెట్టివేస్తున్నాయి. అనాధ శవాలుగా మిగిలిపోతున్నారు. గ్రామాల్లో వదిలివెళ్లిన 10, 12 సంవత్సరాల ఆడపిల్లలు అత్యాచారాలకు గురవుతున్నారు. సమస్త మానవసంబంధాలు దెబ్బతిని, సామాజిక జీవనంలో వ్యవసాయ కూలీల జీవితాలు ధ్వంసమైపోతున్నాయి. అంతేగాక ఆర్థిక సమస్యవల్ల పరిమిత కుటుంబాలుగా మారడమేగాక, తల్లిదండ్రులు, అత్తమామలను, అన్నదమ్ముల, అక్కచెల్లెళ్లను భరించలేని స్థితి వచ్చి శత్రుపూరిత సంబంధాలుగా మారటం, ఇవన్నీ భరించలేక సామూహిక ఆత్మహత్యలకు పాల్పడడం జరుగుతున్నది.

ఎటూ దిక్కుతోచని గ్రామీణ స్త్రీలు గంజాయి, నాటుసారా అమ్ముతూ అరెస్టై, జైళ్లలో ఉంటున్నారు. ఏ దురలవాట్లవల్ల సంపాదించిన కాస్త డబ్బు మగవాళ్లు కుటుంబావసరాలు తీర్చకుండా కుటుంబాల నాశనానికి కారణమవుతున్నాయో తెలిసినా, అదే సారా కాచి కొందరు ఆడవాళ్లు జీవనోపాధిని వెతుక్కుంటున్నారు. అంతేకాక కుటుంబ పోషణ వ్యవసాయ పనులులాంటివి, గ్రామీణ, దళిత, గిరిజన కుటుంబాల్లో 1995లో జరిపిన సర్వే ప్రకారం ఉత్పాదక రంగాలలో, వ్యవసాయ రంగంలో 60 శాతం పని స్త్రీలే చేస్తున్నారు.

దాదాపుగా 14 గంటలపైనే ఇంటి పనులు, పొలం పనులు చేసే స్త్రీలకు ఉత్పత్తి సాధానాలైన స్వంతభూమి, అందునా దళిత, గిరిజన మహిళలకు అసలే లేదు. మధ్యతరగతి రైతాంగ కుటుంబాలలో 2 శాతం కూడా మహిళల పేరున భూమి లేదు. పేద మహిళలు ఉన్న కొద్దిపాటి ఆహారంతో కుటుంబానికి అంతటికి సర్ది, చివరగా మిగిలితే కొద్దిపాటి ఆహారం తింటున్నారు. ఇంతటి దీనస్థితిలో తినటానికి తిండి సరిగాలేని మహిళలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ఇక వీరికి పౌష్టికాహారం కలలోని మాట. గర్భిణిగా ఉన్న స్త్రీలు సరైన ఆహారం లేక, రక్తహీనతతో బాధపడుతూ, పుట్టిన పిల్లలు కూడా అనారోగ్యాల బారినపడుతూ, పోషకాహార లోపం వల్ల చనిపోతున్నారు. ప్రసవ సమయంలో కూడా ప్రతి రోజు 36 మంది మహిళలు చనిపోతున్నారు. సరైన వైద్యం అందుబాటులో లేక నాటు వైద్యుల మీద, మంత్రతంత్రాలు, తాయెత్తుల వంటి మూఢ నమ్మకాల బారిన పడుతున్నారు. ఈ మూఢనమ్మకాలకు బలయ్యేది దళిత, గిరిజన మహిళలే ఎక్కువ. అదే విధంగా మంత్రగాళ్లుగా మోసం చేస్తూ, దొరికిపోయినప్పుడు అవమానాల పాలయ్యేది మాతంగి, జోగినీ, బసవినీ పేరుతో పూజలందుకుంటూ, వారికేమైనా అనర్థం జరిగితే పై మంత్రగాళ్లే కారణమని భావించే ప్రజలు సజీవదహనం చేయడం, పళ్లూడగొట్టడం, మలమూత్రాలు తాగించడం, గ్రామబహిష్కరణ వంటి దారుణ దాడులకు పూనుకుంటున్నారు. దీనికి తోడు నిరక్షరాస్యత, బాలికా విద్యపట్ల నిర్లక్ష్యం, సామాజిక వెనుకబాటుతనం, కుల వివక్షతలు, బాల్య వివాహాలు, అధిక సంతానాన్ని కనటం, వీటి వల్ల మహిళలకు ప్రధానంగా వచ్చే గర్భకోశ వ్యాధులు, కుటుంబభారం మోయడంలో భాగంగా వచ్చే ఎయిడ్స్ లాంటి ప్రాణాంతక వ్యాధులు బారినపడుతూ ఉన్నారు. ఈ క్రమంలోకి సాంప్రదాయపు విలువలు కూడా దాటుతూ ఉన్నారు. కొద్దిగా ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉన్న కుటుంబాలు కూడా గ్లోబలైజేషన్ నేపథ్యంలో ఆర్థిక సరళీకరణ వల్ల, వస్తు వినిమయ సంస్కృతి పెరిగి వస్తూ వ్యామోహం, ఖరీదైన జీవితం గడపాలనే కోరికలను పెంచుకునేలా మన ఇంట్లోకి ప్రవేశించిన కేబుల్ టివిలో వచ్చే వ్యాపార ప్రకటనల వల్ల, భోగలాలసత్వాన్ని పెంచి పోషిస్తున్నాయి.

మీడియా ప్రభావం ఇవాళ పట్టణాల మహిళలతో పాటు, గ్రామీణ మహిళలపై కూడా అనేక దుష్ఫలితాలు కలిగిస్తోంది. టెలివిజన్ ఛానళ్లలో వస్తున్న పాశ్చాత్య ధోరణులు, సెక్స్, క్రైమ్, ఆయాచితంగా డబ్బు సంపాదించే మార్గాలకై వెంపర్లాడేలా చేసే ప్రకటనలు, మూఢ నమ్మకాలను పెంచి పోషించే సీరియల్స్, స్త్రీ పట్ల దుర్మార్గమైన కుట్ర పూరితమైన సాంస్కృతిక దాడి చేస్తున్నాయి. స్త్రీలను హీనంగా, అవమానకరంగా, లైంగిక దృష్టి, ప్రేమ పేరుతో వంచన వంటి కుహన సంస్కృతులు ప్రవేశించి మానవవిలువలను, నైతిక విలువలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ విషయంలో పల్లెలను, పట్టణాలను ఏకం చేస్తున్నాయి.

దీనివల్ల శ్రమైక జీవనం విధ్వంసం కావడమే కాక, శ్రమపట్ల గౌరవం తగ్గిపోయి కష్టపడే తత్వానికి కూడా దూరమవుతూ ఏ అవసరాలు తీర్చుకోవడానికైనా వేశ్యావృత్తిని చేపట్టడానికి కూడా వెనకాడని స్థితికి గ్రామీణ మహిళలు కూడా చేరుకున్నారు. మన దేశ జనాభాలో మూడవ వంతు గ్రామీణ స్త్రీలు ఇంతటి దయనీయమైన స్థితిలో బతుకులీడ్చుచుండగా, ఈ పరిస్థితి ఆసరాగా తీసుకొని స్వచ్ఛంద సంస్థల పేరుతో విదేశీ డబ్బులతో కొన్ని సంస్కరణలు చేపట్టి, వారి జీవితాల్లో కొంత మార్పును, వెసులుబాటును తీసుకొచ్చినట్లు చేస్తూ, మత ప్రచారానికి, మత మార్పిడులకు ప్రయత్నిస్తూ ఉన్నారు.

పై విషయాలన్నింటినీ పరిశీలించినపుడు మనకు అర్థమవుతున్నదేమిటంటే సమాజంలో ఏ మార్పు వచ్చినా, వాటి దుష్ప్రభావాలన్నీ స్త్రీల జీవితాలను ప్రభావితం చేస్తాయి. ఆర్థిక సంస్కరణలు, ప్రపంచీకరణల ప్రభావం గ్రామీణ స్త్రీల పై ఎంతటి ప్రభావాన్ని చూపిస్తాయో రాస్తూ ప్రొ. రమామేల్కోటే, ఆర్థిక విధానాన్ని విశ్లేశించేటపుడు, జెండర్ విశ్లేషణ లేకపోవడం వల్ల, స్త్రీల అభివృద్ధికి సంక్షేమ పథకాలు మాత్రమే చాలనే ధోరణిలో ఆలోచించడం వల్ల ఉత్పత్తిదారులుగా వారికుండే పాత్రను గురించి, వారి హక్కుల గురించి పట్టించుకోవడం జరగడం లేదన్నారు. 1992లో యు.ఎన్.డి.పి. వ్యవస్థాగత సర్దుబాట్ల ప్రభావం స్త్రీలపై ఎలా ఉంటుందో చర్చించి, రిపోర్టు తయారు చేసింది. ప్రభుత్వ పాత్రను తగ్గించి, మార్కెట్ పాత్రను పెంచడం వల్ల స్త్రీలు మరింత వెనుకకు నెట్టి వేయబడుతున్నారనే విషయం స్పష్టం చేసింది. ఎస్.ఎ.పి. పేద ప్రజలకు, స్త్రీలకు వ్యతిరేకమైనదనడంలో సందేహం లేదు అన్నారు.

జనవరి 2005లో జాతీయ మహిళా కమీషన్ అధ్యయనం చేసి "ఇంపాక్ట్ ఆఫ్ డబ్ల్యూ.టి.ఒ. ఆన్ వుమెన్ ఇన్ అగ్రికల్చర్" పేరుతో

(తరువాయి 38వ పేజీలో...)

యాంత్రీకరణ ప్రోత్సహిస్తున్న పర్యావరణ విధ్వంసాన్నీ, మనకు సరిపడని టెక్నాలజీ దిగుమతినీ, ప్రభుత్వ విధానాల్నీ ,చేనేత కార్మికుల దుస్థితినీ తెలియజేస్తున్నారు పులుగుజ్జు సురేష్

అమిత వస్త్రోత్పత్తితో ప్రమాదం

భారతదేశం వస్త్రోత్పత్తిలో అతి వేగంగా ముందుకు సాగుతోంది. ఆర్జిస్తున్న విదేశీ మారక ద్రవ్యంలో సగానికి పైగా వస్త్రాల ఎగుమతుల ద్వారానే సంపాదించాలని ఆశిస్తున్నది. ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసి దాదాపు లక్ష కోట్ల రూపాయలను ఖర్చు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమయింది. ఇందులో భాగంగానే ఇరవై ఐదు వేల కోట్ల రూపాయల నిధితో టెక్నాలజీ అప్‌గ్రెడేషన్ ఫండ్ స్కీంను ఏర్పాటు చేసింది. అంతటితో ఆగకుండా టెక్స్‌టైల్ పార్క్‌లు, అపెరల్ ఎగుమతి పార్క్‌ల ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. మన రాష్ట్రంలో పదమూడు పార్క్‌లకు శంకుస్థాపనలయ్యాయి. వీటి ద్వారా రెండు లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించవచ్చని ప్రభుత్వం, టెక్స్‌టైల్ రంగ నిపుణులు పదే పదే చెప్పడం జరుగుతున్నది. కానీ ఇదంతా వాస్తవానికి ఆమడదూరమని గుండ్లపోచంపల్లిలో ఏర్పాటైన అపెరల్ ఎగుమతి పార్క్ అనుభవాలు తెలుపుతున్నాయి. 'గుండ్లపోచంపల్లి' లో నిర్మించిన ఈ పార్క్‌ను స్థానికులు చెర్మాస్ పార్క్ అని పిలుస్తారు. ఈ పార్క్ నిర్మాణానికి ప్రభుత్వం యాభై ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చింది. మౌలిక వసతులను అభివృద్ధి చేసింది. గ్రామస్తులకు తాగునీరు లేకున్నా పార్క్‌కు అవసరమైన నీటిని పైపులైను ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తోంది. పెట్టుబడి రాయితీ ఇరవై ఐదు శాతం, కంపెనీకి అవసరమైన కార్మికులకు శిక్షణనిచ్చే బాధ్యత ప్రభుత్వానిదే. పర్యవేక్షణ అధికారులు ఒక డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, రీజనల్ స్థాయి అధికారులు ఈ పార్క్‌లకు కాపలాదారులుగా ప్రభుత్వం నియమించింది. పెట్టుబడిదారుల అవసరాలు తీర్చడం వీరి పని. కానీ పార్క్‌లో తయారవుతున్న ఉత్పత్తులు, పెట్టుబడి, మార్కెట్, ఉద్యోగులు, వారి సంక్షేమ పథకాలు ఏ ఒక్క సమాచారం కూడా వారి దగ్గర ఉండదు. ప్రభుత్వ అధికారులు ప్రజల దగ్గర వారి పెత్తనం చెలాయిస్తారు. కానీ పెట్టుబడిదారుల దగ్గర గేటుకీపర్‌లాగా కాపలా కాస్తున్నారు.

పెట్టుబడిదారుల అవసరాలు తీర్చడానికి, వారి ఆస్తులను పెంచడానికి పేదరైతులను నిర్వాసితులను చేయడం, ప్రజాధనాన్ని వెచ్చించడం జరుగుతోంది. అదే రీతిలో చేనేత పార్క్‌లను అభివృద్ధి చేయాలని రాష్ట్రంలో చేనేత కార్మికులు అనేక రూపాలలో పోరాటాలు చేస్తున్నారు. ప్రభుత్వం చేనేత పార్క్‌లు ఏర్పాటు చేస్తామని వాగ్దానాలు చేసింది. కానీ వాటి అమలు ఏ విధంగా ఉండాలో ఇంతవరకు స్పష్టమైన ఆదేశాలు రాలేదు. పార్క్‌ను అభివృద్ధి చేయడానికి బడ్జెట్ కూడా కేటాయించలేదు. ఒక్క టెక్స్‌టైల్ పార్క్ ఏర్పడితే దాని ప్రభావం వలన యాభై వేల మంది చేనేత కార్మికులు ఉపాధి కోల్పోతారు. దీనికి ప్రభుత్వం దగ్గర సమాధానం లేదు. అధికార, ప్రతిపక్షాల దగ్గర చేనేత రంగాన్ని అభివృద్ధి చేయాలన్న దృక్పథం కన్పించడంలేదు. వారికి కావలసిందల్లా ఓటు మాత్రమే కాబట్టి.

రాష్ట్రంలో పదమూడు టెక్స్‌టైల్, అపెరల్ పార్క్‌లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇంతేకాకుండా నెల్లూరు జిల్లా వెంకటగిరి సమీపంలో 750 ఎకరాల పేదరైతుల భూమిని బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేయడం జరుగుతోంది. విశాఖపట్టణంలో బ్రాండిక్స్ కంపెనీ ఏర్పాటు చేసే అపెరల్ పార్క్‌కు యాభై ఏకరాల భూమిని, 2007-08 బడ్జెట్‌లో పది కోట్ల రూపాయల బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టెక్స్‌టైల్, అపెరల్ పార్క్‌ల అభివృద్ధికి తలుపులు తెరిచి పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నాయి. దీనివలన మన రైతులు భూమిని కోల్పోతారు. పార్క్‌ల నుండి వచ్చే కాలుష్యం భూగర్భ జలాలను కలుషితం చేస్తాయి.

రంగుల అద్దకానికి విపరీతంగా నీటిని వినియోగిస్తారు. దీని వలన పరిసర గ్రామాల ప్రజలకు తాగునీరు ఉండదు. గ్రామాలలో రైతుల బావులు ఎండిపోతాయి. బోర్లు వట్టిపోతాయి. పశువులకు మేత ఉండదు. ఫ్యాక్టరీలనుండి వెలువడే విషపదార్థాలు గాలిని కలుషితం చేస్తాయి. వీటి వల్ల విపరీతమైన పరిణామం జరుగుతుందని చైనా, మన పక్కనే ఉన్న తిరుప్పూర్ అనుభవాలు తెలుపుతున్నాయి.

తిరుప్పూరు (తమిళనాడు)

తమిళనాడురాష్ట్ర పవర్‌లూం పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ రాష్ట్రంలో ఒక అంచనా ప్రకారం 4,37,325 పవర్‌లూంలు ఉన్నాయి. ఈ రాష్ట్రంలో ప్రధాన పవర్‌లూం కేంద్రాలు - కోయంబత్తూరు, ఈరోడ్, సేలం, కరూర్, మధురై, చెన్నైలలో దేశంలోనే ఎక్కడా లేనన్ని స్పిన్నింగ్ మిల్లులు ఇక్కడ ఏర్పడ్డాయి. దీనివలన కూడా పవర్‌లూం పరిశ్రమ బాగా విస్తరించింది. పవర్‌లూం పరిశ్రమతో పాటు నిట్టింగ్ పరిశ్రమ కూడా వృద్ధి చెందింది. తిరుప్పూర్‌లోని నిట్టింగ్ పరిశ్రమను గురించి క్లుప్తంగా అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం. ఎందుకంటే భారతజౌళి రంగం సంస్కరణలలో భాగంగా గార్మెంట్ పరిశ్రమను అభివృద్ధి చేస్తోంది. ఈ పరిస్థితులలో తిరుప్పూర్ నిట్టింగ్ పరిశ్రమను అవగాహన చేసుకోవలసిన అవసరం ఉంది.

కొన్నిదశాబ్దాల క్రితం తిరుప్పూర్ ఒక సాధారణ పట్టణం. ఇదొక

ఎగుమతి కేంద్రం. ఈ కేంద్రం చుట్టూ సంస్కరణలను ఆహ్వానించేవారు తిరుగుతుంటారు. మన దేశంలో సంస్కరణలు మొదలయిన తర్వాత వేగంగా అమలు జరిగిన ప్రదేశం ఇదే. ప్రాథమిక స్థాయిలో సంస్కరణల ద్వారా వచ్చిన ప్రయోజనాలతో లాభపడింది కూడా ఇక్కడే. కేవలం రెండు దశాబ్దాల కాలంలో దేశంలోనే అతిపెద్ద నిట్‌వేర్ ఎగుమతి కేంద్రంగా అభివృద్ధి చెందింది. దీనిని అందరూ నమ్మలేరు. ఇదెలా సాధ్యమయిందో చెప్పడం కష్టం.

తిరుప్పూర్‌లో 1970లో ఎగుమతి చేయడం మొదలైంది. 1970-85 వరకు ఎగుమతి సుమారుగా పదిహేను కోట్ల రూపాయలు. 1990లో రు. 350 కోట్లకు చేరింది. నూతన ఆర్థిక విధానాలకు ఇది అద్దం పట్టింది. గత ఏడాది రు. 5,200 కోట్లకు పెరిగింది. 31 డిసెంబర్ 2005 తరువాత అనగా, కోటా పద్ధతి రద్దయిన తరువాత 2006లో ఏడు వేల కోట్ల రూపాయలకు పెరుగుతుందని అంచనా. తిరుప్పూర్ ఎగుమతిదారుల అసోసియేషన్ అంచనా ప్రకారం 2010 కల్లా పదిహేను వేల కోట్ల రూపాయలకు ఎగుమతి పెరగవచ్చని భావిస్తున్నారు.

వ్యాపార రంగంలో తిరుప్పూర్ బాగా విజయవంతమయింది. లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు ఉన్నాయి. ఇక్కడి గార్మెంట్ పరిశ్రమలో దాదాపు మూడు లక్షల మందికి ఉపాధి కల్పించబడుతుంది. ఇక్కడ ఉపాధి పొందుతున్న వారందరూ కూడా తమిళనాడు, కేరళ రాష్ట్రాలలోని కరువు పీడిత ప్రాంతం వారు.

ఈ పరిశ్రమలో ఉద్యోగాలు లభించేది కేవలం వ్యక్తులకు మాత్రమే కాకుండా కుటుంబమంతటికీ ఉపాధిని కల్పిస్తుంది. ఈ మధ్య కాలంలో బాలకార్మికులు ఈ పరిశ్రమలో అధికంగా ఉన్నారని బయటపడింది. సంస్కరణవాదులుగా పేదరికం నిర్మూలించాలని చెబుతున్నారు. అంతేకాకుండా కార్మికుల జీవన ప్రమాణాలు పెంచాలని, సంస్కరణల వలన సాధ్యమవుతుందని వారి వాదన. ఈ పరిశ్రమలో పనిచేసే వారు వెనుకబడిన వర్గాలవారు. తమిళనాడులోని రామనాథపురం, శివగంగ, పుదుక్కొట్టయ్ వారు ఉద్యోగాలు కలిగి ఉన్నారు. వేలాది యువతులు పనిచేస్తున్నారు. వీరు కేరళ నుండి వచ్చినవారు. కేరళలోని తమ కుటుంబాలకి కొంత ఆధారంగా ఉన్నట్టు పరిశ్రమలోని యువతులు తెలిపారు.

బహుశా! ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి అంతా సాంకేతిక అభివృద్ధి అని చెప్పవచ్చు. ఫలితంగా ఒక్క ఆధునిక యంత్రాలతోనే సాధ్యమైందని అందరూ భావిస్తున్నారు. ఇక్కడివారు మాత్రం చిన్న, మధ్యతరహా వ్యాపారుల ద్వారా జరిగిందని అభిప్రాయ పడుతున్నారు. లేబర్ కొరత ఉండడం వలన నైపుణ్యం లేని వారిని కూడా పనిలో నియమించడం జరుగుతోంది. చాలా పరిశ్రమలకు ఇక్కడ పోర్ట్, రవాణా, ఎయిర్‌పోర్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. అయితే అవకాశాలు మాత్రం చాలా కుదించుకున్నాయి. ఇకపోతే స్థూలంగా గమనిస్తే పాశ్చాత్యదేశాల పెట్టుబడులు లేకుండానే ఇదంతా సాధ్యమయింది. ఇంత మంచి ఫలితాలు సాధించగలిగారు.

తిరుప్పూర్ ఎగుమతిదారుల గత ముప్పై ఏళ్లనాటికీ ఈ రోజుకు మధ్య చాలా తేడా ఉంది. డిసెంబర్ 31, 2004లో కోటా పద్ధతి రద్దయిన రోజు నుండి ఎగుమతిదారులు పెద్ద సంఖ్యలో పెరిగారు. గత దశాబ్ద కాలం నుండి సంవత్సరాభివృద్ధి పదిహేను శాతం ఉంది. తిరుప్పూర్ ఎగుమతిదారులు మంచి సామర్థ్యం కలిగినవారయినందున ఇదంతా సాధ్యమయింది. 2001 నుండి ఈ పరిశ్రమ పెద్ద ఎత్తున విస్తరింపజేసారు. అప్పట్లో ఎగుమతిదారులు స్పిన్నింగ్ మిల్లులు, నిట్టింగ్ మిషన్లను సమకూర్చడానికి రెండు వేల నిట్టింగ్ మిషన్లు ఏర్పడ్డాయి. ఒక మిషన్ ధర రు. 10 లక్షలు. గత రెండు సంవత్సరాల నుండి వీటిని దిగుమతి చేసుకుంటున్నారు. ఇప్పుడు ఐదు వేలకు పెరిగాయి.

భారతదేశంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయతలపెట్టిన మొదటి అపెరల్ పార్క్ ఈ మధ్య కాలంలోనే శంకుస్థాపన చేసారు. దీని పేరు నేతాజీ అపెరల్ పార్క్. అరవై పరిశ్రమల బిల్డింగ్‌లు ఇరవై లక్షల చదరపు మీటర్లలో నిర్మిస్తారు. దీని కోసం అంచనా వేసిన పెట్టుబడి వంద కోట్ల రూపాయలు. భారత ప్రభుత్వం ఈ పార్క్ నిర్మాణానికి గ్రాంట్ రూపేణా 14 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. కోటా పద్ధతి రద్దయినందున రాబోయే ఒక్కటి రెండు సంవత్సరాలలో ఎగుమతులు రెట్టింపయ్యే అవకాశం ఉందని ఎగుమతిదారులు భావిస్తున్నారు.

2005లో వస్త్రం ధర తగ్గించడం వలన ఈ సంవత్సరం మొదటి మూడు నెలలు ఎగుమతులు తగ్గే అవకాశం ఉంది. ఎందుకంటే పేరొందిన అంతర్జాతీయ కొనుగోలుదారులు 10-15 శాతం తగ్గించారు. గతంలో తిరుప్పూర్‌లో రెండు వేల ముక్కల (pieces)కి ఆర్డర్ వచ్చిందంటే అదే ఒక పెద్ద ఆర్డర్. ఇప్పుడు ఎగుమతిదారులు, బయ్యర్స్ లక్షల ముక్కల గురించి మాట్లాడుతున్నారు. ఈ పరిశ్రమ ప్రారంభంలో కుటీర పరిశ్రమ 4 లేక 5 మందితో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉండేవి. పరిశ్రమ చాలా వేగంగా పెరిగింది. ఎందుకంటే మనిషి అంచనాలకు అందనంత స్థాయిలో పెట్టుబడి పెరిగింది. చిన్న పరిశ్రమలు ఎక్కువ కాలం నిలబడలేవు. కొన్ని దశాబ్దాల క్రితం కేవలం ఆరు మిషన్లు గల పరిశ్రమ సాధారణ స్థాయిగలది. ఇప్పుడు వెయ్యి మిషన్లతో కూడిన యూనిట్‌ని ఏర్పాటు చేసారు.

ఇప్పుడు యూనిట్ పరిమాణం సగటున యాభై మిషన్లు. కొద్ది సంవత్సరాల క్రితం ఒక కంపెనీలో పనిచేసిన నలుగురు గార్మెంట్ వర్కర్స్ కలిసి చిన్న గార్మెంట్ పరిశ్రమను స్థాపించారు. కొద్ది సంవత్సరాల తరువాత మార్కెట్‌లో ప్రత్యక్ష ఎగుమతిదారులయ్యారు. ఈ పరిణామాన్ని ఊహించలేం.

తిరుప్పూర్‌లో సాధారణ, చిన్న పరిశ్రమలు మననజాలవు. ఎందుకంటే ఒక్కొక్క యూనిట్‌లో వందలాది కోట్లరూపాయల వ్యాపారం జరుగుతుంది. ఎందుకంటే ఎగుమతిదారులు నూలు సరఫరా చేస్తారు. దీనిని గ్రేక్లాత్‌గా మార్చడానికి అయ్యే ఖర్చులు ఇస్తారు. ఇప్పుడు ఇక్కడ ధరపై యుద్ధం జరుగుతోంది. ఈ ధరల యుద్ధం ఎగుమతిదారులు, బడా స్పిన్నింగ్ మిల్లుల మధ్య జరుగుతోంది. ఒకవేళ ఈ ప్రాంతంలో పరిశ్రమ నిలదొక్కుకోవాలంటే కనీసం ఒక సెట్ మిషన్లు ఉండాలి. ఒక సెట్ అంటే మూడు డజన్లు (36 మిషన్లు). ఒక మిషన్ ఖరీదు రు. 10 లక్షలు, అంటే కోట్ల రూపాయల్లో పెట్టుబడి అవసరం. దక్షిణ భారత నిట్టింగ్ దిగుమతిదారుల అసోసియేషన్ అలారమ్ మోగించింది. కొత్త పెట్టుబడిదారులకు ఒక హెచ్చరిక చేసింది. జాబ్ వర్కింగ్ నిట్టింగ్ పరిశ్రమ అంత లాభదాయకంగా లేదు. కావున దయచేసి ఈ పరిశ్రమలో పెట్టుబడి పెట్టవద్దని కచ్చితంగా చెప్పింది.

పరిశ్రమ దుష్ప్రభావం

తిరుప్పూర్ పట్టణమంతా ఒకే పరిశ్రమ విస్తరించింది. పరిశ్రమ

మంచిగానే ఉంది. కానీ దాని నుండి వచ్చే దుర్గంధమే దుష్ప్రభావానికి గురిచేస్తుంది. అయితే ఇది స్థానిక ఆర్థిక, సామాజిక పరిస్థితులను కుంగదీసింది. అయినప్పటికీ ఇక్కడి మీడియాగాని, కార్మిక సంఘాలు గాని గొంతు విప్పడం లేదు. ఎందుకంటే పరిశ్రమ పక్షపాతి, పరిశ్రమ సంక్షేమం అన్న నినాదంతో ఉన్నారు.

తిరుప్పూర్ అద్దకం పరిశ్రమ చాలా పెద్దది. 729 బ్లీచింగ్, అద్దకం యూనిట్లు ఉన్నాయి. వీటిలో పది కోట్ల లీటర్ల నీటిని ఒక రోజుకు వినియోగిస్తారు. రివర్స్ ఒస్మోసిస్ ప్లాంట్స్ 19 మాత్రమే ఉన్నాయి. అయితే వీటి నుండి విడుదలయ్యే కలుషితమైన పదార్థాలను కాలువ ద్వారా నదిలోకి విడుదల చేస్తున్నారు. ఇవి పారిశుధ్యం చేయకుండా డైరెక్ట్‌గా నదిలోకి విడువబడుతున్నాయి. ఫలితంగా ఇక్కడ ఉన్న రిజర్వాయర్, ఒరత్తుపాలయం డ్యాం కలుషితమైనాయి. నీటిలో విషం నిండి ఉంది. దీని వల్ల లక్షలాది ఎకరాల పంటపొలాలు కాలుష్యానికి దెబ్బతిన్నాయి. వేలాది రైతు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. 1993లో వ్యవసాయం కోసం మరొక రిజర్వాయర్‌ను నిర్మించారు. ఈ నీరు అంతా కలుషితమై ఉండడం వలన దీనిలో నీరు వ్యవసాయానికి పనికిరావని రుజువైంది. నష్టపోయిన రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అక్కడ కూడా న్యాయం జరిగే అవకాశాలు కనబడటం లేదు.

ఇప్పుడు పరిశ్రమ బాధిత రైతులు, పంట నష్టపోయిన వారిలో కొందరు నీటిని అద్దకం పరిశ్రమకు విడిచిపెట్టగా మరికొందరు ఈ పరిశ్రమకే సరఫరా చేస్తున్నారు. ఈ ప్రాంతంలో వేలాది అడుగుల లోతుకు నీటి మట్టం కుదించుకుపోయింది. రెండు వేల అడుగుల లోతుకు వెళితే గాని నీరు దొరికే పరిస్థితిలేదు. ఇప్పుడు ప్రజల, ప్రైవేట్ భాగస్వామ్యంతో పరిశ్రమలకు నీటి కొరతను తీర్చడానికి నిరంతరంగా నీటిని సరఫరా చేయడానికి 1,023 కోట్ల రూపాయల పథకాన్ని అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసారు. విశేషమేమిటంటే ఇక్కడి ప్రజల తాగునీరుకు గానీ, ఈ పరిశ్రమల స్థాపన వలన నష్టపోయిన రైతులకు సాగునీరు గురించి గానీ ఎవరు పట్టించుకోవడం లేదు.

పెద్ద మొత్తంలో విస్తరించిన హోజరి కంపెనీలలో కార్మిక సంఘాలు లేవు. ఎక్కడైనా ఒకటి అర ఉంటే క్రమంగా వాటి పట్టువీడుతున్నాయి. ప్రధానంగా పని ప్రదేశంలో కార్మికులకు సౌకర్యాలు లేవు. కనీసం బాత్‌రూంలు, తాగునీరు, సేద తీర్చుకోవడానికి, గాలి పీల్చుకోవడానికి విశ్రాంతి ప్రదేశం గానీ లేవు. దీని వల్ల కార్మికులు ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడుతున్నారు.

వలస కార్మికులకు నివాసం పెద్ద సమస్య. ఇంటి అద్దెలు (కిరాయి) విపరీతంగా పెరిగాయి. ఒకరి సంపాదన రెండువేల రూపాయల నుండి మూడు వేల వరకు ఉంటే ఇంటి అద్దె రు. 1200–1500 వరకు ఉన్నాయి. పెరుగుతున్న నిత్యావసర ధరలు, ప్రాంతీయ రవాణా చార్జీలు తలకు మించిన భారమవుతున్నాయి. మానవ సంబంధాలు ప్రమాదంగా పరిణమించాయి.

మహిళలపైన అత్యాచారాలు, అఘాయిత్యాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు పెరుగుతున్నాయి. పని ప్రదేశంలోగానీ, నివాస ప్రాంతంలో గానీ వీరికి భద్రతలేదు. ఒత్తిడులు, భయాలు, ఆందోళనలు బాగా పెరుగుతున్నాయి. రోజుకు పదుల సంఖ్యలో మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయి. ఇన్ని జరుగుతున్నా గత సంవత్సరం పొడుగునా నమోదయిన కేసులు కేవలం 105 మాత్రమే. తిరుప్పూర్ ప్రాంతంలో నేరాలు, ఎయిడ్స్ వంటివి కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. సహజ సంపద విచక్షణారహితంగా ఖర్చు చేయబడుతున్నది. రాబోవు తరాలకు మనం మిగుల్చుతున్నదేమిటో మరి...

జౌళి యాంత్రీకరణ – పర్యావరణ వినాశనం

భారత ప్రభుత్వం జౌళి ఉత్పత్తులను శరవేగంతో అభివృద్ధి చేయాలని నిశ్చయించింది. ఇందుకు కారణం దేశంలో తక్కువ మజూరీలకు కూలీలు దొరకడం, ముడిసరుకు అందుబాటు, విదేశీ మారకద్రవ్యాన్ని బాగా ఆర్జించవచ్చని జౌళి రంగాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం కంకణం కట్టుకుంది.

జౌళి రంగం అభివృద్ధి జరిగితే అందరికీ మంచిదే. దీనిని ఆహ్వానించాల్సిందే. కానీ జౌళి అభివృద్ధితో పొంచి ఉన్న పర్యావరణానికి సంభవించే ముప్పును పట్టించుకోవడం లేదు. జౌళి రంగం అతి పెద్ద కాలుష్య పరిశ్రమ. దీనివలన నీరు, శబ్దం, గాలి, వాతావరణం దెబ్బతింటుంది. అంతే కాకుండా భూమి కూడా కలుషితమవుతుంది. వస్త్ర ఉత్పత్తికి అవసరమైన కాటన్ ఫైబర్‌ను అందించాలంటే పత్తి సాగు విస్తీర్ణం పెంచాలి. విస్తీర్ణంతో పాటు దిగుబడిని పెంచుతారు. దిగుబడిని పెంచడానికి ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానం ఒక్కటే. అది రసాయనిక ఎరువులను విపరీతంగా ఉపయోగించడం. దీనివల్ల భూమి, పర్యావరణం కలుషితమవుతుంది.

వస్త్ర ఉత్పత్తిలో ఉపయోగించే రసాయనాలు చాలా ప్రమాదకరమైనవి. వీటివలన నీరు కలుషితమవుతుంది. దీనితో పాటు నీటి కొరత ఏర్పడుతుంది. అందుకే రసాయనాలతో కూడిన రంగుల వస్త్రాలను జర్మనీ దేశం 1995లోనే నిషేధించింది. చైనా, భారత్ వంటి దేశాల వస్త్రాలను జర్మనీ దేశం దిగుమతిని రద్దు చేసింది. రసాయనాలను వినియోగించడం వలన చర్మవ్యాధులు, క్యాన్సర్ వంటి వ్యాధులు సోకుతున్నాయి. కావున సహజ రంగుల ఉత్పత్తులను మాత్రమే జర్మనీ దిగుమతి చేసుకుంటోంది. వస్త్ర ఉత్పత్తికి ఉపయోగించే యంత్రాల వలన విపరీతమైన చప్పుడు వస్తుంది. దీని నుంచి శబ్దకాలుష్యం ఏర్పడుతోంది.

జౌళి రంగానికి అవసరమైన వెజిటబుల్ డైస్ ఉత్పత్తులు చేయడానికీ, పర్యావరణ కాలుష్య రహిత వస్త్రాలను తయారీ చేయడానికి చైనా ఇప్పటికే పరిశోధనలు ప్రారంభించింది. ఈ పరిశోధనల ఫలితాలు దేనికి దారితీస్తాయో వేచి చూడాలి. భారతదేశంలో విస్తారమైన అడవులు ఉన్నాయి. వీటి నుండి వచ్చే కరక్కాయ, ముష్టికాయ, బంక మొదలగు కాయలు ప్రపంచంలోనే నలభై శాతం సంపద ఇక్కడ ఉంది. వీటిని వినియోగించడానికి వీలుంది.

పవర్‌లూం రంగంలో అధికోత్పత్తి కాబట్టి అది సాధ్యపడకపోవచ్చు. చేనేతరంగం దీనికి అనుకూలమైనది. భవిష్యత్తులో పవర్‌లూం వలన పర్యావరణ కాలుష్యం విపరీతంగా పెరిగే ప్రమాదం ఉంది. అందువల్ల పర్యావరణపు ఖర్చులు కూడా భారీగానే ఉంటాయి. వీటిని వెచ్చించగలిగే స్తోమత మనదేశ పవర్‌లూం రంగానికి లేదు. ఎందుకంటే పర్యావరణ ఖర్చులు లేని ప్రస్తుత కాలంలోనే పవర్‌లూం కార్మికుల ఆత్మహత్యలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీనిని బట్టి పర్యావరణ ఖర్చులు భరించాల్సి వచ్చినరోజు, పర్యావరణ నియమాలు ప్రభుత్వం అమలు చేసిన రోజు పవర్‌లూం రంగం వెనుదిరిగే పరిస్థితి ఉంది. ◆

గత శతాబ్ది తొలి దశకాలలో బ్రిటన్‌లో ఉన్నత విద్య అభ్యసించి తెలుగునాట తొలి మార్క్సిస్టు ఆలోచనాపరుడిగా అసంఖ్యాక రచనలు చేసి నాలుగు పదుల వయసులోనే మరణించిన అసాధారణ మేధావిని పరిచయం చేస్తున్నారు యిమ్మానేని సత్యసుందరం

మార్క్సిస్టు మేధావి కె.బి. కృష్ణ

శాస్త్రీయ సామ్యవాద అధ్యయన కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గుంటూరు డా. కె.బి. కృష్ణ శతజయంతి కమిటీ, హైదరాబాద్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 2007 మార్చ్ 21, 22 లలో 'డా. కె.బి. కృష్ణ జీవితం - కృషి' అనే అంశంపై రాష్ట్రస్థాయి గోష్ఠి నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించబడింది. ఈ గోష్ఠికి సి. నరసింహారావు సంచాలకులు. ఈ సందర్భంగా 'డా.కె.బి. కృష్ణ - జీవితం, రచనలు' పుస్తకాన్ని విడుదల చేయడం జరిగింది. డా. కె.బి. కృష్ణ రచనలను ఐదు సంపుటాలుగా ప్రచురించారు.

గోష్ఠికి అధ్యక్షత వహించిన యూనివర్సిటీ ఛాన్సలర్ బాలమోహన్ దాస్ మాట్లాడుతూ డా. కృష్ణ మహా పండితుడు, స్వతంత్ర ఆలోచనాపరుడని అన్నారు. ప్రముఖ ప్రాత్రికేయులు సి. రాఘవాచారి, డా. కృష్ణ రచనలకు తగు ప్రాచుర్యం ఇస్తే కొన్ని తరాలని అవి ప్రభావితం చేస్తాయని అన్నారు. పాత్రికేయులు, అధికార భాషా సంఘం అధ్యక్షులు డా. ఎ.బి.కె. ప్రసాద్ మాట్లాడుతూ జైలులో ఉన్నప్పుడు కూడా డా. బాలకృష్ణ సహ ఖైదీలకు శిక్షణా తరగతులు నిర్వహించారన్నారు. డా. కె.ఆర్.ఆర్. మోహన్‌రావు మాట్లాడుతూ తాను 1943-46 మధ్య కాలంలో మద్రాసులో డా. కె.బి. కృష్ణను పలుసార్లు కలిసానని చెప్పారు. డా. కృష్ణ ఆలోచనాస్థాయి హెచ్చుగా ఉండేదని, అయితే నిరాడంబర జీవితం గడిపారని తెలిపారు. ప్రముఖ చరిత్రకారులు వి. రామకృష్ణ కీలక ఉపన్యాసం ఇచ్చారు. డా. కృష్ణ తన రచలన్నీ మార్క్సిస్టు దృక్పథంతోనే రాసారని, మైనారటీల సమస్యపై పి. హెచ్‌డి. చేసారని తెలిపారు. అయితే, ఇక్కడ 'మైనారిటీలు' అంటే బ్రిటిష్ పాలనలో అన్యాయానికి గురి అయిన వారని రామకృష్ణ విపులీకరించారు. మైనారిటీలంతా కలిసి సంఘటితంగా బ్రిటిష్ పరిపాలనను ప్రతిఘటించాలని డా. కె.బి. కృష్ణ ఆశించారు. మైనారిటీలకు రాజకీయ అధికారం కూడా అవసరమని డా. కృష్ణ గ్రహించినట్లు రామకృష్ణ తెలిపారు.

జీవిత చరిత్ర

డా. కె.బి. కృష్ణ గుంటూరు జిల్లా తెనాలి తాలూకాలోని ఇంటూరులో జన్మించారు. హార్వార్డ్ యూనివర్సిటీ రికార్డుల ప్రకారం సెప్టెంబర్ 25, 1906లో డా. కృష్ణ జన్మించారు. (కొందరు పరిశోధకులు డా. కృష్ణ 1906కు ముందే జన్మించి ఉండాలని అంటున్నారు. దీనికి కారణం, డా. కృష్ణ 1921లోనే లండన్‌కు ప్రయాణం చేసారు. కొందరు డా. కృష్ణ 1898లో పుట్టినట్లు చెబుతున్నారు).

మద్రాస్‌లో వెస్లీకళాశాలలో చదువు అనంతరం, 1921లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో మూడు సంవత్సరాలు విద్యనభ్యసించారు. అయితే, ఆర్థిక ఇబ్బందులవల్ల కృష్ణ చదువు లండన్‌లో కొనసాగటం కష్టమైంది. లండన్‌లో ఉన్నప్పుడే మార్క్సిస్టు సిద్ధాంతాలను అన్ని కోణాలనుండి పరిశీలించడం జరిగింది. డా. కృష్ణ భారతీయ తత్వ శాస్త్రాన్ని, ప్రత్యేకించి బౌద్ధ, జైన సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేసారు.

డా. కృష్ణ 1929 సెప్టెంబర్‌లో అమెరికాలోని హార్వార్డ్ విశ్వవిద్యాలయంలో చేరారు. ఉద్యోగం చేసుకుంటూ చదువు కొనసాగించారు. ఎం.ఎ., పి.ఎచ్‌డి. పట్టాలను పొందారు. 1939 ఆగస్ట్ 2న దేశానికి తిరిగి రాబోయే ముందు లండన్‌లో ఆగి తన పి.ఎచ్‌డి. పరిశోధనా గ్రంథంలో తగిన మార్పులు చేసారు. అది 'ప్రాబ్లమ్ ఆఫ్ మైనారిటీస్, ఆర్ కమ్యూనల్ రిప్రజంటేషన్ ఇన్ ఇండియా' అన్న పేరుతో 1939లో జార్జి ఎల్లెన్ అండ్ అన్‌విన్ సంస్థ ప్రచురించింది.

డా. కృష్ణ 1939లో దేశానికి తిరిగి వచ్చారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. ముఖ్యంగా విద్యార్థి లోకాన్ని చైతన్యపరచడానికి కృషి చేసారు. కృష్ణను 1941 మార్చ్ 2న అరెస్ట్ చేసి వెల్లూరు జైలులో నిర్బంధించారు. అక్టోబర్ 8, 1941న మద్రాస్ జైలుకు మార్చారు. మే 12, 1942న కోయంబత్తూరు జైలుకు తరలించారు. జూన్ 24, 1942న జైలు నుండి విడుదల చేసారు. జైళ్లలో ఉండగానే డా. కృష్ణ సోవియట్ యూనియన్‌పై హిట్లర్ దాడిని విశ్లేషిస్తూ 300 పేజీల పరిశోధనా గ్రంథాన్ని రచించారు.

అయితే, కృష్ణ జీవితం సాఫీగా సాగలేదు. 1940 లో వివాహం జరిగింది. కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, కృష్ణను వెంటాడాయి. మధ్యలో జైలు నిర్బంధం, కూతురు ఆకస్మిక మరణం ఇవన్నీ కృష్ణను మానసికంగా కృంగదీశాయి. కృష్ణ మాత్రం తన అధ్యయనాన్ని, పరిశోధనని విడనాడలేదు. 42 ఏండ్ల ప్రాయంలోనే 1948 డిసెంబర్ 18న కృష్ణ మరణించారు. డా. కృష్ణ పి.ఎచ్‌డి. సిద్ధాంత గ్రంథం భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని తూర్పారపట్టింది.

ఆర్థిక ఆలోచనలు

డా. కాట్రగడ్డ బాలకృష్ణ అనేక అంశాలపై, సమకాలీన సమస్యలపై తన అభిప్రాయాలను వెలుబుచ్చడం జరిగింది. ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో కృష్ణ ఆర్థిక ఆలోచనలు ప్రాముఖ్యతను సంతరించుకొన్నాయి. ఈ ఆలోచనలను పరిశీలిస్తే డా. కృష్ణ నూరు శాతం మార్క్సిస్టు అని తేలికగా గ్రహించవచ్చు.

భారత ఆర్థిక వ్యవస్థలో ప్రధాన లోపాలు డా. కృష్ణ గ్రహించారు. వీటిలో ముఖ్యమైనవి.

1. గ్రామీణ ప్రాంతాలలో సంపద కొంతమంది చేతులలో కేంద్రీకృతమైంది. అందువలన ప్రజల దగ్గర కొనుగోలు శక్తి లేకపోయింది.
2. భారీ పరిశ్రమలు చిన్నతరహా పరిశ్రమల పోటీ శక్తిని హరించేసాయి.
3. దేశీయ బ్యాంకులపై పారిశ్రామిక వర్గాల ప్రభావం లేదు.
4. బ్రిటిష్ ప్రభుత్వం కీలక పరిశ్రమలను ఏమాత్రం ప్రోత్సహించలేదు.

ఆర్థికాభివృద్ధి, ప్రణాళికలపై డా. కె.బి. కృష్ణకు కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. డా. కృష్ణ రచించిన చిన్న పుస్తకం 'భారత దేశ ఆర్థికాభివృద్ధి పై ప్రణాళిక' 1945 మార్చ్‌లో అచ్చువేయబడింది. ఇందులో 14 అధ్యాయాలున్నాయి. ప్రణాళికా భావజాలం, ఆలోచనలపై సమగ్రమైన అవగాహన మార్క్స్, ఏంగెల్స్‌తో ప్రారంభమైనదని డా. బాలకృష్ణ గట్టిగా నమ్మారు. 1929లో ఏర్పడిన ఆర్థిక మాంద్యం రష్యావిధానాలకు బలం చేకూర్చింది.

స్వాతంత్ర్యానికి పూర్వం అనేక మంది మేధావులు భారతదేశానికి ఎటువంటి ఆర్థిక ప్రణాళిక ఉండాలో వివరించారు. అయితే, పెట్టుబడి విధానాన్ని దెబ్బతీయకుండా ప్రణాళికా రూపకల్పన చేయడంలో అర్థంలేదని డా.కె.బి. కృష్ణ భావించారు. మన మేధావులు ఆ రోజుల్లో ఆర్థిక రంగంలో ఏర్పడిన అనేక వైరుధ్యాలను చర్చించేవారు. వ్యవసాయరంగం – పారిశ్రామిక రంగానికి మధ్య; భారీ పరిశ్రమలకు – చిన్న పరిశ్రమలకు మధ్య; శ్రమ సాంద్రత; మూల ధన సాంద్రత – ఉత్పత్తి పద్ధతుల మధ్య వైరుధ్యాలు ఉంటూనే ఉన్నాయి. 1944 వరకూ వచ్చిన ఆలోచనలు 'వాస్తవానికి దూరంగా' ఉన్నాయని డా. బాలకృష్ణ భావించారు.

'మార్క్సియన్ సామాజిక శాస్త్రం' స్వీయ మానసిక అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటుందనీ, వీటిని సామాజిక శాస్త్ర వ్యవస్థలో భాగంగా పరిగణించి విశ్లేషిస్తుందనీ డా. బాలకృష్ణ భావించారు. ప్రణాళికను జయప్రదంగా అమలు చేయటానికి ఈ విశ్లేషణ అవసరమని ఆయన భావించారు. అయితే, లక్ష్యాలను సాధించటానికి రాజకీయ దృఢ నిశ్చయం అత్యవసరం అని డా. బాలకృష్ణ గ్రహించారు. ఇది లోపించడం వల్లే ఈ రోజు మనదేశం అనేక క్లిష్ట సమస్యలను ఎదుర్కొంటోంది.

డా. బాలకృష్ణ అన్ని గ్రంథాలను ఒక వ్యాసంలో సమీక్షించడం కష్టం. ఆయన నిరాడంబరుడుగా, నిరంతర పరిశోధకుడుగా జీవితం గడిపారు. తాను రాసిన వ్యాసాలను ప్రచురించడానికి కూడా ఏమాత్రం కృషి చేయలేదు. ఏ పార్టీలోనూ ఏ ఉద్యమంలోనూ చేరలేదు. తాను నమ్ముకున్న సిద్ధాంతాల విషయంలో రాజీపడలేదు. అందువల్ల ఏ ఉద్యోగంలోనూ ఎక్కువకాలం ఉండలేకపోయారు. ఆయన పరిశోధన అంతా ప్రతికూల పరిస్థితులలో కొనసాగటం గమనార్హం. ఆయనకు కోరికలు లేవు. ఉన్నది ఒకటే కోరిక : ప్రజలు మార్క్సిజాన్ని సరియైన దృష్టితో చూడాలని, అందుకు తన రచనలు ఉపయోగపడాలని డా. బాలకృష్ణ రచనలు వెలుగుచూస్తున్నాయి. అదే మనం ఆయనకిచ్చే నివాళి. ◆

ద్రవ్యోల్బణం ఈ రోజులలో ఒక అంతర్జాతీయ సమస్య అంటూ, అది మన ఆర్థిక వ్యవస్థపైన, ధర వరలపైన, సామాన్యులపైన కలగజేసే ప్రభావాన్ని వివరిస్తున్నారు కోమటి లక్ష్మీనారాయణ

ద్రవ్యోల్బణం - ఒక పరిశీలన

ద్రవ్యోల్బణం ఈ రోజులలో ఒక అంతర్జాతీయ సమస్య. రెండో ప్రపంచ యుద్ధం తరువాత అన్ని దేశాలు ద్రవ్యోల్బణానికి గురయ్యాయి. ద్రవ్యోల్బణ పదాన్ని తరుచుగా అందరూ ఉపయోగిస్తారు. వ్యవహారిక భాషలో ద్రవ్యోల్బణాన్ని 'వేగంగా పెరిగే ధరల స్థాయి' అని చెప్పవచ్చు. అయితే ఒకేసారి ధరల స్థాయి పెరిగి ఆగిపోతే అది ద్రవ్యోల్బణం కాదు. ధరలు ఎడతెగకుండా పెరుగుతూ ఉంటే ద్రవ్యోల్బణం అంటాం. అర్థశాస్త్రవేత్త కాల్ బార్న్ ద్రవ్యోల్బణాన్ని 'అధిక ద్రవ్యం అతి తక్కువ వస్తువులను వెంటాడడం' అని అంటాడు (టూ మచ్ మని చేసింగ్ టూ ఫ్యూ గూడ్స్). ఇది ద్రవ్యరాశి సిద్ధాంతాన్ని గుర్తు చేస్తుంది. 1930లో ఏర్పడిన ఆర్థిక మాంద్యాన్ని పురస్కరించుకొని కీన్స్ రూపొందించిన సిద్ధాంతం ప్రచారంలోనికి వచ్చిన రోజులలో ద్రవ్యోల్బణం అంత ప్రధాన సమస్యగా కనిపించలేదు. కీన్స్ ఉద్దేశంలో, తక్కువ మోతాదులో ఉన్న ద్రవ్యోల్బణం వలన ఆర్థిక వ్యవస్థకు మేలు కలుగుతుంది. అందువలన వ్యవస్థలోని ఆదాయం సాంప్రదాయికంగా వినియోగం చేసే వర్గాల నుండి ఉత్సాహంతో పెట్టుబడి పెట్టే వర్గాలకు బదిలీ ద్వారా పెట్టుబడి పెరిగి ఆర్థికంగా వ్యవస్థలో నూతనోత్తేజం ఏర్పడుతుంది. ద్రవ్యోల్బణం ఆర్థికాభివృద్ధికి దోహదకారి అని షుంపీటర్, ఆల్విన్, హన్సన్, హమిలన్‌లు గూడా భావించారు. కానీ అభివృద్ధి చెందుతున్న దేశాలలో పైన పేర్కొన్న సత్ఫలితాలు ఇవ్వలేదు. ద్రవ్యోల్బణం తగినంత ఉద్యోగస్థాయిని పెంచలేదు. ద్రవ్యోల్బణం సాంఘిక దుస్థితికి, రాజకీయ ఆందోళనకు దారితీసింది. ఆదాయ అసమానతలను పెంచి విదేశీ మారక నిల్వలు తగ్గిపోవడానికి కారణమవుతోంది.

అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో వృద్ధితో పాటు ద్రవ్యోల్బణం ఏర్పడటం 20వ శతాబ్దంలో సహజమయింది. కానీ కొన్ని దేశాలలో ఏర్పడిన ద్రవ్యోల్బణానికి ద్రవ్య విధానంలోని లోపాలే ముఖ్య కారణాలుగా చూపవచ్చు. కొన్ని వెనకబడిన దేశాలలో తక్కువ స్థాయిలో ఉండే తలసరి ఆదాయం, పెరుగుతున్న జనాభా అవసరాలకు సరిపోయే పొదుపును సృష్టించడం లేదు. కావునా ఈ లోటును పూడ్చడానికి ప్రభుత్వాలు లోటు బడ్జెట్ విధానాన్ని పాటించి ద్రవ్యాన్ని విడుదల చేస్తుంది. లోటు ద్రవ్యం కారణాల వలన కొన్ని దేశాలలో ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. కాని ఈ కారణాలు మాత్రమే ద్రవ్యోల్బణం ఏర్పడటానికి కారణం కాదు. ద్రవ్యోల్బణం ఏర్పడడానికి, పొదుపును మించి పెట్టుబడి, వ్యయం ఉన్నప్పుడే గాని, నిర్ణయించిన పొదుపు పెట్టుబడులు సమానంగా ఉన్నప్పటికీ ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాల పెరుగుదల తులనాత్మకంగా లేకపోయినా కొన్ని రకాల వస్తువుల, ముడి పదార్థాల సప్లయిలో కొరతలు ఉన్నా ద్రవ్యోల్బణం ఏర్పడవచ్చు. అభివృద్ధి ప్రక్రియలో అసమతౌల్యాలు ఏర్పడడం సహజం. దీని వలన ధరలు నిలకడగా ఉండక, ధరల అస్థిరత ఏర్పడుతుంది. భారతదేశం, బ్రెజిల్, ఫిలిప్పైన్స్, పాకిస్తాన్, శ్రీలంక, అర్జెంటినా మొదలయిన దేశాలలో వ్యవసాయం ఎక్కువగా అభివృద్ధి చెందకపోవడం వలన సాధారణ ధరల స్థాయి పెరుగుతోంది. పారిశ్రామిక రంగంతో పాటు వ్యవసాయరంగం అభివృద్ధి చెందక ఆహారధాన్యాలలోను, ముడి పదార్థాలలోను కొరతలు ఏర్పడి, ఆర్థికాభివృద్ధి సాధించకనే విపరీతమైన ద్రవ్యోల్బణం పరిస్థితులు ఏర్పడి ఈ రెండు రంగాల మధ్య అసమతౌల్యాన్ని ఎక్కువ చేస్తోంది. మన దేశంలో ద్రవ్యోల్బణం రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభం నుంచి ఏర్పడింది. యుద్ధ కాలంలో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడింది. అంతేగాక యుద్ధ అవసరాలకు ఉన్న వస్తువులలో కొంత భాగం తరలించబడడం వలన ఈ కొరత మరీ ఎక్కువయింది. దీనికి తోడు ప్రభుత్వపు యుద్ధ వ్యయం, దాని ప్రభావంగా పెరిగిన వస్తువుల డిమాండ్ కూడా ద్రవ్యోల్బణానికి కారణభూతాలయ్యాయి. ఒక ఆర్థిక వ్యవస్థ ద్రవ్యోల్బణానికి గురి అయినప్పుడు ఈ కింది లక్షణాలుంటాయి.

1) ధరల స్థాయి నిరాఘాటంగా పెరుగుతూ ఉంటుంది. 2) బ్యాంకుల రుణాలు పెరుగుతుంటాయి. 3) రుణాలలో ఎక్కువ భాగం అనుత్పాదక అవసరాలకు, సట్టా వ్యవహారాలకు సమకూరుతుంది. 4) ప్రభుత్వ బడ్జెట్ పెద్దదిగా ఉంటుంది. 5) చాలా వస్తువుల సప్లయి చాల తక్కువగా ఉంటాయి. 6) శ్రామికులలో అసంతృప్తి ఉంటుంది. సమ్మెలు, సంస్థల మూసివేతలు బాగా ఉంటాయి. పన్నులు, ప్రభుత్వ రుణాలు ఎక్కువవుతాయి. లోటు ద్రవ్యవిధానం ఉపయోగించబడుతుంది. కంట్రోళ్లు ఉంటాయి. నల్లధనం, నల్లబజార్లు ఎక్కువవుతాయి.

దేశంలో ద్రవ్యోల్బణాన్ని అరికట్టడం ప్రథమ పంచవర్ష ప్రణాళిక ముఖ్య ఉద్దేశాలలో ఒకటి. అనుకూలమైన వాతావరణం కారణంగా పంటలు బాగా పండి, ఆహార ధాన్యాలు సమృద్ధిగా లభ్యమవుతాయి. విదేశీ చెల్లింపులలో గూడా సమస్యలు లేవు. తత్ఫలితంగా ప్రణాళికాంతానికి సాధారణ ధరల సూచి 99 (1952-53=100)గా నిలిచింది. ఈ కాలంలో ఆహార వస్తువుల సూచి 95, ధాన్యాల సూచి 88, పప్పు దినుసుల సూచి 77కు పడిపోయాయి. పరిస్థితులు

అనుకూలంగా ఉండడం వలన మొదటి ప్రణాళికా కాలంలో ద్రవ్యోల్బణ సమస్య ఏర్పడలేదు. అదే విధంగా రెండో ప్రణాళికలో పారిశ్రామిక రంగంపై ఎక్కువ పెట్టుబడి పెట్టడం జరిగింది. అయితే పెట్టుబడి వ్యయానికి తగినంతగా అన్ని రంగాలలోను, ఉత్పత్తి పెరగకపోవడం, మార్కెట్‌లో వస్తువుల కొరత, పెరుగుతున్న ద్రవ్యాదాయ ప్రతికూలత, విదేశీ చెల్లింపుల శేషం మొదలయిన కారణాల వలన రెండవ ప్రణాళికా కాలంలో ద్రవ్యోల్బణ సమస్యతలెత్తింది. రెండో ప్రణాళికా కాలం మొదటి నుండి ధరలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. ఫలితంగా 1955-56, 1960-61ల మధ్య కాలంలో సాధారణ ధరల స్థాయి 20 శాతానికి పెరిగింది. ఇది నాలుగో ప్రణాళికాంతానికి అతి ద్రవ్యోల్బణంగా పరిణమించింది. ఆశాజనకంగా ప్రారంభమయిన నాలుగో ప్రణాళిక మొదటి సంవత్సరంలో (1969-70) వ్యవసాయక, పారిశ్రామిక ఉత్పత్తులు సంతృప్తికరంగా పెరగడం వలన ద్రవ్యరాశి సప్లయి 10.5 శాతానికి పెరిగినప్పటికీ, ధరల పెరుగుదల అంత ఆందోళనకరంగా లేదు. ఆ సంవత్సరం టోకు ధరల సూచి 3.7 శాతం పెరిగింది. 1970-71లో ధరల సూచి 5.5 శాతం. 1971-72లో 4 శాతం పెరిగింది. ఈ రెండు సంవత్సరాలలో ద్రవ్యరాశి సప్లయి సంవత్సరానికి 12 శాతం పెరిగింది. 1972 జనవరి నుండి భారతదేశంలో సాధారణ ధరల స్థాయి వేగంగా పెరగనారంభించింది. వస్తువుల ధరలపై ఒత్తిడి అధికం కాగా, 1972 జూన్ నెలలో టోకు ధరల సూచి 6.1 శాతం పెరిగింది. అదే విధంగా వివిధ ప్రణాళికా కాలాలలో ద్రవ్యోల్బణ స్థాయిని పట్టికలో చూడవచ్చు.

పై అంశాలను పరిశీలించినట్లయితే రెండవ ప్రణాళికను వృద్ధి ప్రణాళికగా పేర్కొనవచ్చును. ఈ బృహత్తర ప్రణాళిక ప్రారంభంలో ఆర్థిక ప్రగతి ప్రక్రియలో ఉత్పన్నమయ్యే సమస్యలన్నీ తలెత్తినాయి. ఈ ప్రణాళికా కాలంలో పారిశ్రామిక రంగంపై ఎక్కువ పెట్టుబడి పెట్టడం జరిగింది. మిగతా రంగాలపై పెట్టుబడి వ్యయం తగ్గడం వలన ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఉత్పత్తి పెరగకపోవడం, విదేశీ చెల్లింపుల ప్రతికూల శేషం, ద్రవ్యోల్బణం మొదలైన సమస్యలన్నీ ఈ ప్రణాళికా కాలంలో ఉత్పన్నమైయ్యాయి. వివిధ ప్రణాళికా కాలాలలో పెరిగిన ద్రవ్యోల్బణ సాంవత్సరిక రేటు వలన సామాన్య జనావళికి అనేక రకాలైన ఇబ్బందులు కలుగుతున్నాయి. దానికి మన ప్రభుత్వపు వైఖరిని పరిశీలించినట్లయితే టోకు ధరల సూచి, దాని ఆధారంగా లెక్కించే ద్రవ్యోల్బణం రేటు వీటి అర్థం ఏమిటో, ఇవి ఎందుకు పెరుగుతాయో తెలిసిన వారు తక్కువే అయినా మధ్యతరగతి నుండి పేదల వరకు అందరూ వీటి బరువు కింద నలిగే వారే. నేడు బియ్యం గోధుమల్లాంటి ఆహార ధాన్యాలు, పప్పుదినుసులు, వంట నూనెల్లాంటి నిత్యావసర వస్తువుల ధరలు భగ్గుమనటానికి ద్రవ్యోల్బణ రేటు అదుపు తప్పడమే ప్రధాన కారణం. గత ఏడాదితో పోలిస్తే ధరలు ఏ స్థాయిలో పెరిగాయో చెప్పేదే ద్రవ్యోల్బణం రేటు. టోకు ధరల సూచి ఆధారంగా లెక్కించే ఈ రేటు సగటు మనిషిపై నానాటికి పెరిగిపోతున్న భారాన్ని పాక్షికంగానే ప్రతిబింబిస్తుంది. టోకు ధరలకు కొనుగోలు చేసే వెసులబాటు పెద్దలకే తప్ప బడుగులకు ఉండదు. అందుకే వినియోగ

ప్రణాళికా కాలంలో ద్రవ్యోల్బణం (సంవత్సరిక సగటు శాతం)

క్ర.సం.	ప్రణాళిక	టోకు ధరలు %
1	1951-56	3.2
2	1956-61	5.4
3	1961-66	5.8
4	1969-74	9.0
5	1974-79	6.3
6	1980-85	9.7
7	1985-90	6.7
8	1992-97	7.1
9	1999-2002	6.1
10	2002-07	6.0

ధరల సూచి ఆధారంగా గణించే ద్రవ్యోల్బణం రేటు ఎప్పుడు అధికంగానే ఉంటుంది. పైగా విద్య, వైద్య, రవాణా లాంటి నిత్యవసర సేవలకు పెట్టే ఖర్చును ద్రవ్యోల్బణం రేటును లెక్కించేందుకు పరిగణనలోనికి తీసుకోరు. వీటిని పరిగణనలోనికి తీసుకొంటే సగటు మనిషిపై పెరిగిన అసలు భారం ఎంతో అర్థమవుతుంది. ధరల పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు కొన్ని నెలల నుండి రిజర్వ్ బ్యాంక్ తన వంతు ప్రయత్నం చేస్తూనే ఉంది. మార్కెట్లో రిపోరేటు, రివర్స్ రిపోరేటు, బ్యాంకురేటు, నగదు నిల్వల నిష్పత్తి తదితరాల్ని అనేక సార్లు పెంచింది. ఈ చర్యలన్నింటి లక్ష్యం ఒక్కటే, ద్రవ్య చలామణీ తగ్గించటం. అంటే అందుబాటులో ఉన్న డబ్బు పరిమాణాన్ని అదుపుచేయడం అన్నమాట. మార్కెట్లోనూ, జనం దగ్గరా డబ్బు ఎక్కువ కావటంతో ఎంత ధరైనా చెల్లించి వస్తువులు కొనడానికి పోటీ పడుతున్నారని అందుకే ధరలూ, ద్రవ్యోల్బణం పెరుగుతున్నాయనీ ఆర్.బి.ఐ. భావిస్తోంది. ఈ భావనతోనే ఓ పక్క రేట్లు పెంచే చర్యలు, మరో పక్క ద్రవ్య సరఫరా తగ్గించే నిర్ణయాల వలన చిన్న పారిశ్రామికవేత్తలు, మధ్య తరగతి ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

ద్రవ్యోల్బణంలో రెండో కోణం కూడా ఉంది. అదే ఉత్పత్తి క్షీణత. నిత్యావసర వస్తువుల విషయంలో ఈ పరిస్థితి స్పష్టంగా కన్పిస్తుంది. ద్రవ్యోల్బణం రేటు విషయంలో ఆర్.బి.ఐ.కి దిశా నిర్దేశం చేస్తూ స్వయంగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిన కేంద్రం మాత్రం ఇన్నాళ్లూ నిర్లిప్తత ప్రదర్శించింది. ఆర్థిక మంత్రి చిదంబరం సైతం తన చేతిలో ఏమీ లేనట్లుగా చెబుతూ వచ్చారు. కార్పొరేట్ సంస్థలను, పెరిగిన పెట్రోలియం ఉత్పత్తుల ధరలను నిరోధించడానికి ప్రాధాన్యమిచ్చారు. ఆహార ధాన్యాల ఎగుమతులను నిషేధించి, దిగుమతి సుంకాలను తగ్గిస్తే చాలు - ధరలు దారికొచ్చేస్తాయని కేంద్ర ప్రభుత్వం భావించింది. రోగం ఒకటైతే మందు మరొకటైంది. క్రితం జూన్‌లోనే కేంద్రం స్వేచ్ఛగా గోధుమల దిగుమతికి అనుమతించింది. 42 లక్షల టన్నుల చక్కెరను స్వేచ్ఛా విక్రయానికి విడుదల చేసింది. ఓ పక్క ఎగుమతులను నిషేధించి ఎలాంటి సుంకం లేకుండానే పప్పు ధాన్యాల దిగుమతులకు పచ్చ జెండా ఊపింది. తాజాగా మరి కొన్ని వస్తువులపై దిగుమతి సుంకాలు

తగ్గించింది. కేంద్రం గురి తప్పిందనటాన్ని ద్రవ్యోల్బణం రేటు మరోసారి పెరగటమే, ధరల పోటుకు కారణాలపై ప్రభుత్వ వర్గాల నుంచి విచిత్ర భాష్యాలు వినబడుతున్నాయి. దాదాపు రెండంకెల స్థాయిలో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కారణంగా సరుకులకు ఎక్కడా లేని గిరాకీ పెరిగిపోయిందని నేటి పరిస్థితికిదే కారణమని భాష్యం చెబుతున్నారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు నిలకడగా తొమ్మిది శాతాన్ని దాటింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే (మూడు దశాబ్దాలుగా) రెండంకెల స్థాయి వృద్ధి సాధిస్తోందని మరిచిపోకూడదు.

మన పాలకులు కొన్ని ఆహార ఉత్పత్తులపై ఫార్వర్డ్ ట్రేడింగ్‌ను నిషేధించడం, దిగుమతి సుంకాలు తగ్గించడంతోనే సరిపెట్టారు. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసి ద్రవ్య పరమైన చర్యలే పరమ ఔషధం అన్నట్లుగా స్పందిస్తున్నారు. గిరాకీ సరఫరాల అంచనాల ఆధారంగానే ఫార్వర్డ్ ట్రేడింగ్‌లో రేపటి ధరలు పెరగడం, తగ్గడం ఉంటుంది. స్పెక్యులేషన్‌కు దిగుబడి క్షీణత తోడవడంతో ఎడాది కాలంగా అనేక ఆహార ఉత్పత్తుల ధరలు రెండంకెల స్థాయిలో నింపుకోవడానికి కావల్సిన ప్రతివస్తువు ధరలు భారీగా పెరిగాయి. పప్పు దినుసుల ధరలు అయితే 33 శాతానికి పైగా పెరిగాయి. ఇది పంటలు చేతికి వచ్చే కాలం, ఆహార ధాన్యాల ధరలు సహజంగా తగ్గుముఖం పట్టాలి. ఇప్పుడు కూడా దిగిరానంటున్నాయంటే లోపం ఎక్కడుంది. శుష్కప్రియులు, శూన్యహస్తాలు తప్ప ఆహార భద్రతకు తీసుకొన్న చర్యలు శూన్యం. ఫలితంగానే హరిత విప్లవంతో, దశాబ్దాల ప్రణాళికలలో సాధించిన ఆహార భద్రత ఎండమావిగా మిగిలిపోయింది. ఆరుగాలం శ్రమించే రైతుకు మద్దతు కరువయ్యింది. ఆహార ధాన్యాల దిగుబడిలో ఎదుగూ బొదుగూ లేకుంది. గత పదేళ్లలోను గోధుమలు, పప్పు ధాన్యాల దిగుబడులు స్తంభించిపోయాయి. ఇదే కాలంలో జనాభా 15 శాతానికి పైగా పెరిగింది. మళ్లీ దిగుమతులపై ఆధారపడాల్సిన దుస్థితి దాపురించింది. 2005తో పోలిస్తే గత ఎడాది ఆహార ధాన్యాల సమీకరణ 40 శాతం క్షీణించింది. భారత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ)ని ప్రహసన ప్రాయం చేయటంతో ఆహార మార్కెట్‌పై బహుళజాతి కార్పొరేట్ సంస్థల పట్టు బిగుస్తోంది. ఎఫ్.సి.ఐ. నిస్సహాయత, నిరాసక్తత కారణంగా దేశంలో గోధుమల నిల్వల శాతం పడిపోయి 700 లక్షల టన్నులకు పరిమితమయ్యాయి. కనీస మద్దతు ధర కంటే ఎంతో ఎక్కువ రేటు, దిగుమతి చేసుకోవాల్సివస్తోంది.

ప్రపంచంలోనే అత్యధికంగా గోధుమలు దిగుమతి చేసుకొనే దేశంగా మారిపోయింది. నిరుడు 60 లక్షల టన్నులున్న గోధుమ దిగుమతులు ఈ సంవత్సరం 80 లక్షల టన్నులకు చేరే అవకాశం ఉంది. నవంబర్ 2005లో ప్రజా పంపిణీ వ్యవస్థ (పి.డి.ఎస్.) కి 24 లక్షల టన్నుల గోధుమలు కేటాయించగా సంవత్సరం గడిచేసరికి మూడోవంతుకు పడిపోయింది. ఎఫ్.సి.ఐ. నిర్వాకం, పి.డి.ఎస్. నిస్తేజం కారణంగా, గ్రామీణుల పరిస్థితికి మూలం గ్రామాల్లోనే ఉంది. చేయుత కరువైన వ్యవసాయ రంగాన్ని విస్మరించి తాత్కాలిక చర్యలతో సరిపెడితే ధరల మంటలు ఇప్పట్లో చల్లారవు. బడుగు జీవుల కష్టాలు కడతేరవు. ఇప్పటికైనా పటిష్ఠమైన, దీర్ఘకాలిక వ్యూహంతో పాలకులు రంగంలోకి దిగి ఆర్థిక వ్యవస్థను చక్కబెట్టగలరని ఆశిద్దాం. ◆

(... 31వ పేజీ తరువాయి)

ఒక నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక నేటి గ్రామీణ మహిళల దుస్థితికి, దయనీయ పరిస్థితులకు అద్దం పట్టింది. సాంప్రదాయకంగా వ్యవసాయంలో అనుసరించే విజ్ఞానం, విత్తనాల భద్రత లాంటివి ఎలా స్త్రీల చేతుల్లోంచి బహుళజాతి సంస్థల గుప్పెట్లోకి వెళ్లాయో, జీవనాధారాలు ధ్వంసమైపోయాయో, ఉపాధి కరువై ఆకలి ఎలా పెరిగిపోయిందో స్పష్టం చేసింది. నిజానికి ఆహార భద్రత స్త్రీల మీదనే ఆధారపడి ఉంటుందని, విత్తనాలు భద్రపరచడం, వ్యవసాయ దిగుబడి, ఆహారాన్ని ప్రాసెస్ చేయడం, స్థానికంగా మార్కెటింగ్ చేయడం వంటి పనుల ద్వారా ఆహారభద్రత, ఆహార వైవిధ్యం, పంటల వైవిధ్యం, వాటికి స్త్రీలే కస్టోడియన్‌లని, అయితే పురుషాధిక్యత లాభాలే ధ్యేయంగా సాగే కార్పొరేట్ కల్చర్ స్త్రీలని అంచులకు నెట్టివేసిందని, ప్రభుత్వం తన విధానాలను మార్చుకోవాలని మరింత విధ్వంసం జరగకముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ నివేదిక స్పష్టం చేసింది.

ఈ విధంగా ప్రపంచీకరణ ప్రభావం వల్ల స్త్రీ జీవితాలు ఉక్కిరిబిక్కిరి అవుతూ ఉంటే ప్రభుత్వాలు స్త్రీలకు, రైతుల ఆత్మహత్యలవల్ల దారుణ పరిస్థితులు ఎదుర్కొంటున్న వారికి అందించే సాయం ఏమూలకీ సరిపోవట్లేదు. జయతీ ఘోష్ కమీషన్ సూచించినట్లుగా ప్రభుత్వ విధానాలు అమలు చేస్తే రైతుల సంక్షేమానికి, వ్యవసాయరంగం కోలుకోవడానికి అవకాశముంటుంది. రైతులతో చర్చించి వ్యాపార పంటల మీది నుండి వ్యవసాయ విధానాన్ని మళ్లించాలి. సాగునీరు, తాగునీటి సౌకర్యాన్ని, విద్యుత్తును సక్రమంగా అందించాలి. బహుళజాతి సంస్థల ప్రభావం వ్యవసాయరంగం మీద పడనీయకుండా ప్రజా, మహిళా సంఘాలు ప్రభుత్వాల మీద వత్తిడి తేవాలి. రైతుల కుటుంబాలకు, మహిళలకు అవగాహన కల్గించి, ఆత్మస్థైర్యాన్ని అందిస్తూ, చైతన్య సదస్సులు నిర్వహించాలి. మేధావులు ప్రభుత్వాలకు తగిన సూచనలందించాల్సి ఉంది. ప్రత్యేక ఆర్థిక మండలాల ఏర్పాటు పేరుతో ప్రభుత్వం వ్యవసాయ భూములను ఆక్రమించకుండా చూడాలి. కార్పొరేట్ వ్యవసాయ విధానాలకు స్వస్తి పలకాలి. మన విద్యా వ్యవస్థలో కూడా మార్పులు తీసుకరావాలి. మన దేశంలో పుష్కలంగా ఉన్న ప్రకృతి సహజ వనరులను, మానవ వనరులను వినియోగించుకొని, దేశాభివృద్ధికి తోడయ్యేలా, దేశ దారిద్ర్యాన్ని, నిరుద్యోగాన్ని నిర్మూలించే విధంగా శాస్త్రీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలి. ప్రాథమిక స్థాయినుండీ యూనివర్సిటీ స్థాయి వరకూ శాస్త్ర సాంకేతిక విద్య, వ్యవసాయ వ్యాపార రంగాలలో పురుషులతోపాటు స్త్రీలకు సమాన అవకాశాలు కల్పించాలి. సమాన పనికి సమాన వేతనం అందించడం ద్వారా, రైతుల, స్త్రీల ఆత్మహత్యలు, వేధింపులు, ఆకలి చావులు లేని సమాజం వైపు ఆత్మవిశ్వాసంతో మహిళలు ముందడుగు వేయడానికి అవకాశం దొరుకుతుంది. అంతేకాకుండా మహిళా, కార్మిక, కర్షక విముక్తికై జరిగే ఉద్యమాల్లో చైతన్యవంతులైన భాగస్వాములుగా పాల్గొని తమ హక్కుల సాధనకు కృషి చేయాలి. ◆

ప్రపంచీకరణను, ప్రైవేటీకరణను, సరళీకరణను, విదేశీ పెట్టుబడిని ఆహ్వానిస్తూ అమలుచేస్తున్న పాలక రాజకీయ పక్షాల స్వరూపాన్నీ, స్వభావాన్నీ చర్చిస్తున్నారు బి. సైదులు

ప్రజల పార్టీని గుర్తించడం ఎలా?

కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ పార్టీల సమీకరణాలు మారాల్సిన ఆవశ్యకత ఉందనే సూచనలు కనబడుతున్నాయి. వివిధ అంశాల పట్ల స్పష్టమైన విధానాలను ప్రకటించి ప్రచారం చేయాల్సిన ఆవశ్యకత కూడా ఉంది. కొత్తగా లోక్‌సత్తా పార్టీ ఏర్పడింది. కాసాని బి.సి. ఎజెండాతో మహాజన పార్టీని ప్రకటించారు. ఆ పేరుతో ఉ.సాంబశివరావు పార్టీని రిజిస్టర్ చేయించారు. కావున అది వివాదాస్పదంగా మారింది. ఆర్. కృష్ణయ్య కూడా పార్టీ స్థాపిస్తానంటున్నారు. ఇంకా కొందరు దళిత బహుజన వర్గాలకు చెందినవారు కూడా పార్టీ పెట్టాలని భావిస్తున్నారు. కాని సాధ్యపడడంలేదు. సి.పి.ఎం. థర్డ్ ఫ్రంట్ ప్రస్తావన ముందుకు తెస్తున్నది. అయితే పరిస్థితులు అనుకూలించకుండా పెట్టిన పార్టీలు నిలబడడం కూడా కష్టమే. పార్టీ పెట్టిన వారికీ, పెట్టాలనుకునే వారికీ కష్టపడకుండా ఫలితం పొందాలనే ఆశ ఉంది. నూతనంగా ఏర్పడబోయే పార్టీ అసమసమాజాన్ని కోరుకునేదైతే ప్రస్తుతం అస్థిత్వంలో ఉన్న బూర్జువా పార్టీలు తమ విలువను కోల్పోయి అవసాన దశలో ఉన్నప్పుడు ఇవి తెరమీదకు వచ్చే ప్రయత్నం చేస్తాయి. పార్టీ పెట్టాలనుకునేవారు ముందు ప్రజల మనోభావాలు అర్థం చేసుకోవాలి. ప్రజల మనోభావాలకు అనుగుణంగా పరిస్థితులను మార్చాలి. ప్రజల మనోభావాల ప్రకారం సమానత్వం కావాలని ఉంది. సమానత్వం అంటే సమసమాజం లేదా సోషలిజం. కావున సమానత్వానికి అవసరమైన అనుబంధ అంశాలను ప్రచారం చేయాలి.

ఇప్పుడున్న కాంగ్రెస్, బి.జె.పి., టి.డి.పి. లాంటి పార్టీలు సమానత్వం, సమసమాజం, సోషలిజం అనే మాటలను కూడా ప్రస్తావనకు తేవడం లేదు. అవి కమ్యూనిస్టుల పదాలని వాటిని అంటరానివిగా మార్చే ప్రయత్నం కూడా చేస్తున్నారు. రాజ్యాంగంలో రాసుకున్న సోషలిజంకు తిలోదకాలిచ్చే పనులు చేస్తున్నవి. కొత్తగా పెట్టే కొన్ని పార్టీలకు కులం మాత్రమే ఎజెండా అవుతోంది. జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామంటున్నారు. ఇది పాక్షికంగా సరియైనదే కాని ఇదే సంపూర్ణం కాదు. దీనికి అనుబంధంగా చాలా విషయాలు ఉన్నాయి. కులం పర్టికులర్ అంశం అయితే అనుబంధ విషయాలు యూనివర్సల్ అంశాలు అవుతాయి. మొదటి దశలో జనాభా ప్రాతిపదికన సీట్లు అనే అంశం సమాజాన్ని దిగ్భ్రమకు గురిచేయవచ్చును. కావున అనుబంధ విషయాలు బలహీనంగా కనబడతాయి. కాని కాలం గడిచే కొద్దీ బలహీనంగా భావించబడిన అనుబంధ విషయాలు వారి బలహీనతలుగా తెరమీదకు వస్తాయి. అందుకే అనుబంధ విషయాలను పూర్తిగా కాని పాక్షికంగా కాని వాయిదా వేయకూడదు.

ప్రపంచీకరణ ఒక అనుబంధ విషయం. పార్టీలు దీనిని సమర్థించడమో వ్యతిరేకించడమో, ప్రస్తావన తేకుండా ఉండడమో జరుగుతుంది. ప్రస్తావన తేకుండా ఉండడమంటే సమర్థించడమనే అర్థం. సమానత్వాన్ని కోరుకునే పార్టీ ఐతే ప్రపంచీకరణను వ్యతిరేకించాలి. ఎందుకు వ్యతిరేకించాలి? ప్రపంచీకరణ అంటే ఒక కంపెనీ తయారు చేసిన వస్తువులను ప్రపంచంలో ఎక్కడైనా అమ్ముకోవడానికి అవకాశం ఉండడం. సార్వభౌమాధికారం గల ఒక దేశ ప్రజలు తమ భౌతిక పరిసరాలకు లోబడి జీవించాలి. పాలకులు ప్రజలను ఆ విధంగా సమాయత్తం చేయాలి. 'భారత్ అంటీ అంటనట్లు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దూరంగా ఉండాలని ఎవరూ అనరు' అని సి.పి.ఎం. నాయకులు సీతారాం ఏచూరి అన్నారు. సార్వభౌమాధికారం కలిగిన దేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కచ్చితంగా అంటీ అంటనట్లే ఉండాలి. అలా లేకపోతే విదేశీ వస్తువులకు అలవాటు పడిన దేశం యొక్క సంపదలు విదేశాలకు తరలించబడతాయి. అప్పుడు దేశ ప్రజలకు ఆర్థిక సమస్యలు, తిండికొరత ఏర్పడతాయి. నిరుద్యోగం పెరుగుతుంది. ఫలితంగా ఘర్షణలు పెరుగుతాయి. నేరాలు పెరుగుతాయి. ప్రాణాలకు విలువ లేకుండా అవుతుంది. పోలీసు, మిలటరీల అవసరం పెరుగుతుంది. ఈ శాఖలతో నిరుద్యోగులను, పెరిగే ఘర్షణలను అదుపులో ఉంచడం జరుగుతుంది. ప్రపంచీకరణ ఏ మేరకు పెరిగితే పోలీసు, మిలటరీల అవసరం అంత పెరుగుతుంది. ఆకలిచావులు, ఆత్మహత్యలు, హత్యలు, అప్పులు, విడాకులు, టూరిజం (వ్యభిచారం) ఎయిడ్స్, ఎన్‌కౌంటర్లు, నిరుద్యోగం, రక్తపాతం పెరుగుతాయి. ఇవన్నీ ఆహార కొరత వలననే జరుగుతాయి. ప్రపంచీకరణ వలన ఆహారకొరత ఏర్పడుతుంది. కావున ప్రపంచీకరణను వ్యతిరేకించడం వలన సమానత్వానికి మార్గమేర్పడుతుంది. అసమానతను కోరుకునే వారు ప్రపంచీకరణను ఆహ్వానిస్తారు.

సమానత్వాన్ని కోరుకునే పార్టీలు ప్రైవేటీకరణను కూడా వ్యతిరేకించాలి. ప్రభుత్వీకరణను సమర్థించాలి. ఒక రకంగా చూస్తే గవర్నమెంట్ అనే పదానికి ప్రభుత్వం అని చేసిన అనువాదం సరైనది కాదు. ప్రభుత్వం అనే పదం ప్రభువు + త్వం అనే రెండు పదాల కలయికతో ఏర్పడింది. ప్రభువు అంటే రాజు, త్వం అంటే నీవు. ప్రభుత్వం

అంటే రాజుకూ నీకూ ఉండే సంబంధం అవుతుంది. కాని మనది ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్యం ప్రకారం గవర్నమెంట్ అనే పదానికి ప్రభుత్వం అనే పదం సరైన అనువాదం అవుతుందా? కాని ప్రభుత్వం అనే పదానికే అలవాటు పడి ఉన్నాం. "ప్రభుత్వరంగమంటే గుత్తాధిపత్యం ఉంటుంది. గుత్తాధిపత్యం ఎక్కడ ఉంటే అక్కడ దుబారా ఉంటుంది. వేధింపు ఉంటుంది. సేవలు నాసిరకంగా ఉంటాయి" అంటున్నారు లోక్‌సత్తా నాయకులు జయప్రకాశ్. ప్రభుత్వరంగం ఉన్న సమాజంలో భౌతికవాద భావజాలం ఉండాలి. బూర్జువా భావజాలానికి ప్రభుత్వరంగానికి పొసగదు. బూర్జువా భావజాలాన్ని ప్రోత్సహిస్తూ ప్రభుత్వంరంగాన్ని నెలకొల్పడం వలన వచ్చే ఫలితం దుబారా, వేధింపు, నాసికరం సేవలు. బూర్జువా భావజాలాన్ని నిరసించడానికి బదులు ప్రభుత్వరంగాన్ని వ్యతిరేకించడం సరైనది కాదు. సమానత్వాన్ని వ్యతిరేకించే పార్టీలను బూర్జువా పార్టీలంటాం. బూర్జువా పార్టీలు ప్రైవేటీకరణను సమర్థిస్తాయి. ప్రైవేటీకరణ పట్ల మౌనం వహించే పార్టీలు సైతం ప్రైవేటీకరణను సమర్థిస్తాయని అర్థం. ప్రైవేటీకరణ అంటే సంస్థలు, పరిశ్రమలు, సంపద ప్రభుత్వ ఆధీనంలో కాకుండా ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో ఉండునట్లు ప్రభుత్వంలో ఉన్నవారే ప్రయత్నించడం. క్రమంగా సంపద గల వారి అనుయాయులే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఉంటుంది. ఈ ప్రైవేటీకరణ కూడా రెండు రకాలుగా ఉంది. స్వదేశీ ప్రైవేటీకరణ, విదేశీ ప్రైవేటీకరణ. ఇందులో స్వదేశీ ప్రైవేటీకరణ కొంత మెరుగు. కాని స్వదేశీ ప్రైవేటీకరణలోనే విదేశీ ప్రైవేటీకరణకు పునాదులు ఏర్పడతాయి. స్వదేశీ ప్రైవేటీకరణను ఆపలేకపోతే విదేశీ ప్రైవేటీకరణను కూడా ఆపలేరు. కాలక్రమంలో ఆ రెండూ ఘర్షణ, ఐక్యతలతో మిత్ర వైరుధ్యంలోనే ఉంటాయి. ప్రైవేటీకరణ వలన కూడా సమాజంలో ఆహార కొరత ఏర్పడుతుంది. ఆహార కొరత ఏర్పడిందంటే సమానత్వం ఉండదని అర్థం. అందువల్ల ఒక పార్టీ సమానత్వాన్ని కోరుతున్నట్లైతే అది ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి.

సంస్కరణల విషయంలో సమానత్వాన్ని కోరే పార్టీలు జాగ్రత్త వహించాలి. సంస్కరణ అనేది రెండర్థాల పదం. సమాజంలో రెండర్థాల పదాలు చాలా ఉన్నాయి. అందుకే సంస్కరణ అనే పదాన్ని ఉపయోగించే సందర్భాన్ని గుర్తుంచుకోవాలి. సంస్కరణ అంటే ప్రస్తుతం సాగుతున్న విధానాన్ని మార్చడం అని. ప్రభుత్వీకరణ నుండి ప్రైవేటీకరణకు మారినా, ప్రైవేటీకరణ నుండి ప్రభుత్వీకరణకు మారినా సంస్కరణ అనే అంటారు. ఇప్పుడు ప్రభుత్వీకరణ నుండి ప్రైవేటీకరణకు మారుతోంది. ప్రైవేటీకరణ సమానత్వానికి వ్యతిరేకం. అందువల్ల ప్రస్తుత సంస్కరణలను వ్యతిరేకించాలి.

సమనత్వాన్ని కోరే పార్టీ సరళీకరణను కూడా వ్యతిరేకించాలి. సరళీకరణ అంటే ప్రైవేట్ సంస్థలకు, విదేశీ సంస్థలకు రాయితీలు ఇవ్వడం, సుంకాలు విధించకుండా ఉండడం. సరళీకరణ వలన విదేశీ వస్తువులు విపరీతంగా వస్తాయి. మన దగ్గర వస్తువుల కంటే నాణ్యంగా, తక్కువ ధరలోనూ దొరకవచ్చును. కస్టమర్‌కు లాభం జరుగుతుంది. కానీ మన సంపద మన హద్దులు దాటిపోవడం వలన పతనం మొదలవుతుంది. అందుకే సరళీకరణను వ్యతిరేకించగల చైతన్యం ప్రజలలో వచ్చేటట్లు సమానత్వాన్ని కోరే పార్టీలు ప్రయత్నించాలి.

సమానత్వాన్ని కోరే పార్టీలు విదేశీ పెట్టుబడులను దేశంలోకి రావడాన్ని వ్యతిరేకించాలి. కొందరు కమ్యూనిస్టులు రష్యా చైనా పెట్టుబడులను ఆహ్వానిస్తూ అమెరికా, ఇంగ్లాండ్ పెట్టుబడులను వ్యతిరేకిస్తారు. చైనా నిజంగా కమ్యూనిస్టు దేశమైతే ఇతర సార్వభౌమాధికార దేశాలలో పెట్టుబడులు పెట్టడాన్ని విరమించుకోవాలి. అమెరికా పెట్టుబడి వలన ఈ దేశానికి ఏ నష్టం జరుగుతుందో, చైనా పెట్టుబడి వలన కూడా అదే నష్టం జరుగుతుంది. అది చైనాలో ఉన్నంత వరకు అభివృద్ధికరమైనది. కారణం అది ప్రభుత్వ పెట్టుబడి. అది పెట్టుబడిగా చైనా సరిహద్దు దాటితే దాని స్వభావం విధ్వంసకరంగా మారుతుంది. అమెరికా పెట్టుబడి అమెరికా ప్రభుత్వ పెట్టుబడి కాదు. అమెరికాలోని బహుళజాతి కంపెనీల పెట్టుబడి. ఆ పెట్టుబడి అమెరికాలో ఎలాంటి విధ్వంసాన్ని సృష్టిస్తుందో, ఇతర దేశాలలోనూ అలాంటి విధ్వంసాన్నే సృష్టిస్తుంది. అందుకే అన్ని విదేశీ పెట్టుబడులను వ్యతిరకించే పార్టీ మాత్రమే ప్రజలకు సమానత్వాన్ని ఇవ్వగలదు.

ఇండియాలో కులసమస్య పర్టికులర్ అంశం. కావున పార్టీలు కుల నిర్మూలన కొరకు ప్రయత్నిస్తామని ప్రకటించుకోవాలి. కులం పట్ల మౌనం వహించడం అంటే కులం ఉండాలని కోరుకోవడమని అర్థం. కులం వలన అసమానతలు ఏర్పడతాయి. ఘర్షణలు వస్తాయి. ఇవి సమానత్వానికి ఆటంకం అవుతాయి. కులాలు ఎలా పుట్టాయో అంబేద్కర్ విధానంలో ప్రజలకు వివరించాలి. దాని వలన సమాజ భావజాలంలో మార్పు వస్తుంది. ప్రస్తుతం జనాభా ప్రాతిపదికన చట్ట సభలలో సీట్లను కేటాయించాలి.

సమానత్వాన్ని కాంక్షించే పార్టీ స్త్రీ పురుష సమానత్వానికి హామీ ఇవ్వాలి. స్త్రీలకు ఆస్తి హక్కు కల్పించే చర్యలు చేపడతామని ప్రకటించాలి. చట్ట సభలలో జనాభా ప్రాతిపదికన కేటాయించిన సీట్లలో సగం సీట్లను స్త్రీలకు కేటాయించాలి.

వ్యక్తిగత ఆస్తి విధానం, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ జరిగే సమాజంలో తెలంగాణలాంటి, వర్గీకరణలాంటి నినాదాల్ని సమర్థించవలసి ఉంటుంది. ఎందుకంటే అలాంటి సమాజంలో దేశసంపదలు విదేశాలకు చేరడం ఉంటుంది. ఉన్న సంపద బలవంతులకు చేరుతుంది. కావున సమాజంలో ఆహార కొరత ఏర్పడి అలాంటి నినాదాలు ముందుకు వస్తాయి. మైదాన ప్రాంతాలలో స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్‌లో ఓడినవారు బ్రతుకుదెరువు కొరకు ఏజెన్సీకి వలసవెళతారు. వీరు అక్కడ నిలదొక్కుకొని అక్కడ వారిని ఓడించగలరు. తరువాత ఏజెన్సీ ప్రజలు మైదాన ప్రాతం నుండి వచ్చిన వారిని వెళ్లగొట్టాలని డిమాండ్ చేస్తారు. మొత్తం ప్రక్రియను అర్థం కానివ్వకుండా మానసిక స్తంభనకు గురిచేసే బూర్జువా భావజాలం కారణంగా – ఏజెన్సీ వారికి మైదాన ప్రాంతం నుండి వలస వచ్చినవారు, తెలంగాణ వారికి ఆంధ్రవారు, మాదిగలకు మాలలు తక్షణ శతృవులుగా కన్పిస్తారు. మైదాన ప్రాంతం వారు, ఆంధ్రప్రాంతం వారు, మాలలు సమానత్వం కొరకు జరిగే పోరాటాలలో గతంలోనే భాగస్వాములైనట్లైతే వలస పోవాల్సిన పరిస్థితులు రాకపోయేవి. సమానత్వం ఏ మేరకు ఏర్పడితే ఘర్షణలు ఆ మేరకు తగ్గుతాయి. కావున వలస విధానాన్ని నిరుత్సాహపరచాలి.

(తరువాయి 43వ పేజీలో...)

ఏర్పడబోయే తెలంగాణలో ఆదివాసి, దళిత, బహుజన, ముస్లిం ప్రజానీకానికి ఒనగూరే సామాజిక న్యాయం ఎంత అని ప్రశ్నిస్తున్నారు నాగం కుమారస్వామి

తెలంగాణ - అంబేద్కర్

రాజనీతి శాస్త్ర పితామహుడైన అరిస్టాటిల్ క్రీ.పూ. 4వ శతాబ్దంలోనే 'ఎక్కడైతే ఆర్థిక అసమానతలు, సామాజిక అణచివేత, సాంస్కృతిక విపరీత వైరుధ్యాలు, రాజకీయ అధికార ఏకస్వామ్యాలూ బలంగా ఉంటాయో అక్కడ ప్రజా తిరుగుబాట్లు విప్లవాల రూపాల్లో బయటకు వస్తాయని' వివరించాడు. నేటికీ ప్రపంచంలో జరుగుతున్న ప్రతి సామాజిక, ఆర్థిక మార్పులకు పై వాటిలో ఏదో ఒకటి బలమైన కారణమై ఉంటుంది. ప్రపంచంలోనే ఒక విభిన్న సామాజిక పునాదులు కలిగి ఉన్న మనదేశంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నేటికీ ప్రతినిత్యం అనేక రాజకీయ సంక్షోభాలు జరుగుతున్నాయి. భౌగోళికంగా ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భాగంగా ఉన్న తెలంగాణ ప్రాంతానికి ప్రపంచ సామాజిక, రాజకీయ ప్రజాపోరాటాల చరిత్రలోనే ఒక ప్రత్యేకత ఉంది. నిజాం వ్యతిరేక పోరాటాలు మొదలుకొని నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాల వరకూ ప్రజాపోరాట శక్తులకు ఉద్యమాల ఉగ్గుపాలను రంగరించి పోసింది. డా.బి.ఆర్. అంబేద్కర్ విదర్భ లాంటి చిన్న రాష్ట్రాల ఏర్పాటు అనే ప్రస్తావన వచ్చినప్పుడు చిన్న రాష్ట్రాలు అభివృద్ధికీ, సామాజిక న్యాయ సాధనకీ వెసులుబాటుగా ఉంటాయని స్పష్టం చేసారు.

2001లో తెలంగాణ రాష్ట్ర సమితి (టి.ఆర్.ఎస్.) భౌగోళిక తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక రాజకీయ లక్ష్యంగా ఏర్పడినప్పటినుండీ, తెలంగాణను ఒక ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పరచటం ఎందుకు? అభివృద్ధి చేస్తే సరిపోదా? అని ఆంధ్ర, రాయలసీమ ప్రజా ప్రతినిధులు మాట్లాడుతున్నారు. తెలంగాణలోని పది జిల్లాల నాలుగు కోట్ల ప్రజలు మాత్రం తెలంగాణను ఎట్టి పరిస్థితులలోనైనా ప్రత్యేక రాష్ట్రంగా చూడాలని ముక్తకంఠంతో నినదిస్తున్నారు. అయితే ఇందులో వేళ్లమీద లెక్కించగల, కొంతమంది స్వార్థపర తెలంగాణ రాష్ట్ర వ్యతిరేకులుకు మినహాయింపు ఉంది సుమా. ఈ తరుణంలోనే తెలంగాణ ప్రాంత అణగారిన ప్రజలనుంచి కొన్ని మౌలిక ప్రశ్నలు బయటకు వస్తున్నాయి. అవి : 1) తెలంగాణలోని పది జిల్లాలతో ఒక భౌగోళిక రాష్ట్రంగా ఏర్పడితే సరిపోతుందా? 2) తెలంగాణ ప్రాంత ప్రజలలో ఉన్న సామాజిక ఆర్థిక, రాజకీయపరమైన అసమానతల మాటేమిటి? ఇంకా స్పష్టంగా చెప్పాలంటే తెలంగాణ ప్రాంత ఆదివాసీ, దళిత బహుజనులపై వయస్సు రీత్యా చిన్నా, పెద్దా తారతమ్యంలేకుండా బ్రాహ్మణ, రెడ్డి, వెలమలు పాటిస్తున్న దొర, పటేళ్ల సామాజిక పెత్తందారీ విధానం తొలిగిపోతుందా? 3) నిజాం కాలం నుంచి నేటి తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ వరకూ ప్రజా ఉద్యమాలకు ముడిసరుకుగా ఇంకెన్నాళ్లు ఆదివాసీ, దళిత బహుజన ప్రజలు ఉపయోగపడాలి? 4) తెలంగాణ ప్రాంత జనాభాలో 11 శాతం ఉన్న ముస్లింప్రజల స్థానం ఏమిటి? వంటి అనేక అంశాలు స్థూలంగానైనా చర్చకు వస్తున్నాయి. ఇలాంటి ప్రశ్నలకు ప్రస్తుతం టి.ఆర్.ఎస్. పార్టీ అధినాయకత్వం సమాధానం ఇవ్వనవసరం లేదన్నట్లు వ్యవహరిస్తోంది. అట్లాగే టి.ఆర్.ఎస్. పార్టీని, ఇతర తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా పనిచేస్తున్న సంస్థలను సైద్ధాంతికంగా నడుపుతున్న అగ్రకుల మేధావులైతే ఏకంగా సామాజికాంశాల ప్రస్తావన తెలంగాణ రాష్ట్ర సాధనకే ముప్పు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. మరీ విచిత్రమేమిటంటే తెలంగాణ పల్లె ప్రాంతాలలో తమ చిన్నతనం నుంచీ శారీరక, మానసిక బాధలను భరించిన ఆదివాసీ, దళిత బహుజన మేధావులు అసలు కులం, మతం వంటి వాటిని ఇప్పుడే మాట్లాడితే ఎట్లా అని సంశయపడుతున్నారు. పై విధంగా ఆలోచనలు చేస్తున్న ఆదివాసీ, దళిత బహుజన, అగ్రకుల మేధావులను తాత్కాలిక ప్రయోజనవాదులుగా భావించవలసి వస్తుంది. అంతే కాకుండా మొత్తం తెలంగాణ ప్రాంతంలో గత కొన్ని శతాబ్దాల నుంచి జరుగుతున్న సామాజిక, రాజకీయ ఉద్యమాల పునాది అంశాలను పరిశీలించడంలో విశాలదృక్పథం కనబరచటం లేదని అనిపిస్తుంది.

దాదాపు కొన్ని వందల సంవత్సరాల కాలం పాటు నేటి తెలంగాణ ప్రాంతాన్ని హైదరాబాద్ రాష్ట్రంగా ముస్లింలైన కుతుబ్‌షాహి, నిజాం ప్రభువులు పరిపాలిస్తుండేవారు. ఈ కాలంలో తెలంగాణ రాజకీయ, ఆర్థిక వ్యవస్థ పూర్తిగా జమీందారీ, జాగిర్దారీ, ఇనాందారీ, దేశ్‌ముఖ్, దొర, పటేల్ పట్వారీ విధానాలతో ముడిపడి ఉండేది. వీరు సంఖ్యాపరంగా అల్పులైన బ్రాహ్మణ, రెడ్డి, వెలమ కులాలకు చెందిన ఆర్థికంగా బలవంతులైన కొన్ని కుటుంబాలవారే. నిజాంలు ముస్లిం మతస్థులైనందున మొదటినుంచి బీద, మధ్యతరగతి బ్రాహ్మణ, వైశ్య కులాల మెజారిటీ ప్రజలు అసంతృప్తిగా ఉండేవారు. దానికి ప్రధాన కారణం తమకు, తమ పూర్వీకులకు లభించిన సామాజిక గౌరవం లభించకపోవడమే. నిజాం పాలన చివరి రోజులలో రజాకారులనే ప్రైవేట్ సైన్యాన్ని నిజాం ప్రభువులు ప్రోత్సహించి తెలంగాణ పల్లెలు మొదలుకొని పట్టణాలు అనే తేడా లేకుండా లూటీలకు, ఆర్థిక దోపిడీలకు ఒడికట్టారు. ఒకరకంగా తెలంగాణ ప్రాంతంలో అల్లకల్లోలం సృష్టించారు. ఆదివాసీలు ఊరికి దూరంగా కొండల్లో జీవించసాగారు. పల్లెల్లో మాల, మాదిగలు వెట్టిచాకిరి చేసే

మట్టి మనుషులుగా మారి మాన, ప్రాణాలను తాకట్టుపెట్టి బతుకుతుండేవారు. బహుజన కులాలైన వడ్ల, కమ్మరులు ఉత్త పుణ్యానికే వ్యవసాయ పనిముట్లను భూస్వాములకు తయారు చేసి ఇచ్చేవారు. చాకలి, మంగలి కులాలవారైతే నిరంతరం పశువులవలె పొద్దు పొడుపు నుండి ప్రొద్దుగూకే వరకు దొర, పటేళ్ల గడీలలో శ్రమించేవారు. ఇలా శ్రమించేటప్పుడు ఫలితాన్నడిగే ధైర్యంలేక ప్రజలు "బతికుంటే బలుసాకు తిని బతకవచ్చని' అర్థాకలితో జీవిస్తుండేవారు. ఇదేకాలంలో మధ్యతరగతి రెడ్డి, వెలమ కుటుంబాలలో విద్యావంతులు బయటకు వచ్చారు. డా. బి.ఆర్. అంబేద్కర్ అన్నట్లు మన దేశంలో పౌరులకు కులం పునాదిగానే సామాజిక, ఆర్థిక, రాజకీయ గుర్తింపోస్తుంది. అందుకెనేమో బహుశా తెలంగాణ ప్రాంత మాల, మాదిగ, చాకలి, మంగలి వంటి కులాలవారు వెట్టిచాకిరి వ్యవస్థతో దుర్భరజీవితాలు గడిపేవారు. అప్పటికే మార్క్సిస్టు సిద్ధాంతాలకు దగ్గరైన తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ నాయకులు (రెడ్డి, వెలమ, బ్రాహ్మణ కులాలవారే) నిజాం నిరంకుశ పాలనకు, వెట్టిచాకిరీ విధానానికి, భూస్వామ్య పెత్తందారీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలంగాణ రైతు కూలీ సాయుధపోరాటాలు చేసారు. నిజాం పాలనకు చరమగీతం పాడారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం నిజాం పాలన అనంతరం జరగవలసిన సామాజిక, ఆర్థిక పోరాటాలను కొనసాగించకుండా ఉద్యమాలను వదిలి పార్లమెంటరీ పంథాను పట్టింది. ఫలితంగా కులం పునాదులుగా ఉన్న సామాజిక అణచివేత, ఆర్థిక దోపిడీ, రాజకీయ వెనుకబాటుతనం అట్లాగే పదిలంగా ఉన్నాయి. వందలకొద్దీ ఆదివాసీ, దళిత బహుజన సామాన్య ప్రజలు ప్రాణత్యాగాలు చేసి రెడ్డి, వెలమ కులాలకు భూమిపై అధికారాలను, రాజకీయ వెసులుబాటును కల్పించారు.

1950లో రాజ్యాంగపరంగా భారతదేశం స్వాతంత్ర్య దేశంగా అవతరించింది. 1950-56 వరకు దేశవ్యాప్తంగా భాషా ప్రాతిపదికగా రాష్ట్రాల ఏర్పాటు అనే తంతు జరిగింది. ఆ క్రమంలోనే 1956లో ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలు తెలుగు మాట్లాడే వారిగా గుర్తించి 'పెద్దమనుషుల ఒప్పందం' ప్రకారం ఆంధ్రప్రదేశ్‌గా మన రాష్ట్రం ఏర్పడింది. అది మొదలు ఆంధ్ర పాలకవర్గాలు విద్య, వైద్య, ఉద్యోగ, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలలో తెలంగాణ ప్రజలను దోపిడీ చేయడం ప్రారంభించారు. మరీ ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు జీవనాధారమైన వ్యవసాయరంగ పునాదులైన చెరువులను, కుంటలను నిర్వీర్యం చేయడం. గోదావరి, నిజాంసాగర్, శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్ పరీవాహక ప్రాంతాలలో ఆంధ్రవారే 60 నుంచి 80 శాతం భూమిపై ఆధిపత్యం కలిగే పరిస్థితి ఏర్పడింది. అదే కాలంలో ఆంధ్రపాలక, భూయాజమాన్యం ప్రవేశపెట్టిన యాంత్రిక వ్యవసాయం వల్ల తెలంగాణ ప్రాంత చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు అనేక ఆర్థిక ఇబ్బందులకు లోనయ్యారు. ఇలాంటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను నిరంతరం గమనిస్తూనే ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు 1969 నుంచి 1972 వరకు ప్రత్యేక తెలంగాణ నినాదంతో మహోన్నత విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించారు. ఈ ఉద్యమానికి సర్వారెడ్డి, లక్ష్మారెడ్డి, మదన్‌మోహన్ (వెలమ) వంటి విద్యార్థి నాయకులు నాయకత్వం వహించారు. 1969లో వేలాదిమంది విద్యార్థులు తెలంగాణలో ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం ఉద్యమించినప్పుడు కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం జరిపిన పోలీస్ కాల్పులలో దాదాపు 350 పైగా విద్యార్థులు అమరులైనారు. ఈ ఉద్యమంలో మెజార్టీగా చరిత్రకెక్కిన దళిత బహుజన విద్యార్థులెందరో త్యాగాలు చేసారు. చివరగా ఉద్యమం చెన్నారెడ్డి పుణ్యమాని నీరుగారిపోయింది. మొత్తంగా ఇక్కడ ఒక విషయం చాలా స్పష్టం, తెలంగాణ రైతు కూలీ సాయుధ పోరాటంలో కానీ, 1969 తెలంగాణ విద్యార్థి పోరాటంలో ఆదివాసీ దళిత బహుజనులు సామాజిక, ఆర్థిక సమానత్వం ఆశించి పోరాటలలో త్యాగాలు చేసారు. ఉద్యమ ఫలితాలు మాత్రం రెడ్డి, వెలమలు పొందారు. అందుకే సామాజిక పోరాటాలు మరో ప్రజా ఉద్యమానికి తెరతీసాయి.

తెలంగాణ ప్రాంత ఉద్యమాల చరిత్రపుటల్లో అత్యంత ప్రధానమైనది ఇక్కడి నక్సల్బరీ ఉద్యమం. 'భూమి కోసం, భుక్తి కోసం, బానిస బతుకుల విముక్తికోసం' అనే మార్క్సిస్టు సిద్ధాంతాల ప్రాతిపదికగా కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, ఆదిలాబాద్‌లలో నక్సల్బరీ ఉద్యమం 1970-80 ప్రాంతాలలో ప్రజాపోరాటాలను ఉధృతంగా జరిపింది. ఈ పోరాటాల ఫలితంగా భూస్వాములు దళిత బహుజనులపై కొనసాగిస్తున్న సామాజిక దోపిడీకి తెరపడింది. ప్రభుత్వాలు మాత్రం భూసంస్కరణ చట్టాల పేరిట 'ల్యాండ్ టు ద టెనెంట్' (దున్న గలిగే వారికే భూమి) అని మిగులు భూములను పల్లె ప్రాంతాలలో ఉన్న రెడ్డి, వెలమ రైతులకు అధికారికంగా భూ పట్టాలను ఇచ్చింది. ఇది నక్సల్బరీ 'ల్యాండ్ టు ద టిల్లర్' (దున్నే వారికే భూమి) అనే ప్రాథమిక సూత్రానికే వ్యతిరేకమైంది. అందుకే నేటికీ తెలంగాణలో నక్సల్బరీ ఉద్యమం కొనసాగుతోంది. దీనికి భూమిలేని ఆదివాసీ, దళిత బహుజన ప్రజానీకం బాసటగా నిలుస్తున్నారు. ఇప్పటికీ ప్రస్తుత మావోయిస్టు పార్టీ భూపంపిణీలో అసమానతలకు, మనుషుల మధ్య మానవీయ విలువలు తరిగిపోవడానికి కుల వ్యవస్థే ప్రధానమని బహిరంగంగా ప్రకటించలేదు. ఈ ప్రాంతంలో ఉద్భవించిన నిజాం వ్యతిరేక పోరాటాలకూ, 1969 విద్యార్థి ఉద్యమాలకూ, నక్సలైట్ ఉద్యమం కొనసాగింపుకూ కులవ్యవస్థే ప్రధాన కారణం. ఎందుకంటే అంబేద్కర్ అన్నట్లు భారత సమాజం వర్గ - కుల స్వభావం కలది. అందుకే నేటి తెలంగాణ రాష్ట్ర సమితి లేక ఇతర తెలంగాణ సంఘాలు, సంస్థలు రావడానికి పైన పేర్కొన్న ఉద్యమాలు తాత్కాలిక ప్రయోజనాలతోనే ముగిసిపోవడమే బలమైన కారణం. అందుకే కేవలం తెలంగాణ రాష్ట్ర సాధన అంతిమ విజయమని టి.ఆర్.ఎస్. వంటి రాజకీయపార్టీ నాయకులుగానీ, ఉద్యమ వ్యూహ రచనలు చేస్తున్న రెడ్డి, వెలమ, బ్రాహ్మణ మేధావులుకానీ ప్రవర్తిస్తే రాబోవు కాలంలో చరిత్రలో తప్పుచేసిన దోషులుగా మిగిలిపోతారు. ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల మేధావులుగా ఉన్న దళిత బహుజనులు 'నిమ్మకు నీరెత్తినట్లు'గా తెలంగాణ ఉద్యమంలో సామాజిక కోణాన్ని ప్రశ్నించకపోవటం క్షమించరాని సామాజిక నేరమవుతుంది. ఎందుకంటే రాబోవు కాలంలో తెలంగాణ అంశంపై రాజకీయ, సామాజిక పోరాటాలు చేస్తున్న వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు ఉద్యమాల ద్వారానే తెలంగాణ రాష్ట్రం సాధ్యమని పిలుపునివ్వవచ్చు. అప్పుడు సామాజిక శాస్త్రాలను అభ్యసిస్తున్న ఆదివాసీ, దళిత బహుజన విద్యార్థులు, గ్రామీణ ప్రజలు రోడ్లెక్కే పరిస్థితి రావచ్చు. ప్రాణాలు తృణప్రాయంగా అర్పించవచ్చు. ఇంకెన్నాళ్లు ఉద్యమ ఫలితాలను వాగ్దానం చేయకుండా ఈ మూగజీవులు త్యాగాలవరంపర

కొనసాగించాలి? ఇక్కడే ఒక్కసారి తెలంగాణ అగ్రకుల, ఆదివాసీ, దళిత బహుజన మేధావులు, రాజకీయ నాయకులు, విద్యార్థులు మన దేశ స్వాతంత్ర్య పోరాట కాలంలో అంబేద్కర్ ఇచ్చిన ఆలోచనలను పునః పరిశీలించవలసిన అవసరం ఉంది. గాంధీ వంటి నాయకులు బ్రిటిష్ వలస వ్యతిరేక పోరాటాలే స్వతంత్ర్యపోరాటం అని రాజకీయ స్వేచ్ఛా నినాదాలతో స్వాతంత్ర్యోద్యమం నడిపారు. మనదేశంలో కొన్ని వేల సంవత్సరాలుగా సాంఘిక అణచివేతకు, ఆర్థిక దోపిడీకి, రాజకీయ అంటరానితనానికి గురవుతున్న ఆదివాసీ, దళిత బహుజన ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్న సామాజిక, సాంస్కృతిక అంశాలను కూడా స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా చూడాలని ఉద్యమించారు. కాంగ్రెస్ నాయకులు మాత్రం ముందయితే బ్రిటిష్ వలస పాలనను అంతం చేద్దామని, ఆ తరువాతే సామాజికాంశాలను పరిశీలిద్దామని దాటవేసారు. దాని ఫలితంగా బ్రిటిష్ వలస పాలన అంతమైనప్పటికీ తెలంగాణ వంటి అనేక అంశాలు నేడు దేశ సమగ్రతను ప్రశ్నిస్తున్నాయి.

మొత్తంగా తెలంగాణ ప్రాంత ప్రజా ఉద్యమాలైన నిజాం వ్యతిరేక పోరాటం మొదలుకొని, నేటి తెలంగాణ రాష్ట్ర సమితి వరకూ ప్రపంచ ఉద్యమ చరిత్రలోనే తమ ప్రత్యేకతను చాటుతున్నాయి. అయితే తెలంగాణ ఉద్యమాలన్నిటిలో మెజారిటీగా ఆదివాసీ, దళిత బహుజన ప్రజలు ఉవ్వెత్తున పాల్గొంటున్నారు. దానికి గల కారణం తమ కులాలకు సామాజిక న్యాయం జరుగుతుందని ప్రగాఢ విశ్వాసం కలిగి, రాబోవు కాలంలో తెలంగాణ అభివృద్ధి చెందితే ఆదివాసీ, దళిత బహుజన ప్రజానీకం అభివృద్ధి చెందుతారని భావించడమే. తెలంగాణ ప్రాంతంలో తిష్ఠవేసిన ఆంధ్రపాలకుల దౌర్జన్యాలకు చరమగీతం పాడాలంటే తప్పకుండా తెలంగాణ ప్రాంత ఆదివాసీ, దళిత బహుజనులు ప్రజా ఉద్యమాలు చేయవలసిందే. ఉద్యమాలు చేస్తూనే రాబోయే కాలంలో ఉద్యమ ఫలితాలు ప్రజలందరికీ సమానత్వ సూత్రం ప్రకారం అందే విధంగా ఉండాలనే సామాజిక కోణాన్ని ఉద్యమంలో భాగం చేయాల్సిందే. అలా చేయని పక్షంలో ఆదివాసీ, దళిత బహుజన ప్రజానీకం చివరికి రిక్తహస్తాలతో మిగిలిపోతారు. త్యాగాలకు గుర్తింపుండదు. ప్రజా ఉద్యమాల ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ రాజకీయాధికారం మాత్రం ఆంధ్ర రెడ్డి, కమ్మల చేతుల్లో నుంచి, తెలంగాణ రెడ్డి, వెలమల చేతుల్లోకి మారుతుంది. అయితే ప్రజా ఉద్యమాలే సామాజిక సమస్యలకు పరిష్కారమని గుర్తెరిగిన ఆదివాసీ, దళిత బహుజన ప్రజలు మరో సామాజిక ఉద్యమాన్ని తప్పక చేపడతారు సుమా! ◆

(... 40వ పేజీ తరువాయి)

ప్రజలకు సమానత్వాన్ని కోరే పార్టీ భూసంస్కరణలు అమలు జరుపుతామని ప్రకటించాలి. సమాజం మొత్తంలో ప్రభుత్వ పరిశ్రమలు, సంస్థలను ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించాలి.

సమాజంలో ప్రభుత్వ ఆధీనంలో మాత్రమే నడిచే రెసిడెన్షియల్, సెమి రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసి అందరికీ ఉచిత విద్యను అందిస్తామని ప్రకటించాలి. దీని వలన కులసమస్య అంతరించే అవకాశాలు కూడా పెరుగుతాయి. అందరికీ ఒకే రకమైన పరిస్థితులు కల్పించడం వలన వివాహాల విషయంలో కులం అడ్డురాదు. వారివారి ప్రజ్ఞ ఆధారంగా వారికి పనులు, ఉద్యోగాలు కేటాయించవచ్చును.

సమానత్వాన్ని కాంక్షించే పార్టీ ప్రభుత్వ ఆసుపత్రులను మాత్రమే కొనసాగిస్తమని ప్రకటించాలి. దాని వలన ప్రజలు డబ్బు లేక జబ్బు వలన చనిపోతామేమోననే భయం లేకుండా ఉంటారు.

సమానత్వాన్ని కోరే పార్టీ మద్యపానం, ధూమపానం విషయంలో వాటిని క్రమంగా పూర్తిస్థాయిలో తగ్గిస్తామని ప్రకటించాలి. మద్యపానం ప్రవేశపెట్టడంలో వేదకాలం నుండీ వస్తున్న దురుద్దేశాలేమిటో ప్రజలకు వివరించాలి. ప్రజలలో మంత్రాలు, చేతబడులు, మూఢనమ్మకాలపై గల భ్రమలను తొలగించే ప్రయత్నాలు చేయాలి. మంత్రాలు, చేతబడులపై నమ్మకముండే సమాజంలో సమానత్వం ఏర్పడే అవకాశాలు ఉండవు.

ప్రధానమైనది అన్నింటికంటే ముందు పరిగణనకు తీసుకోవలసింది తాత్వికపునాది. సమానత్వాన్ని కోరే పార్టీలు జీవుల పుట్టుకకు మూలం మట్టి అని ప్రచారం చేయాలి. బూర్జువా పార్టీలు మతం ద్వారా జీవుల పుట్టుకకు మూలం దేవుడని ప్రచారం చేస్తున్నాయి. సమానత్వాన్ని కోరే వారు తమ తాత్విక పునాదిని ప్రచారం చేయకుండా నిలదొక్కుకోలేరు. మట్టిని తాత్విక పునాదిగా అంగీకరించని పార్టీ సమానత్వానికి వ్యతిరేకం. సమానత్వ విషయాలన్నింటిని ఆమోదిస్తూ భౌతిక వాద తాత్విక పునాదిని విస్మరిస్తే దాని ప్రయాణం బూర్జువా విధానంలోకి వెళ్లడమే అవుతుంది.

ఓట్ల సమయంలో కేవలం కుల ఎజెండాతోనో, మరో ఎజెండాతోనో ఎన్నికల రంగంలోకి దిగడం వలన ప్రయోజనం ఉండదు. ఎన్నికల్లో అన్ని సీట్లకు పోటీ చేయడం అటుంచి పార్టీగా నిలదొక్కుకోవడం కూడా సాధ్యపడదు. ఎవరు ఆధిపత్యం వహించాలనే విషయమే వారిని సమైక్యంగా ఉండనీయదు. దీనికి కారణం సమానత్వం తీసుకురావడానికి ఏ విషయాలను ప్రచారం చేయాలో, ఏ విషయాలను సంశ్లేషణ చేయాలో తెలియకపోవడం. భౌతికవాద భావజాలమేదో గుర్తించకపోవడం. యథారాజా తథాప్రజ, యథాప్రజా తథారాజ అనేవి ఒక దానిని మరొకటి ప్రభావితం చేసుకుంటాయి. అందుకే సమానత్వ అంశాలను, భావజాలాన్ని ప్రచారం చేయకపోతే సమాజానికి మరొక కొత్త పార్టీ అవసరం లేదు. వాటిని చిత్తశుద్ధిగా ప్రచారం చేస్తే చిక్కురొక్కురుగా ఉన్న నాయకులు, పార్టీలు ఏకమయ్యే అవకాశం నూటికినూరు పాళ్లు ఉంటుంది. ఏకంకాలేక పోయారంటే వారి భావజాలాన్ని శంకించవలసిందే. ◆

వీక్షణంకు ఉత్తరాలు రాసేవాళ్లు, మనీఆర్డర్లు పంపేవాళ్లు తమ వివరాలను పూర్తిగా రాయవలసిందిగా కోరుతున్నాం. అలాంటి వివరాలు లేనందువల్ల ఉత్తరాలకు జవాబు రాయడంగాని, మనీ ఆర్డర్ల మేరకు పుస్తకాలు, పత్రికలు పంపడం గాని వీలు కావడం లేదు.

కాత్యాయనీ విద్మహే, తోట జ్యోతి రాణి రాసిన 'ప్రపంచీకరణ పరిణామాలు, ప్రభావాలు - మహిళల జీవితం' అనే పుస్తకంలో స్త్రీల దృక్పథం నుండి సాహిత్యం ద్వారా ప్రపంచీకరణను చూసే పద్ధతి గురించి ఆర్.ఎస్. రావు ముందుమాట

శ్రమ, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్

ముందుగా ఒక మాట. విశ్వవిద్యాలయాలనేవి ఇంతవరకూ మానవ పరిశోధన ద్వారా వచ్చిన జ్ఞానాన్ని ప్రసారం చేసే కేంద్రాలుగా, జ్ఞానసమూపార్జన చేసే పద్ధతులను తయారీ చేసే కేంద్రాలుగా, ఆ పద్ధతుల ద్వారా కొత్త జ్ఞానాన్ని వెలికి తీసే వ్యవస్థలుగా ఉంటూ వచ్చాయి. ఈ మూడు ప్రక్రియలు ఉన్న విశ్వవిద్యాలయాలు సమాజానికి అత్యవసరమైన అంగంగా ప్రసిద్ధి చెందుతాయి. మన రాష్ట్రానికి వస్తే, కాకతీయ విశ్వవిద్యాలయం, అందునా సామాజిక శాస్త్ర విభాగానికి ఒక పెద్దపీట వెయ్యాలి. అధ్యయన పద్ధతులు, తద్వారా సమాజాన్ని అధ్యయనం చేసి, ఆ జ్ఞానాన్ని ప్రజల భాషలో ప్రజలకందించే క్రమం గణనీయమైనది. ఈ ప్రక్రియలో ప్రముఖ స్థానంలో తెలుగు విభాగంలో ఆచార్యులు కాత్యాయని విద్మహే, ఆర్థిక శాస్త్ర విభాగంలో తోట జ్యోతిరాణి ఉంటారు. ప్రస్తుత పరిస్థితులలో విశ్వవిద్యాలయాల ఉనికినీ, సమాజానికి వాటి ఉపయోగాన్నీ గుర్తు చేసే మేధావులు వీరు. వీరు రాసిన కొన్ని వ్యాసాల సంపుటిని 'ప్రపంచీకరణ పరిణామాలు, ప్రభావాలు, మహిళల జీవితం' అనే పుస్తకం ద్వారా మనముందు ఉంచారు. దానికి ముందుమాట రాయమని నన్ను అడగడం నాకు చాలా ఆనందదాయకం. గత రెండు శతాబ్దాలుగా ప్రపంచీకరణ అనే భావజాలం శరవేగంతో ముందుకు సాగుతోంది. ఉత్పత్తి శక్తుల పెరుగుదలతో వచ్చిన కంప్యూటర్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి చెందిన పరికరాలతో మొత్తం ప్రపంచంలో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో ఊహించలేనంతగా మార్పులు వస్తున్నాయి. ఈ మార్పులు గ్రహించటానికి, వాటి పరిణామాలు అర్థం చేసుకోటానికి ఈ పుస్తకం ఒక ప్రయత్నం. ఇవి గ్రహించే పద్ధతి ఒక మార్క్సిస్టు పద్ధతిగా ఎంచుకుని తెలుగు సాహిత్యం ద్వారా దానిని విశదీకరించటం ఈ పుస్తకం ప్రధాన లక్ష్యం. సాహిత్యంలో సమాజాన్ని చూసే క్రమం ఈ పుస్తకం ప్రత్యేకత.

మనిషి ఒక సంఘజీవి అంటే మనిషి సామాజిక సంబంధాల ద్వారా అస్తిత్వాన్ని పొందుతాడు. ఆ సామాజిక సంబంధాల ద్వారా తన చైతన్యంతో మార్పుని ఆశిస్తాడు. మార్పులు చేస్తాడు. ఈ ప్రక్రియలో మనిషి చాలావరకు తన ఇష్టానుసారం చెయ్యడానికి ప్రయత్నం చేస్తాడు. జ్ఞాన ప్రపంచంలో చూసుకుంటే ఎక్కడో పుట్టిన న్యూటన్, ఐన్‌స్టీన్, మార్క్స్ లాంటి వాళ్ల జ్ఞానాన్ని మనిషి తన ఇష్టానుసారం తనదిగానే చేసుకుంటాడు. అలాగే ఉత్పత్తి ప్రపంచంలో చూసుకుంటే ఎక్కడో అరబ్‌దేశాలలో ఉండే కాఫీ, ఇంకా ఇంగ్లీష్ కూరలుగా చెలామణి అయ్యే కాలీఫ్లవర్, బఠానీ లాంటి వాటిని ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి చేసుకుంటున్నారు. అలాగే మనిషి తినే పదార్థాలలో బ్రెడ్, చపాతీ వంటివి ఒక సాంస్కృతిక పరిధి నుండి మరొక సాంస్కృతిక పరిధిలోకి సంకల్పితంగా వచ్చిన మార్పులకు ఉదాహరణ. మానవ చరిత్రలో ఈ ఉదాహరణలు మనిషి మరొక మనిషి మీద ఆధారపడే పరిస్థితిని తెలియజేస్తుంది. ఆ మనిషి మరొక మనిషిని అనుకరించటం సూచిస్తుంది. ఈ అనుకరించటంలో ప్రతి మనిషికీ తనకుండే ప్రత్యామ్నాయ మార్గాలలో ఒక దానిని ఎంచుకునే స్వేచ్ఛ ఉంటుంది. ఈ క్రమంలో కొంత బలవంతం ఉన్నా స్వయం సంకల్పం కూడా కొంత భాగం ఉంటుంది. సంఘజీవిగా ఉన్న మనిషి ఆ సంఘం నుంచి నేర్చుకునే క్రమంలో, ఆ సంఘం ఇచ్చిన జ్ఞానం ఉపయోగించుకునే క్రమంలో, ఆ సంఘం ఇచ్చిన జ్ఞానాన్ని పెంచే క్రమంలో ఆ సంఘం అనే దానికి ఒక పరిధి, పరిమితి లేకుండా చూస్తాడు. అది ఎక్కడో ఉన్న ఎస్కిమో కావచ్చును, పాతరాతి యుగం మనిషి కావచ్చును, చైనీస్ కమ్యూన్ కావచ్చును. ఆ జ్ఞానం తన ఇష్టానుసారం ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవడానికి మనిషికి దోహదపడుతుంది. ప్రపంచ కార్మికులారా ఏకంకండి అనే నినాదం మార్క్స్ చెప్పే ప్రపంచీకరణకు మూలం.

మనం ప్రస్తుతం చూసే ప్రపంచీకరణ దీనికి విరుద్ధంగా, సమాజ అభివృద్ధికి ప్రత్యామ్నాయమే లేదు అనే భావజాలాన్ని కేంద్రం మనముందు ఉంచుతుంది. ఈ భావజాలంలో భాగంగా ఆర్థిక సంబంధాలలో రాజ్యానికి సంబంధం ఉండకూడదనీ, అటువంటి సంబంధాలు మార్కెట్టు పరంగానే జరగాలనీ, రాజ్యానికి సార్వభౌమత్వం ఉండకూడదనీ, ఆర్థిక సంబంధాలను నిర్దేశించే క్రమం ఆ సమాజంలోని శక్తులే కాక ప్రపంచ శక్తులకు ప్రాధాన్యతనివ్వాలని అనేది ఈ భావజాలంలో ఒక ప్రాథమికాంశం. మార్కెట్లే అభివృద్ధిని సాధించగలవనీ, రాజ్యానికి అభివృద్ధి క్రమంలో చోటు లేదని, రాజ్యం అభివృద్ధి నిరోధక శక్తి అని ఈ భావజాలంలో ఉన్న సారాంశం. పుస్తకంలో మొదటి వ్యాసం ఈ అంశాన్ని సుదీర్ఘంగా చర్చించింది. ఈ భావజాలాన్ని ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి లాంటి సంస్థలు ప్రచారం చేస్తోంటే, మన కేంద్ర ప్రభుత్వం (పి.వి. నరసింహారావు గారి కాలంలో), రాష్ట్ర ప్రభుత్వం (చంద్రబాబునాయుడి కాలంలో) మనకు మరొక ప్రత్యామ్నాయం లేదు అని ప్రవేశపెట్టిన సంస్కరణలే ప్రస్తుతం అమలవుతోన్న నూతన ఆర్థిక విధానాలు.

రాజ్యం, సార్వభౌమత్వం మీద అవగాహన కావాలన్నా, ప్రస్తుత ప్రపంచీకరణ కార్యక్రమాన్ని అర్థం చేసుకోవాలన్నా మనం సమాజాన్ని ఎలా అవగాహన చేసుకుంటాం అనే దాని మీద కొంత స్పష్టత కావాలి. ఒక సామాజిక వ్యవస్థ మరొక సామాజిక వ్యవస్థ నుంచి రూపంలోనూ సారం లోనూ ఉండే తేడాలను గ్రహించటం ఆ సామాజిక వ్యవస్థ మిగులు ఉత్పత్తిని తయారు చేసే క్రమం, ఆ మిగులు ఉత్పత్తి మీద అధికారం ఎవరికి చెందుతుంది అనే దాని మీద ఆధారపడుతుంది. ఆ అధికారం మిగులు ఉత్పత్తిని తయారుచేసే క్రమాన్ని కనుమరుగు చేసి ఒక భావజాలంగా మారి సమాజ నిర్మాణాన్ని ఆదేశిస్తుంది. ఆ సమాజ చైతన్యాన్ని నిర్దేశిస్తుంది. ఉదాహరణకు భూస్వామ్య సమాజం భూమిని కేంద్రంగా, భూమి మాత్రమే మిగులు ఉత్పత్తికి ఆధారం అనే భావజాలాన్ని ప్రచారం చేస్తుంది. ఎవరికి ఎంత ఎక్కువ భూమి ఉంది, ఎంత సారవంతమైన భూమి ఉంది, దాని నీటి వనరులు మిగులు ఉత్పత్తి చేసే క్రమంగా కనిపిస్తుంది. అదే భావజాలంగా మిగులుతుంది. ఉత్పత్తి చేసే మనిషి మిగులు ఉత్పత్తికి కేంద్రంగా కనిపించడు. ఆ మిగులు ఉత్పత్తి కౌలు రూపంలో, పన్నుల రూపంలో కొంతమంది అధికారం కింద భావజాలంగా మారుతుంది. పెట్టుబడిదారీ సమాజంలో ఉత్పత్తి చేసే మనిషి సరుకుగా, ఉత్పత్తులు సరుకులుగా ఉద్భవించిన క్రమంలో, దాని ప్రథమ దశలో మనిషే ఉత్పత్తికి కేంద్రంగానూ మిగులు ఉత్పత్తికి కేంద్రంగానూ కనిపిస్తుంది. ఈ దశలో మిగులు ఉత్పత్తి మనిషిని శ్రామికుడుగా చూసి ఎంత పెద్ద మొత్తంలో శ్రామికులను క్రోడీకరించగలిగితే అంత పెద్ద మొత్తంలో మిగులు ఉత్పత్తి తయారవుతుందనేది ఆచరణలో సాధించి ఆలోచనలో భాగమైంది. ఈ కాలంలో వచ్చిన భావజాలాన్ని క్లాసికల్ పొలిటికల్ ఎకానమీ అంటారు. ఈ భావజాలం కొన్ని రూపాలలో ప్రస్తుతం కూడా మార్కెట్టు చెయ్యగలిగిన సామాజిక మార్పులు, అభివృద్ధి మీద ప్రభావం చూపిస్తుంది. ఇది ప్రపంచీకరణ భావజాలంలో చాలా ముఖ్యపాత్ర వహిస్తుంది. పెట్టుబడిదారీ రెండవదశలో ఉత్పత్తి పరికరాలను విప్లవీకరించటంతో మొదలై ఉత్పత్తి పరికరాల క్రోడీకరణతో అంతమౌతుంది. ఈ కాలంలో ఉత్పత్తి పరికరాలే మిగులు ఉత్పత్తికి కేంద్రమని, శ్రామికుడుగా ఉద్భవించిన మనిషి మిగులు ఉత్పత్తి క్రమంలో తన స్థానాన్ని కోల్పోతాడు. ఈ భావజాలానికి మిగులు ఉత్పత్తి పెద్దపెద్ద ఫ్యాక్టరీల వలన, పెద్దపెద్ద డ్యాంల వలన సాధ్యమౌతుంది అనేది ప్రధానం. నిరుద్యోగ సమస్య అనేది ఒక సామాజిక సమస్యగా ఉంటుంది. కానీ మిగులు ఉత్పత్తి చేసే ఆర్థిక సమస్యగా కనబడదు. కీన్సుగారు చెప్పిన సిద్ధాంతాలు కూడా నిరుద్యోగ సమస్యని ఒక సాంఘిక, సంక్షేమ సమస్యగా చూసింది కానీ ఆర్థిక సమస్యగా చూడలేదు. ఈ దశ నుండి పెట్టుబడిదారీ వ్యవస్థ మూడో దశకు చేరింది. ఈ దశలో శ్రామికుల క్రోడీకరణ కాకుండా, పరికరాల క్రోడీకరణ కాకుండా, ఆర్థిక క్రోడీకరణ ప్రధానంగా చోటు చేసుకుంది. పెద్ద పెద్ద బ్యాంకులు, అంతర్జాతీయ బ్యాంకులు కేంద్రంగా సాగే పద్ధతిలో మిగులు ఉత్పత్తి అనేది ఫైనాన్స్ క్యాపిటల్ ద్వారానే సాధ్యమనే భావజాలం చోటు చేసుకుంటుంది. ప్రపంచీకరణకు ఇది మూలం, ఇది ఒక నేపథ్యం కూడా. ప్రపంచంలో ఉన్న బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల ఆదాయం చిన్న దేశాల జాతీయ ఆదాయం కంటే ఎన్నో రెట్లు అధికంగా ఉంటుంది. ఆ ఆధిక్యత ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ దిశ, గమనం నిర్దేశించే అధికారానికి మూలమవుతుంది. ఒక ఆంధ్రప్రదేశ్ తన పేదరిక నిర్మూలనకు కానీ, ఒక నీటి పారుదల పథకాన్ని అమలు చేయటానికి కానీ, ఒక ఫ్యాక్టరీ నిర్మించటానికి కానీ తన వనరుల సహాయంతో చేసుకోలేదని, దానికి ప్రపంచబ్యాంక్, ఎ.డి.బి., డి.ఎఫ్.ఐ.డి. ఇత్యాది సంస్థల సహాయం లేకపోతే ఆ పనులు సాధ్యంకావు అనే భావజాలం ప్రధానంగా మన ఆర్థిక వ్యవస్థని నిర్దేశిస్తోంది. సమాజగమనానికి ఇంకొక ప్రత్యామ్నాయం లేదు అనే నిస్సహాయస్థితికి నెట్టివేస్తుంది. స్వాతంత్ర్యానంతరం ఒక నెహ్రూ నేతృత్వంలో ఆర్థిక ప్రగతిని స్వశక్తితో సాధించగలం అని బయలుదేరిన భారత సమాజం నరసింహారావుగారి సమయానికి స్వశక్తితో, స్వావలంబనతో అది సాధ్యం కాదని, ప్రపంచీకరణలో భాగంగానే ఆర్థిక ప్రగతి సాధ్యమనీ, మరే ప్రత్యామ్నాయ మార్గమూ లేదనే దశకి చేరుకున్నాము.

ప్రస్తుతం ప్రపంచీకరణ ప్రపంచవ్యాప్తంగా ఒకే రకమైన ఉత్పత్తి సంబంధాలు – మార్కెట్టు నిర్దేశించే ఉత్పత్తి సంబంధాలు, ఒకే కరెన్సీ, ఒకే టెక్నాలజీ, ఒకే రకమైన తినుబడి సరుకులు, ఒకే భాష, ఒకే సంస్కృతి ఉండే దిశగా పయనించాలని నిర్దేశించే క్రమం. ఆ దిశే ప్రగతి, ప్రగతికి మరో ప్రత్యామ్నాయం లేదు అనే నిస్పృహ, నిస్సహాయత మీద ప్రపంచీకరణ భావజాలం పనిచేస్తుంది. ఈ భావజాలంలోనే ఎండ్ ఆఫ్ హిస్టరీ, క్లాష్ ఆఫ్ కల్చర్స్ అనేవి ఈ మధ్యకాలంలో తరుచూ వినే నినాదాలు. మాతృభాషకంటే ఆంగ్లమే ముఖ్యమని జరిగే చర్చలు దీనిలో భాగమే. ఇస్లాం మీద విస్తృతమైన దుష్ప్రచారం కూడా మనం తరుచూ వింటూ ఉంటాం. స్త్రీని విలాస వస్తువుగా చూడటమనేది చాలా కాలం నుంచీ జరుగుతున్నా, ప్రస్తుత సమయంలో స్త్రీ అవయవ సౌందర్యం ప్రధానమై, ఆమె ఆలోచన అప్రధానమైపోవటం ప్రపంచసుందరి పోటీలలో మార్కెట్టు సాంప్రదాయం తీసుకుని వచ్చిన గణనీయమైన మార్పు. ప్రపంచీకరణ అన్ని సామాజిక సంబంధాలను మార్కెట్ల రూపంలో చూడటం ఈ మార్పుకి కేంద్రం.

ఈ పుస్తకానికి వస్తే, రెండవ వ్యాసం భారతదేశ వ్యవసాయపు రంగానికి సంబంధించింది. మొదటిసారి చదివినపుడు ఈ వ్యాసం ఈ పుస్తకంలో భాగంగా ఉండకూడదేమోనని అనిపించింది. కాని రెండవసారి చదివినపుడు ఈ వ్యాసం విలువ తెలిసింది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతం అధికంగా ఉండే భారతదేశం, అందునా వ్యవసాయ రంగం కేంద్రంగా ఉండే గ్రామీణ ప్రాంతం నెహ్రూ హయాం నుండి ప్రస్తుత ప్రపంచీకరణ హయాం వరకూ సాధించలేని ప్రగతి, ప్రజల ఆకాంక్షలు నెరవేరక సంక్షోభం నుండి సంక్షోభంలోకి కొట్టుకుపోతున్న వ్యవసాయ రంగం డ్యాంలు, కొత్త వంగడాలు, అధిక ఉత్పత్తి చేసే ఎరువులు, పురుగుల మందుల నుండీ ఒక ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటోంది. అప్పటి తెలంగాణ ఉద్యమం నుంచీ ఇప్పటి నక్సలైటు ఉద్యమం వరకూ ఆ సంక్షోభం వేసిన ప్రశ్నకి ప్రత్యామ్నాయ సమాధానం వెతకడంలో ఆంధ్రప్రదేశ్ అలా పోరాడుతూనే ఉంది. ప్రపంచీకరణ కాలంలో, రైతుల ఆత్మహత్యలు అనే ఒక సంక్షోభానికి ప్రపంచీకరణ ప్రభంజనం ఒక సమాధానం కాదనీ, అది ఒక కొత్త సంక్షోభాన్ని ప్రవేశపెడుతుందనీ చెప్పక చెప్పే వ్యాసం ఇది. నవలల ఆధారంగా వ్రాసిన ఈ వ్యాసం పుస్తకంలో చోటు చేసుకోవడం గొప్ప విషయం. మిగతా వ్యాసాలలో స్త్రీ దృక్పథం నుంచి ప్రపంచీకరణని చూసే పద్ధతి, అందునా సాహిత్యం ద్వారా చూసే పద్ధతి చాలా బాగుంది. ఈ పద్ధతిలో కాత్యాయని విద్మహే, జ్యోతిరాణిలు ఇంకొంచెం శ్రమచేసి ఒక్కొక్క దానిమీద ఒక్కొక్క పుస్తకంతేగలిగితే సమాజం వాళ్ళకి రుణపడి ఉంటుంది. ◆

రాజశేఖర రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మూడు సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బేరీజు వేస్తున్నారు జె. శివరామ్

వై.ఎస్. పాలన తీపి - చేదుల మేళవింపు

నేటి రాజకీయ వ్యవస్థలో ఏ రాజకీయ పార్టీ అయినా ఎన్నికల సమరాంగణంలో విజయం సాధించి, ప్రభుత్వ అధికార పగ్గాలు చేపట్టిన వెనువెంటనే తాము ప్రజలకిచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవెందుకు? అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం సర్వసాధారణం. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో హైటెక్ పాలన వల్ల గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌ను తృణీకరించటం జరిగింది. జన్మభూమి లాంటి కార్యక్రమం అమలు చేసింది. ఈ కార్యక్రమం సజావుగా అమలు జరగలేదని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చేసిన అధ్యయనంలో వెల్లడయింది. రాష్ట్ర రాజధాని అయిన హైదరాబాద్ చుట్ట పక్కల అభివృద్ధి చేసి మాదాపూర్‌ను హైటెక్ సిటీగా రూపుదిద్దటం తప్ప చంద్రబాబు హయాంలో గ్రామీణ ప్రాంతాలకు ఒరిగిందేమిలేదు. నిధులు మాత్రం భోజ్యమైపోయినట్లు దాఖలాలు కోకొల్లలు. అటువంటి సమయంలో అప్పటి విపక్ష నేతగా ఉన్న వై.ఎస్. రాజశేఖర రెడ్డి చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను తన పాదయాత్ర ద్వారా ప్రజలను చైతన్యవంతులుగా చేసి 2004లో శాసనసభకు జరిగిన సారస్వత ఎన్నికల సమరాంగణంలో కాంగ్రెస్ పార్టీకి ఘనవిజయం చేకూర్చటం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెనువెంటనే రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా గురించిన ఫైలుపై సంతకం చేయటం, రైతులు చెల్లించవలసిన రు.1100 కోట్ల విద్యుత్ బకాయిలను మాఫీ చేయటం ద్వారా వై.ఎస్. ఎన్నికల హామీల్లో కొన్నిటికి కట్టుబడ్డారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 26 నీటిపారుదల ప్రాజెక్ట్‌లకు అధిక నిధులు వెచ్చించి త్వరతగతిన పూర్తి చేస్తానని, జలయజ్ఞం కార్యక్రమాన్ని ప్రారంభించి రాష్ట్రాన్ని హరితభూమిగా రూపుదిద్దటం జరుగుతోందని ప్రకటించడమే కాకుండా జాతీయ అభివృద్ధి మండలి సమావేశాల్లో కూడ వక్కాణించటం జరిగింది. కుంటుపోయిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచేందుకు అనుభవజ్ఞుడైన కొణిజేటి రోశయ్యను ఆర్థికామాత్యులుగా చేసారు. తొందరలోనే వై.ఎస్. పాలనకు మూడు సంవత్సరాలు పూర్తి కాబోతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బేరీజు వేయ్యవలసిన ఆవశ్యకత ఎంతైన ఉంది.

రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు ఆలోచించి ప్రతి కదలికలో జాగరూకతవహించి ఆర్థిక క్రమశిక్షణను పాటించేందుకు చర్యలు చేపడుతోంది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఓవర్‌డ్రాఫ్ట్‌లకు పోలేదు సరికదా వైఎస్ అండ్ మెన్స్ అడ్వాన్సులపై ఆధారపడలేదు. 2003-04 లో చంద్రబాబు హయాంలో రు.3771 కోట్లు ఉన్న రెవెన్యూ లోటును 2005-06లో రు.64 కోట్లకు తగ్గించడమే కాకుండా 2007-08 బడ్జెట్ అంచనాల ప్రకారం రు.36 కోట్లకు తగ్గించాలని ప్రభుత్వ సంకల్పం. పన్నెండవ ఆర్థిక సంఘం చేసిన సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ద్రవ్య జవాబుదారీ, బడ్జెట్ నిర్వహణా చట్టం 2005 పేరిట ఒక చట్టాన్ని 2005 జూన్ 3 నుంచి అమలులోకి తెచ్చింది. ఈ చట్టం అమలువల్లే లోటును తగ్గించుకోగలుగుతున్నాం.

ఒక రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బేరీజు వెయ్యాలంటే ఆర్థిక వనరులను విశ్లేషించవలసి ఉంటుంది. రాష్ట్రానికి లభించే ఆర్థిక వనరులు రెండు రకాలు. అవి కేంద్రం నుండి బదలాయింపబడే వనరులు, రెండవది రాష్ట్ర సొంత వనరులు. కేంద్రం నుండి బదలాయింపబడే వనరులను తిరిగి రెండు రకాలుగా విభజించవచ్చును. అవి కేంద్రం వసూలు చేసే పన్నులలో వాటా, సహాయక గ్రాంట్లు.

కేంద్రం వసూలు చేసే పన్నుల వాటాగా 2003-04 లో మన రాష్ట్రానికి రు.5069 కోట్లు లభించగా, అంచలంచెలుగా పెరిగి 2007-08లో రు.9191 కోట్లకు పెరుగుతుందని అంచనా. సంఖ్యాపరంగా పెరిగినా మొత్తం రాష్ట్రం రెవెన్యూ రాబడిలో ఈ పన్నుల వాటా 2003-04లో 18.9 శాతం ఉండగా, 2007-08లో 16.7 శాతం వాటాకు తగ్గబోతోందని అంచనా. ఇక భారత ప్రభుత్వం నుండి లభిస్తున్న గ్రాంట్లు 2003-04లో రు.4389 కోట్లు ఉండగా, 2004-05లో రు.2681 కోట్లు తగ్గినా క్రమక్రమేణా పెరిగి 2007-08లో బడ్జెట్ అంచనాల ప్రకారం రు.7502 కోట్లకు పెరగబోతున్నాయి. రాష్ట్ర మొత్తం రెవెన్యూ రాబడిలో గ్రాంట్ల వాటా 2003-04లో 16.3 శాతం ఉండగా, 2007-08లో 13.7 శాతం వాటాకు తగ్గబోతున్నాయి. కాబట్టి కేంద్రంలో అధికారంలో ఉన్న ఐక్య ప్రగతిశీల కూటమి ప్రభుత్వంతో సత్సంబంధాలు ఉన్న వై.ఎస్. ప్రభుత్వం కేంద్రం నుండి గ్రాంట్లు ఇంకనూ అధికంగా రాబట్టుకొనేందుకు కృషి

చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మొత్తం మీద కేంద్రం నుండి రాష్ట్రానికి బదలాయించబడిన వనరులు 2003-04లో రు.9458 కోట్లు ఉండగా, 2007-08 బడ్జెట్ అంచనాల ప్రకారం రు.16,693 కోట్లకు పెరుగుతాయని అంచనా.

రాష్ట్ర సొంత వనరులు రెండు రకాలు. అవి రాష్ట్ర ప్రభుత్వానికి సొంత పన్నుల ద్వారా లభించే రాబడి, సొంత పన్నేతర రాబడి. సొంత పన్నుల ద్వారా లభించే రాబడిలో ముఖ్యమైనవి స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఫీజు, అబ్కారి, అమ్మకపు పన్ను, వాహనాల మీద పన్ను ప్రముఖమైనవి. 2003-04 సంవత్సరంలో అమ్మకపు పన్ను ద్వారా రాష్ట్రానికి లభించిన రాబడి రు.9,187 కోట్లు ఉండగా క్రమక్రమేణా పెరిగి విలువ మదింపు పన్ను (వ్యాట్) అమలు పరచినా ఈ అమ్మకపు పన్ను ద్వారా రాష్ట్రానికి రాబడి 2007-08 బడ్జెట్ అంచనా ప్రకారం రు.20,568 కోట్లకు పెరగబోతోంది. అబ్కారి ద్వారా రాబడి 2003-04లో రు.1,915 కోట్లు ఉండగా, 2007-08లో రు.4,125 కోట్లకు పెరుగుతోంది. స్టాంపులు - రిజిస్ట్రేషన్ ద్వారా రాష్ట్రానికి లభించిన రాబడి 2003-04 లో చంద్రబాబు హయాంలో రు.1,112 కోట్లు ఉండగా 2007-08 లో బడ్జెట్ అంచనాల ప్రకారం రు.3,750 కోట్లకు పెరగబోతోంది. దీనికి ప్రధాన కారణం రాష్ట్రంలో భూమి విలువ పెంచడమే. మొత్తం మీద రాష్ట్రానికి సొంత పన్నుల ద్వారా లభించిన రాబడే 2003-04లో రు.13,806 కోట్లు ఉండగా, 2007-08 బడ్జెట్ అంచనాల ప్రకారం రు.31,399 కోట్లకు పెరగబోతోంది. మొత్తం రాష్ట్ర రెవెన్యూ రాబడిలో సొంత పన్నుల ద్వారా లభించిన రాబడి వాటా 2003-04లో 51.4 శాతం ఉండగా, 2007-08 బడ్జెట్ అంచనాల ప్రకారం 57.11 శాతం వాటాకు చేరనుంది. పన్ను రెట్లు పెంచకుండా, పన్ను ఎగవేతను నివారించి సొంత పన్నుల ద్వారా రాబడి పెంచుకోవటం గమనార్హం.

సొంత పన్నేతర రాబడిలో ముఖ్యమైనవి వడ్డీ వసూళ్లు, డివిడెండ్లు, ఇనుము కాని ఇతర గనులు, లోహ పరిశ్రమలు. వడ్డీ వసూళ్లు - డివిడెండ్ల ద్వారా రాబడి 2003-04లో రు.1,867 కోట్లు ఉండగా 2007-08 లో రు.3691 కోట్లకు పెరగబోతోందని బడ్జెట్ అంచనా. మొత్తం రాష్ట్ర సొంత పన్నేతర రాబడిలో వడ్డీ వసూళ్లు - డివిడెండ్ల ద్వారా లభించిన రాబడి వాటా 2003-04లో 51.8 శాతం ఉండగా, 2007-08 బడ్జెట్ అంచనా ప్రకారం 53.8 శాతం వాటాకు పెరుగుతుందని అంచనా. ఇనుము కాని ఇతర గనులు - లోహ పరిశ్రమల ద్వారా రాష్ట్రానికి లభించనున్న రాబడి 2007-08 బడ్జెట్ అంచనాల ప్రకారం రు.1,750 కోట్లు. ఇది మొత్తం రాష్ట్ర సొంత పన్నేతర రాబడిలో 25.5 శాతం. మొత్తంమీద రాష్ట్రంలో సొంత పన్నేతర రాబడి 2003-04లో రు.3,605 కోట్లు ఉండగా 2007-08 లో రు. 6,858 కోట్లకు పెరుగుతుందని అంచనా. కాగా రాష్ట్ర రెవెన్యూ రాబడిలో సొంత పన్నేతర రాబడి వాటా 2003-04 లో 13.4 శాతం ఉండగా 2007-08లో 12.5 శాతం వాటాకు పడిపోతోంది.

2003-04 తో పోలిస్తే రాష్ట్రంలో నేటి ఆర్థిక పరిస్థితి

(రు. కోట్లు)

అంశం	2003-04	2007-08 (బ.అం.)
కేంద్ర పన్నులలో వాటా	5069	9191
గ్రాంట్లు	4389	7502
కేంద్రం నుండి బదలాయింపబడే వనరులు	9458	16693
రాష్ట్ర సొంత పన్నుల నుండి రాబడి	13806	31399
సొంత పన్నేతర రాబడి	3605	6858
మొత్తం రాష్ట్రం రెవెన్యూ రాబడి	26869	54950
రెవెన్యూ వ్యయం	30640	54986
ప్రణాళికా వ్యయం	7345	15668
ప్రణాళికేతర వ్యయం	23295	39318
మూలధన వ్యయం	3441	12869
ప్రణాళికా వ్యయం	3417	12824
ప్రణాళికేతర వ్యయం	24	45
రెవెన్యూ లోటు	3771	36


ఆధారం :1) బడ్జెట్ పత్రాలు
2) భారత కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ నివేదిక

వ్యయం

రాష్ట్ర ఆర్థిక వ్యయాన్ని రెండు రకాలుగా విభజించవచ్చును. అవి రెవెన్యూ వ్యయం, మూల ధన వ్యయం. రాష్ట్రంలో మొత్తం రెవెన్యూ వ్యయం 2003-04 లో రు.30,640 కోట్లు. దీనిలో ప్రణాళికేతర వ్యయం రు.23,295 కోట్లు (76 శాతం) కాగా ప్రణాళికా వ్యయం 24 శాతం. 2007-08 బడ్జెట్ అంచనాల ప్రకారం రెవెన్యూ పద్దు కింద వ్యయం రు.54,984 కోట్లు. దీనిలో ప్రణాళికేతర వ్యయం 71.5 శాతం కాగా ప్రణాళికా వ్యయం 28.5 శాతం. అసలు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికేతర వ్యయాన్ని తగ్గించుకొనేందుకు ప్రయత్నం చేస్తున్నట్లుగా కానవచ్చినా ఇంకనూ రాష్ట్ర రెవెన్యూ వ్యయంలో ప్రణాళికేతర వ్యయమే సింహభాగం అని ఘంటాపథంగా చెప్పవచ్చును.

ఇక మూలధన వ్యయం మొత్తం 2003-04లో చంద్రబాబు హయాంలో రు. 3441 కోట్లు. దీనిలో ప్రణాళికా వ్యయం రు.3417 కోట్లు (99.3 శాతం). ప్రణాళికేతర వ్యయం 0.7 శాతం మాత్రమే. కాగా 2007-08 బడ్జెట్ అంచనాల ప్రకారం రాష్ట్ర మొత్తం మూల ధన వ్యయం రు.12,869 కోట్లు. దీనిలో ప్రణాళికా వ్యయం. రు.12,824 కోట్లు (99.7 శాతం). ప్రణాళికేతర వ్యయం 0.3 శాతమే. అనగా మూలధన వ్యయంకు శాశ్వత ఆస్తులు సమకూర్చునేందుకు చేయటం జరుగుతున్నట్లుగా కానవస్తోంది. రాష్ట్రం మొత్తం మీద వ్యయం (ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయం కలుపుకుంటే) 2003-04లో రు.35,575 కోట్లు ఉండగా, 2007-08 బడ్జెట్ అంచనాల ప్రకారం రు.67,855 కోట్లకు పెరుగుతుందని అంచనా.

పై విశ్లేషణ బట్టి తేలేదేమిటంటే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ వ్యయంలో అధిక భాగం ఉద్యోగుల జీతభత్యాలమీద, ఫించన్ల మీద ఖర్చు పెడుతున్నట్లు అవగతమవుతోంది. మూలధన వ్యయంలో సింహభాగం అభివృద్ధి వ్యయమే చేస్తున్నట్లు కానవస్తోంది. ముఖ్యంగా



గురుకుల మిత్ర

ప్రముఖ హేతువాది, కమ్యూనిస్టు, రచయిత డా. గురుకుల మిత్ర అనారోగ్యంతో ఏప్రిల్ 13న హైదరాబాద్ నల్లకుంటలోని ఆయన నివాసంలో మరణించారు. ఆయన వయస్సు 75 సంవత్సరాలు. గురుకుల మిత్ర 1932లో గుంటూరు జిల్లా రేపల్లెలో జన్మించారు. హైస్కూల్ దశలోనే ఆయన వామపక్ష భావాలను అందిపుచ్చుకున్నారు. పుచ్చలపల్లి సుందరయ్యగారిని ఆరాధ్య నాయకునిగా భావించడమే గాక అనుసరించారు. 1946-48 మధ్య సాగిన తెలంగాణ విముక్తి పోరాటంలో పాల్గొని నిజాం సేనలను ఎదుర్కొన్నారు. అజ్ఞాత జీవితం కూడా గడిపారు. అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు.

ఆదర్శ వివాహాలను ప్రోత్సహించారు. హోమియో డాక్టర్‌గా సేవలందించడమే గాక, ఆక్యుపంచర్ వైద్యంలో శిక్షణపొంది అనేకమందికి మొండి వ్యాధులను పోగొట్టారు. మంచి కవి, రచయిత కూడా. సోషలిజాన్నీ, హేతువాదాన్నీ మేళవించి 'సమసంగం' అనే సంఘాన్ని ఏర్పాటు చేసారు. జాతుల పోరాటాలను బలపరుస్తూ 'ప్రజాభారతం' 'తెలుగుస్తాన్' అనే పత్రికలు నడిపారు. ఆయన కేవలం ఒక వ్యక్తి కాదు, అనేక ఉద్యమాల సమ్మేళనం. సూటిదనం, నిర్భయత్వం, అంకితభావం, పోరాటస్వభావం ఆయినలోని విలక్షణత. ఆయనకు 'వీక్షణం' వినమ్రంగా నివాళులు అర్పిస్తోంది. ◆



'చార్వాక' రామకృష్ణ

నాస్తిక ఉద్యమకారుడు, చార్వాక విద్యాపీఠం వ్యవస్థాపకుడు బొడ్డు రామకృష్ణ విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఏప్రిల్ 18న మరణించారు. ఆయన వయస్సు 72 సంవత్సరాలు. 1972లో ఉద్యోగానికి రాజీనామా చేసి మంగళగిరిలోని నిడమర్రు దగ్గర చార్వాక ఆశ్రమాన్ని నిర్మించి, ప్రతి ఏడాది ఫిబ్రవరి రెండవ శని, ఆదివారాల్లో నాస్తిక మేళాలను నిర్వహించి ప్రత్యామ్నాయ సంస్కృతికి బాటలు వేసారు. సాంస్కృతిక విప్లవం లేకుండా మార్క్సిజం విజయవంతం కాదని నమ్మారు, ఆచరించారు. అనేక పుస్తకాలు రచించారు. హిందూ సంస్కృతికి ప్రత్యామ్నాయాన్ని రూపొందించడంలో గొప్ప కృషి చేశారు. ప్రత్యామ్నాయ సంస్కృతిని విస్తరించడంలో భాగంగా స్వంత ప్రెస్ పెట్టుకున్నారు. అందులో కొన్ని వేల కరపత్రాలు ముద్రించి ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రచారం చేశారు. కుటుంబంలో ఒకలాగ, జీవితంలో మరోలాగా ఉండొద్దని బోధించడమే కాక ఆచరించారు. కులం, కుటుంబాలు భారత సమూహాన్ని కుదించాయనీ, ప్రతి కుటుంబం ఒక సమాజంలా విస్తరించాలనీ తన ఆచరణ ద్వారా చూపారు. 'చార్వాక' రామకృష్ణ మృతికి 'వీక్షణం' తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తోంది. ◆

నీటి పారుదల - వరద నియంత్రణ రంగం మీద. కాగా మొత్తం రాష్ట్ర రెవెన్యూ రాబడి 2003-04లో రు.26,868 కోట్లు ఉండగా ప్రజల మీద అదనపు పన్నులభారం వేయకుండా 2007-08 లో రు.54,950 కోట్లకు పెరుగుతుందని అంచనా. కాని ఏ ప్రభుత్వమైనా బడ్జెట్ సమావేశాల్లో సమర్పించిన రాబడి, వ్యయ గణాంకాలకు - అసలు వచ్చే రాబడి, ఖర్చు గణాంకాలకు పొంతన ఉండవు. బడ్జెట్ అంచనాలు కచ్చితంగా మారతాయి. శాసనసభ బడ్జెట్‌ను ఆమోదించినా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నులు వేయదని గ్యారంటీలేదు. వార్షిక ప్రణాళికలో నీటిపారుదల రంగానికి ప్రాముఖ్యత నిచ్చి 'జలయజ్ఞం' కార్యక్రమం చేపట్టి, ఇప్పటి వరకూ ఈ ప్రభుత్వం ఝంఝావతి, పెద్దెరు, పెద్దగడ్డ, సూరపాడెం ప్రాజెక్టులు పూర్తి చేయటం జరిగింది. మహారాష్ట్రలో బాబ్లి ప్రాజెక్ట్ నిర్మిస్తే మన రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతుంది. ఈ సమస్య పరిష్కారానికి ముందుగా కేంద్ర ప్రభుత్వం నదులను జాతీయం చేసి తమ పరిధిలోకి తెచ్చుకోవాలి. ఏ ప్రాజెక్ట్ కట్టాలన్నా రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాలి. కేంద్రం కూడ రాజకీయాలకు తావివ్వకుండా సరిహద్దు రాష్ట్రాలతో సంప్రదించి ఎవరికీ అన్యాయం జరగకుండా నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే జల జగడాలకు అవకాశముండదు.

ఇక ఈ మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో పారిశ్రామిక అశాంతి ఉన్నట్లుగా కూడా అధికార గణాంకాల ద్వారా తెలుస్తోంది. ఎప్పుడూ గణాంకాల తో సహవాసం చేసే రాష్ట్ర ఆర్థిక గణాంక శాఖ ఇటీవల "గణాంక కరదీపిక 2007" ను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం రాష్ట్రంలో పారిశ్రామిక విభాగాలలో నష్టపోయిన పనిదినాలు 2003-04 చంద్రబాబు హయాంలో 6.13 లక్షలు ఉండగా, 2006లో వై.ఎస్. హయాంలో 22.25 లక్షల పని దినాలు నష్టపోవటం జరిగింది. ఇక రాష్ట్రంలో కుంభకోణాల సంగతి సరేసరి. అవినీతి విశృంఖలంగా వ్యాపిస్తున్నట్లు కానవస్తోంది. ఒకవైపు భూ కుంభకోణం, మరొకవైపు డిపెప్ అవినీతి కుంభకోణం ఇట్లా ఎన్నో ఎన్నెన్నో రాష్ట్ర ప్రభుత్వానికి తలనొప్పిగా మారుతోంది. ఏది ఏమైనప్పటికీ వై.ఎస్. మూడు సంవత్సరాల పాలన తీపి చేదుల మేళవింపు అని చెప్పవచ్చు. ◆




యాభై ఏళ్ల ఆంధ్రప్రదేశ్ పై
ఏకైక విశిష్ట సమాచార, విశ్లేషణా గ్రంథం

ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 1956-2006

సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసెర్చ్ అండ్ కమ్యూనికేషన్ (సిడిఆర్‌సి) ప్రచురణగా, ఆర్. ఎస్. రావు, వి. హనుమంతరావు, ఎన్. వేణుగోపాల్ సంపాదకులుగా వెలువడిన **ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 1956-2006** ను రాష్ట్ర ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి 30 మార్చ్ 2007న ఆవిష్కరించారు. ఆవిష్కరణ సభ మార్చ్ 31న జరగవలసి ఉండగా, ఆరోజే బాబ్లీ ప్రాజెక్ట్ విషయమై ప్రధానమంత్రితో సమావేశమవుతున్న అఖిల పక్ష బృందానికి నాయకత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి ముందురోజే శాసనసభలోని తన కార్యాలయంలో లాంఛనంగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆవిష్కరణ తరవాత మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధినీ, వైఫల్యాలనూ పరిశీలించేటప్పుడు ఈ పుస్తకం ఒక అమూల్యమైన, అవసరమైన పరిశోధక గ్రంథంగా తప్పక ఉపయోగపడగలదని తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

31 మార్చ్ 2007న పుస్తక పరిచయ సభ అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్, హైదరాబాద్‌లో జరిగింది. సభకు వీక్షణం ప్రధాన సంపాదకులు, సిడిఆర్‌సి బోర్డ్ ఆఫ్ డైరక్టర్స్ సభ్యులు వి.హనుమంతరావు అధ్యక్షత వహించారు. రెండు సంవత్సరాలుగా సిడిఆర్‌సి చేసిన కృషిని, ప్రత్యేకించి ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రచురణలో సాధకబాధకాలను ఆయన వివరించారు. సభలో ఆంధ్రప్రదేశ్ యాభై సంవత్సరాల అభివృద్ధిపై కీలక ఉపన్యాసం చేసిన ప్రముఖ చరిత్రకారులు వకుళాభరణం రామకృష్ణ ఆంధ్రప్రదేశ్ చరిత్రను పూర్తిగా అభివృద్ధి అనడానికి వీల్లేదని, అసలు అభివృద్ధి జరగలేదని అనడానికి వీల్లేదని, సాధించిన అభివృద్ధి ప్రజలందరికీ సమానంగా అందిందా లేదా అనేదే ముఖ్యమైన ప్రశ్న అని అన్నారు. చరిత్రకారుడిగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర మీద విహంగావలోకన వ్యాఖ్యలు చేస్తూ, పుస్తకంలోని కొన్ని వ్యాసాలను ఉటంకించి విశ్లేషించారు. సిడిఆర్‌సి సంస్థ ఉద్దేశ్యాలను, లక్ష్యాలను, ఇప్పటివరకూ చేసిన కృషిని డైరెక్టర్ ఎన్. వేణుగోపాల్ వివరించారు. ఆర్థికమంత్రి కె. రోశయ్య మాట్లాడుతూ ఒకవైపు అభివృద్ధి జరుగుతున్నా ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునే స్థాయికి మనం ఇంకా ఎదగాల్సి ఉందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంబంధించి గణాంకాలతో, విశ్లేషణలతో ఉన్న ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధికారులకు, సాధారణ ప్రజలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ పుస్తకం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలకు, ఉన్నతాధికారులకు, వివిధ పరిపాలనాశాఖలకు, గ్రంథాలయాలకు అందేలా తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు. గత మూడు సంవత్సరాలలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పురోగమన దిశలో ఉన్నదని, ఒక్క రోజు కూడా వేస్ అండ్ మీన్స్ నిధులు కానీ, ఓవర్‌డ్రాఫ్ట్ కానీ ఉపయోగించుకోవల్సిన అవసరం రాలేదని, అందువల్ల కేంద్రం ఇచ్చే రాయితీ కూడా అందిందని అన్నారు. ఈ పుస్తకం తొలి ప్రతిని వాణిజ్య శాఖా మంత్రి కొణతాల రామకృష్ణ స్వీకరించారు. సభలో ఈ పుస్తక రచయితలు, వివిధ రంగాల ప్రముఖులు, సిడిఆర్‌సి ఉద్యోగులు, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. సిడిఆర్‌సి బోర్డ్ సభ్యులు, ప్రముఖ వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త కె.ఆర్. చౌదరి తొలుత సభికులకు స్వాగతం పలికారు. ◆



పుస్తకావిష్కరణ సందర్భంగా కె.ఆర్. చౌదరి, వి. హనుమంతరావు, ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి

అసహజ మరణాల సూచి

సంకలనం : **రాంకి**

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. ఆ సహజ మరణపు వయోపరిమితి దేశ కాల పరిస్థితులను బట్టి, జీవన ప్రమాణాలను బట్టి అరవైల నుంచి తొంబైల దాకా ఉండవచ్చు. కాని మన సమాజంలో సాధారణ ఆయు ప్రమాణం 63 సంవత్సరాలు అయినప్పటికీ ఎంతోమంది పుట్టుకలోనే మరణిస్తున్నారు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ మరణం అనేక రూపాలలో సంభవిస్తోంది. ఆకలి, అనారోగ్యం, మానసిక ఆందోళనలు, సామాజిక అసమానతలు, వరకట్న మరణాలు, నిర్లక్ష్యం, అంటరాని తనం, వ్యవసాయం, చేనేత వంటి రంగాల్లోని సంక్షోభాలు, పారిశ్రామిక అశాంతి, జీవనోపాధి లేమి అసహజ మరణాలకు లెక్కలేనన్ని కారణాలున్నాయి. మన పక్కనె మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైనపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగానూ, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే, ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

తేది	ఆత్మహత్యలు			హత్యలు				గుర్తు తెలియని	ఆకలి	ప్రమాదాలు			చికిత్స అందక, అనారోగ్యం	పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
	వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు	ఫ్యాక్షన్	కులం	మతం	తగాదాలు			పనిచేసే స్థలంలో	రహదారి	ఇతరాలు		ఉద్యమ కారులు	ఇతరులు			
26.3.07 నుండి 1.4.07	18	–	17	–	–	–	16	3	–	3*	15	14	2	–	–	–	2	–
2.4.07 నుండి 8.4.07	16	–	23	–	–	–	12	6	–	2*	29	20	–	–	–	–	1	7**
9.4.07 నుండి 15.4.07	8	–	10	1	–	–	4	6	–	1*	38	8	1	–	–	1	5	8**
16.4.07 నుండి 25.4.07	17	–	18	3	–	–	13	7	–	4*	68	34	–	–	–	–	11	1**
మహబూబ్‌నగర్ రవికుమార్	3	–	26	–	–	–	10	21	–	15	54	31	8	–	–	–	–	–
మెదక్ కె. రాజు	9	–	–	–	–	–	–	–	1	4*	–	–	–	–	–	–	–	–
కడప ఎన్.ఎస్.ఖలందర్	–	–	6	1	–	–	4	6	–	–	23	–	6	–	–	–	–	–
మొత్తం	**71**	**–**	**100**	**5**	**–**	**–**	**59**	**49**	**1**	**29**	**227**	**107**	**17**	**–**	**–**	**1**	**19**	**16**

* రాత్రి కరెంట్ వలన **10** మంది రైతులు చేనుకు నీళ్లు కట్టడానికి వెళ్లి చనిపోయారు. ** వడదెబ్బ వలన చనిపోయారు

గమనిక : మీ అందరి సహకారంతో అన్ని జిల్లాల పూర్తి సమాచారంతో భవిష్యత్తులో ఈ శీర్షికను మరింత సమగ్రంగా అందించే ప్రయత్నం చేస్తాం.

RNI Regn. No. APTEL/2003/11482 Published on 27-03-07 PRINTED BOOK

Owned, Printed and Published by V. Hanumantha Rao at 301, Mythri Residency, 3-6-394, Road No. 3, Himayat Nagar, Hyderabad - 500 029. Ph : 66843495. Printed at Charita Impressions, Azamabad, Hyderabad. For Nutan Art Printers, Hyderabad. Working Editor : N. Venugopal

VEEKSHANAM
301, Mythri Residency, 3-6-394, Road No. 3, Himayatnagar, Hyd-29.